www.visalaandhra.com Dwaraka స్థాపితం : 1952

# విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17 అక్షరాక్షరం అభ్యుదయం





సంపుటి : 66 సంచిక : 211 | సోమవారం 22-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ


## ఆప్ ఎమ్మెల్యేలపై రాష్ట్రపతి వేటు



న్యూఢిల్లీ : ఢిల్లీ అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేల అనర్హతపై నోటిఫికేషన్ జారీ అయింది. ఎన్నికల సంఘం సిఫార్సును రాష్ట్రపతి ఆమోదించారు. 2015, మార్చి 13, 2016, సెప్టెంబరు 8 మధ్య లాభదాయక పదవులు కలిగి ఉన్నందుకు 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘం(ఈసీ) రాష్ట్రపతి కోవింద్‌కు సిఫార్సు చేసింది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమితులై లాభదాయక పదవుల్లో కలిగి ఉన్నారంటూ పిటిషనర్ ప్రశాంత్ పటేల్ పేర్కొన్నారు. పార్లమెంటరీ కార్యదర్శులు మంత్రులకు సహాయంగా ఉంటారు. అయితే ఆ పదవిలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యేలు ఎటువంటి వేతనాలు, ప్రయోజనాలు పొందడం లేదని ఆప్ స్పష్టం చేసింది. ఈ సమస్యకు సంబంధించి ఎన్నికల సంఘం తన - మిగతా 2 లో

## న్యాయపోరాటం చేస్తాం : కేజ్రీ



న్యూఢిల్లీ : రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నిర్ణయంపై ఆప్ మండిపడింది. నకిలీ కేసులు మోపి దోషులుగా నిలిపిన విధానంపై న్యాయపోరాటం చేస్తామని ప్రకటించింది. తమ ఎమ్మెల్యేల అనర్హతను రాష్ట్రపతి ఆమోదించడాన్ని ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగమే సర్వోన్నతమైనదని కేజ్రీవాల్ అన్నారు. ఈ దేశ రాజ్యాంగ విలువలను అనేక పర్యాయాలు కోర్టులు పరిరక్షించాయన్నారు. కాగా లాభదాయక పదవులు కలిగి ఉన్నారంటూ తమ 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటును రాష్ట్రపతి ఆమోదించడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆప్ ఆదివారం అభివర్ణించింది. 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘం చేసిన సిఫార్సును రాష్ట్రపతి ఆమోదించారు.

అనర్హతకు గురైన 20 మంది ఎమ్మెల్యేలలో ఒకరైన మదన్‌లాల్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపైనే అన్ని ఆశలూ - మిగతా 2 లో

## వాళ్లు వీధి కుక్కలు

- దళితులపై కేంద్ర మంత్రి అనుచిత వ్యాఖ్యలు
- హెగ్డే ఓ సీరియల్ నేరస్తుడు : ప్రకాష్ రాజ్



బళ్లారి : రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేయాలని, లౌకికవాదంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అనంత కుమార్ హెగ్డే మరో మారు నోరు జారారు. శాంతియుతంగా నిరసన తెలిపే దళితులను 'అరిచే వీధి కుక్కల'తో పోల్చారు. వీధి కుక్కల అరుపులకు తామేమీ బెదరమని అనంత కుమార్ హెగ్డే నోరు జారడాన్ని దళితులు తీవ్రంగా ఖండించారు. వివరాల్లోకి వెడితే... పార్లమెంటులో లౌకికవాదంపై హెగ్డే చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసన తెలియజేయాలని దళితులు నిర్ణయించుకున్నారు. కర్నాటకలోని బళ్లారి జిల్లాలో ఉపాధి మేళా ప్రారంభోత్సవానికి మంత్రి అనంత కుమార్ హెగ్డే వచ్చిన విషయం వారి దృష్టికి వచ్చింది. దీంతో హెగ్డే ప్రయాణించే మార్గంలో బైఠాయించి నిరసన తెలిపారు. హెగ్డే అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అదే సమయంలో అక్కడకు చేరిన ఎలక్ట్రానిక్ ఛానల్‌తో మంత్రి హెగ్డే మాట్లాడుతూ తామున్నది ప్రజలను ఆదుకునేందుకేనన్నారు. కారుకు అడ్డుగా బైఠాయించి నినాదాలు చేస్తున్న దళితులను ఉద్దేశించి అన్నట్లుగా 'వీధి కుక్కల అరుపులకు తాము భయపడేది లేద'ని హెగ్డే నోరు జారారు. సమస్యల పరిష్కారం కోసం కొన్ని ఏళ్లుగా దళితులు పోరాటం చేస్తున్నారని కాంగ్రెస్ అధికార - మిగతా 2 లో

బ్యాంకు సేవలు

## బహుదూరం..!

### 241 పంచాయతీల్లో బ్యాంకుల్లేవు!

- లావాదేవీలకు పది కిలో మీటర్ల ప్రయాణం
- మెట్రో నగరాలకే బ్యాంకర్ల ప్రాధాన్యం
- 30 వేల కుటుంబాలున్నా పట్టించుకోని వైనం




విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో ఇప్పటికీ 241 గ్రామ పంచాయతీలు బ్యాంకు సేవలకు నోచుకోవటంలేదు. కొన్ని గ్రామాల్లో ఐదు కిలో మీటర్లకు ఒక బ్యాంక్ బ్రాంచ్ కూడా లేని పరిస్థితి ఉంది. వందలోపు జనాభా ఉన్న గ్రామాలకు కనీసం బ్యాంక్ అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేయాలని ఆర్‌బీఐ గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. వెయ్యి మంది జనాభా ఉన్న ప్రాంతాల్లో సైతం బ్యాంక్ సేవలు అందుబాటులో లేవు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో అన్ని గ్రామాల్లోనూ బ్యాంక్ బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలని గత ఏడాది మేలో ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ఆర్థికశాఖ ప్రత్యేకంగా బ్యాంకింగ్ విధానాన్ని కూడా అమలు చేస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఒక్కో పంచాయతీలో కనీసం ఐదారు గ్రామాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల ప్రజలు బ్యాంక్‌లో నగదు డిపాజిట్ చేయాలన్నా, తీసుకోవాలన్నా కనీసం పది కిలో మీటర్ల మేర ప్రయాణం చేయాల్సిన దుస్థితి రాష్ట్రంలో ఉంది. ఇటీవల వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో బ్యాంక్ సేవలకు నోచుకోని - మిగతా 2 లో

బ్యాంక్‌ల వారీగా సేవలు అందుబాటులోని గ్రామ పంచాయతీలు

| బ్యాంక్ పేరు | గ్రామ పంచాయతీల సంఖ్య |
|---|---|
| ఆంధ్రాబ్యాంక్ | 31 |
| ఏపీజీవీబీ | 69 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 1 |
| బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర | 1 |
| కెనరా బ్యాంక్ | 6 |
| ఇండియన్ బ్యాంక్ | 6 |
| ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ | 14 |
| కోటక్ మహేంద్ర | 1 |
| ఎస్‌బీఐ | 93 |
| యూకో బ్యాంక్ | 6 |
| యూబీఐ | 8 |
| విజయా బ్యాంక్ | 5 |
| మొత్తం | 241 |



ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

## సుధీర్, నాగేశ్వరరావు

విశాలాంధ్ర - తిరుపతి కార్పొరేషన్ : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ ) రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం జరిగినట్లు సంఘ ఎన్నికల అధికారి రవి, పరిశీలకులు తులసీరామ్ తెలిపారు. రాష్ట్ర సంఘ నూతన అధ్యక్షులుగా సిహెచ్.జోసెఫ్ సుధీర్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా గాజుల నాగేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా పి.సుబ్బ రాజు, అసోసియేట్ అధ్యక్షులుగా గంటా మోహన్, యు.జయరామయ్య, కె.గౌరీశంకర్, కె.వి.శేఖర్, డి.వి.ఎ.వి.ప్రసాదరాజు, ఎ.నీల కంఠయ్య, బి.శ్రీనివాసులును ఎన్నుకున్నారు. అదనపు ప్రధాన కార్యదర్శులుగా ఎం.వి.రమణప్ప, జె.శ్రీనివాస్, టి.వి.రమణయ్య, కె.ఎస్.సన్యాసిరావు, వి.భానురెడ్డి, కె.వి.రాచంద్రరావు, రఫీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కార్యదర్శులు, ఆర్థిక కమిటీ సభ్యులుగా 13 జిల్లాల నుంచి సభ్యులు ఎన్నికయ్యారని తెలిపారు.

## కొత్త సీఈసీగా రావత్ నియామకం



న్యూఢిల్లీ : భారత ఎన్నికల సంఘం తదుపరి ప్రధానాధికారి (సీఈసీ)గా ఎన్నికల కమిషనరు ఓం ప్రకాష్ రావత్ నియమితులయ్యారు. ఆదివారం ఆయన నియామకాన్ని కేంద్ర న్యాయశాఖ ప్రకటించింది. ప్రస్తుత సీఈసీ ఏకే జోతి సోమవారం పదవీ విరమణ చేయనున్నారు. కాగా, మాజీ ఆర్థిక కార్యదర్శి అశోక్ లావాసాను ఎన్నికల కమిషనరుగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జోతి పదవీ విరమణ కారణంగా ముగ్గురు సభ్యులుండే ఎన్నికల సంఘంలో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడానికి ఈనియామకం జరిపినట్లు ప్రభుత్వం తెలిపింది.మరో కమిషనరుగా సునీల్ అరోరా కొనసాగుతారు.


### హోదాపై బాబు మళ్లీ మోసం
సాధన సమితి నేతలు రామకృష్ణ, చలసాని, శివాజీ విమర్శ 11 లో

### వర్ణ వ్యవస్థను తిప్పికొడదాం..
చటోపాధ్యాయ రచనలు స్ఫూర్తిదాయకం
ప్రోగ్రెసివ్ ఫోరమ్ జాతీయ అధ్యక్షుడు కేఎస్.చలం 3 లో

### టీబీ నియంత్రణకు చర్యలు
ముఖ్యమంత్రులకు ప్రధాని మోదీ విజ్ఞప్తి 9లో
కేసు గుర్తింపు, చికిత్సలను నిశితంగా పరిశీలించాలి

### టెట్ షెడ్యూలు యథాతథం
ఫిబ్రవరి 5 నుంచి 15 వరకు పరీక్షలు 12లో
నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు


'అగ్రి' బాధితుల కోసం

## మండలాల్లో జీపు యాత్రలు

- బడ్జెట్ సమావేశాల్లో చలో అమరావతి
- రేపు, ఎల్లుండి బాధితుల సర్వసభ్య సమావేశాలు
- అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయటంలో తాత్సారం జరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు ఈ నెల 23, 24 తేదీలలో విజయవాడలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ - మిగతా 2 లో

## ప్రజలే సుప్రీం.. సమర్థతకే పట్టం

- 175 నియోజకవర్గాలలో గెలుస్తాం
- దళిత తేజంతో దళితుల వద్దకు..
- టీడీపీ వర్క్ షాప్‌లో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు



విశాలాంధ్ర అమరావతి : ప్రజలే సుప్రీం.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం.. సమర్థమైన నాయకుడికే ప్రజలు పట్టం కడతారు.. భవిష్యత్ ఎన్నికలు ఇందుకు ప్రామాణికమని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీపై ప్రతి ఒక్కరిలో పూర్తిస్థాయి సంతృప్తి రావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం పక్కన ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ భవనంలో టీడీపీ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావ్ అధ్యక్షత వహించారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ గతాన్ని తలుచుకొని భవిష్యత్తుకి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ప్రజల్లో ఎప్పుడైతే పూర్తిస్థాయిలో సంతృప్తి సాధించగలమో అప్పుడే గెలుపు అందుకోగల మన్నారు. విభాగాలుగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. విభజన క్రమంలో రాష్ట్రాన్ని పూర్తిగా నష్టపరిచిన కాంగ్రెస్‌కి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం మళ్ళీ సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి రాజధాని నిర్మాణానికి ఉదారంగా 33 వేల ఎకరాల భూములు ఇచ్చిన రైతులకు తెలుగుదేశం పార్టీ రుణపడి ఉంటుందని అన్నారు. గ్రామాలలో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకెళ్తుందని తెలిపారు. ఈ ఏడాది జరిగిన జన్మభూమి తనకి పూర్తిస్థాయిలో సంతృప్తి ఇచ్చిందని హర్షం - మిగతా 2 లో


వంశధార లీజులో 'గలీజు' 3 లో


## ఇదీ లోకం!




నువ్ చెయ్..నేను విదేశాలకు వెళతా ఓకే!

## కాంగ్రెస్‌తో పొత్తు లేదు

- బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం
- సీపీఎం రాజకీయ ముసాయిదా తీర్మానం



కోల్‌కతా : కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తు లేదా సర్దుబాటును తోసిపుచ్చుతూ రాజకీయ ముసాయిదా తీర్మానాన్ని సీపీఎం కేంద్ర కమిటీ ఆదివారం ఆమోదించినట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు. కాంగ్రెస్‌తో పొత్తుల విషయంలో చిన్న చిన్న సవరణలు చేసి రాజకీయ తీర్మానాన్ని ఆమోదించినట్టు ఆయన వెల్లడించారు. కేంద్ర కమిటీ సమావేశం అనంతరం ఏచూరి విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరగనున్న పార్టీ కాంగ్రెస్‌కు ముందు చర్చ కోసం ముసాయిదా తీర్మానాన్ని విడుదల చేస్తామన్నారు.

కేంద్రంలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని, అదేసమయంలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయబోమని సీపీఎం తెలిపింది. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలా? వద్దా? అనే విషయంపై సుదీర్ఘంగా నాయకులు చర్చించారు. అంతిమంగా కాంగ్రెస్‌తో కలిసి - మిగతా 2 లో

హైదరాబాద్ - అమరావతి మధ్య

## బుల్లెట్ ట్రైన్!?



- నవంబరులోనే ప్రకటన చేయాల్సిన మోడీ
- రానున్న రైల్వే బడ్జెట్‌లో చేర్చే అవకాశం
- ఎన్‌హెచ్ 65కు సమాంతరంగా నిర్మాణం
- తుది దశకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం
- తెలంగాణ ప్రతిపాదనకు కదలిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : తెలుగు రాష్ట్రాల రాజధానులను హైస్పీడ్ రైల్‌తో అనుసంధానించాలని కేంద్రం భావిస్తోంది. హైదరాబాద్-అమరావతి మధ్య బుల్లెట్ రైలుతోపాటు 8 లేన్లతో ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించాలని రెండేళ్ల క్రితమే తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు అందచేసింది. దేశంలోని ప్రధాన నగరాలను కలుపుతూ బుల్లెట్ రైలు తరహా హైస్పీడ్ రైళ్లను నడుపుతామని గత ఎన్నికల్లో బీజేపీ ప్రకటించింది. ప్రధానిగా మోడీ అధికారం చేపట్టిన తర్వాత ఢిల్లీ-ముంబై, అహ్మదాబాద్-ముంబై, ముంబై-చెన్నై, ఢిల్లీ-కోల్‌కత, ఢిల్లీ-నాగపూర్, ముంబై-నాగపూర్ సెక్షన్లలో హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. గత ఏడాదిలో అహ్మదాబాద్-ముంబై మధ్య బుల్లెట్ రైలు ప్రాజెక్టును జపాన్ సహకారంతో నిర్మించేందుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అలాగే దేశ రాజధాని ఢిల్లీ నుంచి వారణాసి మీదుగా కోల్‌కత మధ్య మరో ప్రాజెక్టుకు సంసిద్ధమవుతున్నారు. దక్షిణాదిలో కూడా హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను బెంగళూరు-చెన్నై, చెన్నై-హైదరాబాద్ మధ్య ప్రారంభించాలని కేంద్రం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రతిపాదన మేరకు - మిగతా 2 లో

# 3 దేశాల్లో పెనుగాలుల బీభత్సం



**బెర్లిన్ :** ఐరోపాలోని మూడు దేశాలలో పెనుగాలు బీభత్సం సృష్టించాయి. గాలుల వల్ల విమానాల, రైళ్ల రాకపోకలను నిలిపి వేశారు. భవనాల పై కప్పులు ఎగిరిపోయాయి. అనేక ప్రాంతాల్లో వస్తువులు రవాణా చేసే లారీలు తిరగబడ్డాయి. చెట్లు కూలిపోయాయి. నెదర్లాండ్సులో ఇద్దరు పెద్దవాళ్లు చనిపోయారు. బెల్జియం రాజధాని బ్రెస్సల్స్‌లో ఒక మహిళ ఒక పురుషుడు చనిపోయారు. డచ్ సరిహద్దుకు సమీపంలో గల జర్మన్ పట్టడం ఎమిరిచ్‌లో ఒకరు చనిపోయారు. గంటక దాదాపు 90 కిమీ వేగంతో గాలులు వీచాయని జాతీయ వాతావరణ సంస్థ తెలిపింది. ఆమ్‌స్టర్ డ్యాంలో ఉదయంపూట మాత్రం విమానాల రాకపోకలు నిలిపి వేశారు. గాలులకు ప్రజలు చాలా దూరం కొట్టుకు పోయారు. లారీలు తిరగబడిన, భవనాలకు కలిగిన నష్టాల దృశ్యాలను నెదర్లాండ్సులో సోషల్ మీడియా ప్రజలకు అందించింది. జర్మనీలో విమానాలు,రైళ్ల రాకపోకలు పాక్షికంగా నిలిచిపోయాయి. లక్షమందికి పైగా విద్యుత్ సౌకర్యాన్ని కోల్పోయారు. ఇదిఇలా ఉండగా, రొమేనియాలో మంచు తుపాను, గాలుల కారణంగా స్కూళ్లు మూసివేశారు. ప్రధాని రహదారులు,ఓడరేవులు, మంచిఉతో కప్పబడిపోయాయి.

# ఐఎస్‌లో చేరిన మహిళకు ఉరి

**బాగ్దాద్ :** ఐఎస్ ఉగ్రవాద సంస్థలో చేరిన మహిళకు ఇరాక్ కోర్టు ఆదివారం ఉరి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. మొరాకోలో జన్మించిన జర్మన్ పౌరురాలు ఉగ్రవాద సంస్థలో పనిచేసినందుకు ఉరి తీయాలని సెంట్రల్ క్రిమినల్ కోర్టు తీర్పు చెప్పింది. ఇరాక్ సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్ ప్రతినిధి ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. జర్మనీ నుంచి సిరియాకు చేరుకొని ఉగ్రవాదులతో కలసి పనిచేసినట్లు ఆ మహిళ అంగీకరించింది. సిరియా నుంచి ఆమె ఇరాక్‌కు వెళ్లి అక్కడ కూడా పనిచేసింది. ఆమె వెంట ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారని, వారు టెర్రరిస్టు గ్రూపులోని ఇద్దర్ని వివాహం చేసుకున్నారని సత్తార్ తెలిపారు. పూర్తి దర్యాప్తు అనంతరం కోర్టుకు నివేదిక సమర్పించగా, విచారణ జరిపి కోర్టు ఉరి శిక్ష విధించింది. ఉగ్రవాదులు నేర చర్యలకు పాల్పడేందుకు ఆమె సహకరించారు.

# అమెరికా అంతటా మహిళల ప్రదర్శన

**వాషింగ్టన్ :** తమ హక్కులను పరిరక్షించాలని కోరుతూ అమెరికాలోని వివిధ నగరాల్లో మహిళలు భారీ ప్రదర్శనలు జరిపారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు మహిళలు ముందుకురావాలని, లైంగికదాడులకు వ్యతిరేకంగా పోరాడాలని మహిళలు పిలుపునిచ్చారు. అలాగే అన్ని జాతులను సమానత్వంతో చూడాలని, వలసకారులకు రక్షణ కల్పించి, తుపాకీ హింసను అరికట్టాలన్న సమస్యలపై ప్రదర్శనలు జరిపారు. వాషింగ్టన్‌తోపాటు వందలాది నగరాలు, పట్టడాల్లో మహిళా ప్రదర్శనలు జరిగాయి. శనివారం ఎండలవల్ల ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ మహిళలు భారీ సంఖ్యలో ప్రదర్శనల్లో పాల్గొన్నారు. అలబామాలో ఇటీవల సెనేట్‌కు జరిగిన ఎన్నికల్లో డెమాక్రటిక్ పార్టీ తరుపున మహిళా అభ్యర్థి గెలుపొందారని, 1992 తర్వాత మహిళా అభ్యర్థి విజయం సాధించడం ఇదే మొదటిసారని ప్రదర్శకులు పేర్కొన్నారు. అమెరికా సెనెట్ 'ద్రవ్య వినియోగ బిల్లు'ను ఆమోదించకపోవడంతో ప్రభుత్వ కార్యకలాపాలన్నీ నిలిచి పోయాయి. ఈ ఘటన జరిగిన అనంతరం మహిళలు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత రాజకీయ కల్లోలం ఏర్పడిందని మహిళా సమస్యలపైన పాలకులు శ్రద్ధ వహించాలని మహిళలు కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి దాదాపు 12 మంది కాంగ్రెస్ సభ్యులు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌లో మైనార్టీ నాయకురాలు నాన్సీ ఫెలోసి కూడా సభకు హాజరై మాట్లాడారు. గతేడాది ఇలాంటి ప్రదర్శనను ట్రంప్ ప్రారంభించిన విషయాన్ని ఫెలోసీ ప్రస్తావించారు. ప్రదర్శనల నేపథ్యంలో ట్రంప్ చేసిన ట్వీట్‌లో గత 18 ఏళ్ల కాలంలో అతితక్కువ మహిళా నిరుద్యోగం ఉందని చెప్పుకున్నారు. ట్రంప్ అనుకూలురు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. 2020లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తారని భావిస్తున్న సెనేటర్ క్రిస్టెన్ గిల్లీ బ్రాడ్ మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు.



## అమెరికాలో కొనసాగుతున్న ప్రతిష్టంభన

**వాషింగ్టన్ :** అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలు శనివారం నిలిచిపోయాయి. ఈ పరిస్థితి ఆదివారం కూడా కొనసాగింది. కాంగ్రెస్‌లోని రిపబ్లికన్లు డెమాక్రాట్లకు మధ్య ఏర్పడిని ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. ద్రవ్య వినియోగ బిల్లును ఆమోదించేందుకు సెనేట్ అంగీకరించక పోవడంతో ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలు నిలిచి పోయాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచే ప్రభుత్వ వ్యయానికి సంబంధించిన పనులు ఆగిపోయాయి. ప్రభుత్వ వ్యయానికి సంబంధించిన బిల్లును ఇప్పటికే ప్రతినిధుల సభ ఆమోదించింది. సెనేట్ ఇంకా ఆమోదించాల్సి ఉంది. తాత్కాలికంగా వ్యయానికి సంబంధించింది ఈ బిల్లు. ఫిబ్రవరి 16 నుంచి ప్రభుత్వ వ్యయానికి సంబంధించిన కాంగ్రెస్ నిర్ణయం అమలులోకి వస్తుంది. అప్పటి నుంచి ప్రభుత్వ కార్యకలాపాలకు ఆటంకం కలగదు. అయితే ఈ లోపు ప్రభుత్వానికి నిధులు అందించాల్సిన గడువు ముగిసింది. మధ్యలో ఉన్న 4 వారాలకు ప్రభుత్వం చేసే వ్యయాన్ని సెనేట్ ఆమోదించాల్సి ఉంది. డెమాక్రటిక్ పార్టీ నాయకుడు చిక్‌షుమర్ ఈ ప్రతిష్టంభనకు కారకుడని వైట్ హౌస్, రిపబ్లికన్ సభ్యులు విమర్శించారు. ఇతర దేశాల నుంచి పిల్లలు అమెరికాలో ప్రవేశించడానికి అనుమతించే కార్యక్రమానికి సంబంధించిన బిల్లు వాయిదా పడింది. బడ్జెట్ ఒప్పందంలో ఈ అంశాన్ని చేర్చాలని కూడా సభ్యులు కోరుతున్నారు. అమెరికా వచ్చి పనులు చేసుకోవాలని కలలు కన్న పిల్లలను వారి వారి దేశాలకు పంపివేయాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో నిర్ణయించారు. మార్చి 5లోపు ఇందుకు సంబంధించిన బిల్లును రూపొందించాలని కాంగ్రెస్‌ను ట్రంప్ గత సెప్టెంబరులోనే కోరారు. ఇతర దేశాల నుంచి వలస వచ్చే వారిని అనుమతించేందుకు సంబంధించిన బిల్లును ఆమోదిస్తే ప్రభుత్వ వ్యయం బిల్లును తాము సమర్థిస్తామని డెమాక్రాట్లు చెబుతున్నారు. అయితే డెమాక్రాట్లు ఆటలాడుతున్నారని వారి డిమాండుపై తాను చర్చలు జరిపేదిలేదని ట్రంప్ స్పష్టం చేసినట్లుగా వైట్ హవుస్ మీడియా కార్యదర్శి శాండర్స్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కుర్దిష్ స్థావరాలపై టర్కీ బాంబు దాడులు



**ఇస్తాంబుల్ :** సిరియాలో కుర్దిష్ స్థావరాలపై టర్కీ జెట్ బాంబులతో శనివారం దాడులు చేసినట్లుగా టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ తెలిపారు. కుర్దిష్ మిలిటెంట్ దళాలు టెర్రరిస్టు దళాలుగా ముప్పు కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. 72 జెట్ విమానాలతో మూకుమ్మడి దాడులు జరిగాయన్నారు. దాదాపు 100 పైగా కుర్దిష్ స్థావరాలపైన బాంబు దాడులు జరిగాయి. కుర్దిష్ మిలిటెంట్లను ఏరివేసేందుకు వారికి చెందిన ఒక వైమానిక స్థావరంపైన కూడా ఈ దాడులు జరిగాయి. అమెరికా ఒకవైపు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ ఈ దాడులను కొనసాగించింది. దాడుల విషయంలో ఎవరూ ఏమీ మాట్లాడలేదని ఎర్డోగన్ అన్నారు. సిరియా పశ్చిమ ప్రాంతం నుంచి నెమ్మదినెమ్మదిగా ఇరాక్ సరిహద్దువరకు గల టెర్రరిస్టు కారిడార్‌లో ఉంటున్న మిలిటెంట్లు అందరినీ తుడిచిపెడతామని ఎర్డోగన్ వెల్లడించారు. శనివారం సాయంత్రం ఈ దాడులను ప్రారంభించి అనేక గంటలు కొనసాగించినట్లు టర్కీ రక్షణ మంత్రి తెలిపారు. టర్కీ ప్రధాని బెకిర్ బొజ్‌డాగ్ ట్విటర్ సందేశంలో సిరియా సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తామని తమ లక్ష్యం పూర్తయిన తర్వాత ఆ ప్రాంతం నుంచి వైదొలుగుతామని పేర్కొన్నారు. తమ సైనిక దాడులు సిరియాకు వ్యతిరేకంగా కాదని ఆయన పేర్కొన్నారు. రష్యా ఈ దాడులపై వ్యతిరేకత వ్యక్తం చేయనప్పటికీ పౌరులకు నష్టం కలిగించరాదని కోరింది. ఈ ప్రాంతంలో ఘర్షణలకు అమెరికాయే కారణమని రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో విమర్శించింది.

# ఆఫ్ఘన్‌లో రెండు దుర్ఘటనలు... 18 మంది మృతి

## ఇంటర్ కాంటినెంటల్‌పై దాడి, బాంబుపేలుడు

**కాబూల్ :** ఆఫ్ఘనిస్థాన్‌లో జరిగిన రెండు దుర్ఘటనల్లో 18 మంది చనిపోయారు. రాజధాని కాబూల్‌లో పలు హోటళ్లపై ఉగ్రవాద గ్రూపులు దాడులు జరిపేందుకు ప్రయత్నించారు. ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌ని తమ స్వాధీనంలోకి తీసుకునేందుకు ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాన్ని ప్రత్యేక సైనిక దళాలు విఫలం చేసి పూర్తిగా తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. నలుగురు ఉగ్రవాదులు తుపాకులతో దాడి జరిపారు. ఈ దాడిలో కనీసం ఐదుగురు చనిపోగా, ఆతర్వాత సైనిక దళాలు జరిపిన కాల్పుల్లో ఒక ఉగ్రవాది చనిపోయాడు. ఐతే దాడి జరిగిన సమయంలో ఎక్కువ మంది చనిపోయినట్లుగా భావించారు. హోటల్‌లో 41 మంది విదేశీయులతో సహా 153 మంది ఉన్నారని ఆంతరంగిక మంత్రిత్వశాఖ ప్రతినిధి నజీబ్ డేనిష్ తెలిపారు. దాడులు జరిపినప్పుడు చెలరేగిన మంటలు నల్లటి పొగ ఆదివారం ఉదయం వరకు ఆప్రాంతంలో దట్టంగా కమ్ముకుంది. అనేక సైనిక శకటాలు, భారీ మిషన్‌గన్లు, హోటల్ పరిసరాల్లో కన్పించాయి. కాబూల్ ఉన్న పరిస్థితిని అంచనా వేసేందుకు ఆయా దేశాల సీనియర్ ప్రతినిధులు ఆ నగరాన్ని సందర్శించాలని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి నిర్ణయించిన కొద్దిరోజులకే ఈ దాడులు జరిగాయి. దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అందాల్సి ఉంది.



**బాంబుపేలి 12 మంది మృతి :** ఆఫ్ఘనిస్థాన్ పశ్చిమ ప్రాంతంలోని హిరాట్ రాష్ట్రంలో ఆదివారం రోడ్డు ప్రక్కన బాంబుపేలి 12 మంది పౌరులు చనిపోగా,మరొకరు గాయపడ్డారు. తరచుగా ఈ రహదారిపైన భద్రతాదళాలు పయనిస్తుంటాయి. వారిని లక్ష్యంగా పెట్టుకొని ఉగ్రవాదులు పలుమార్లు దాడులు జరిపారు.

# ఇండోనేషియాలో మశూచీ తీవ్రతరం

**జకార్తా :** ఇండోనేషియాలో మశూచి వ్యాధి విజృంభించింది. ఈ వ్యాధికారణంగా పపువానగరంలో పౌష్టికాహార లోపంతో ఉన్న 100 మందికి పైగా మృతిచెందినట్లు ఆదివారం అధికార వర్గాలు తెలిపాయి. దేశంలో ఆరోగ్య సంక్షోభం ఏర్పడిందని ముఖ్యంగా తూర్పు ప్రాంతంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందని అధికారులు పేర్కొన్నారు. అస్మట్ ప్రాంతంలో 69 మంది గీతపనివాళ్లు చనిపోయినట్లు పపువా సైనిక ప్రతినిధి మహ్మద్ అఢీ పేర్కొన్నారు. కొండలతో నిండి ఉండే ఒక్సిబిల్ జిల్లాలో 27 మంది చనిపోయారు. ఈజిల్లాలో మశూచి ఎక్కువగా వ్యాపించినట్లు గ్రామాల నుంచి వార్తలు అందాయని, ఎంతమంది చనిపోయిందీ పూర్తి వివరాలు ఇంకా అందాల్సిఉందన్నారు. మశూచీ పెద్ద ప్రమాదకరం కాదని అయితే పౌష్టికాహార లోపం వల్లే మృతులు పెరుగుతున్నారని ఆయన పేర్కొన్నారు. వ్యాధి వ్యాపించినప్పటికీ ఆయా ప్రాంతాలకు అవసరమైన పౌష్టికాహారం వ్యాక్సిన్లు ఇతర వైద్య పరికరాలు, వైద్య బృందాలను పంపలేకపోతున్నామని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా అస్మట్ ప్రాంతానికి ఈ సదుపాయాలను కల్పించలేకపోతున్నామన్నారు. పైన తెలిపిన రెండు ప్రాంతాల్లోనూ డాక్టర్ల కొరత ఆరోగ్య సౌకర్యాల లేమి ఉన్నాయి. రాకపోకల, సమాచారం అందించే సౌకర్యాలు తక్కువగా ఉన్నాయి. అస్మట్ ప్రాంతంలో 1,30,000 మంది నివశిస్తున్నారు. ఆ ప్రాంతానికి చేరుకునేందుకు పపువా రాష్ట్ర రాజధాని జయపురా నుంచి విమాన సౌకర్యం ఉంది. బోటు ద్వారా కూడా అక్కడికి ప్రయాణించి అక్కడికి చేరుకోవచ్చు. ఒక్సిబిల్ జిల్లాలో 4000 మంది నివశిస్తున్నారు. ఆ ప్రాంతంలోని కొన్ని గ్రామాలకు చేరుకునేందుకు ఒక రోజంతా ప్రయాణించవలసి ఉంటుందని అధికారులు తెలిపారు.

## రాష్ట్రపతి వేటు (మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదనలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు పంపించింది. దీంతో ఆ సిఫార్సుకు రాష్ట్రపతి అమోదం తెలిపారు. 63 మంది ఎమ్మెల్యేల బలం ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీకి 20 మంది ఎమ్మెల్యేల అనర్హత వేటుతో ప్రస్తుతం వారి బలం 43కు చేరింది. 'పార్లమెంటరీ కార్యదర్శులుగా ప్రయోజనం పొందుతున్నారా లేదా వారు ప్రభుత్వ కార్యనిర్వాహక కార్యకలాపాల్లో పాల్గొంటు న్నారా అనే విషయాలతో నిమిత్తం లేదు' అని లాభదాయక పదవి కింద ఉన్నట్లయితే వారిపై వేటు తప్పనిసరి అని జయా బచ్చన్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని రాష్ట్రపతికి చేసిన సిఫార్సులో ఎన్నికల సంఘం తన అభిప్రాయాన్ని తెలిపింది. ఢిల్లీ చట్టం, జాతీయ రాజధాని ప్రాంతం, రాజ్యాంగానికి సంబంధించి గతంలో న్యాయపరమైన తీర్పుల ఆధారంగా ఇది ఉందని వివరించింది. అనర్హత వేటు పడిన 20 మంది ఎమ్మెల్యేల్లో ఆదర్శ్ శాస్త్రి(ద్వారక), అల్కా లాంబా(చాందీని చౌక్), అనిల్ బాజ్‌పాయ్ (గాంధీనగర్), అవతార్ సింగ్(కల్కాజీ), కైలాష్ గెహ్లోట్(నజఫ్‌గర్), మంత్రి కూడా అయిన మదన్‌లాల్ (కస్తూర్బా నగర్), మనోజ్ కుమార్(కొండ్లి), నరేష్ యాదవ్(మెహ రౌలీ), నితిన్ త్యాగి(లక్ష్మీనగర్), ప్రవీణ్ కుమార్(జంగ్‌పురా), రాజేష్ గుప్తా(వాజీర్పూర్), రాజేష్ రిషీ(జనక్‌పురి), సంజీవ్ ఝా(బురారీ), సరితాసింగ్(రోహతస్ నగర్), సోమ్‌దత్(సదర్ బజార్), శరద్ కుమార్(నరేలా), శివచరణ్ గోయెల్ (మోతీనగర్), సుఖ్‌బీర్ సింగ్ (ముండ్‌క), విజేంద్ర గార్గ్(రాజిందర్ నగర్), జర్నైల్ సింగ్(తిలక్‌నగర్) లు ఉన్నారు.

## బుల్లెట్ ట్రైన్!? (మొదటిపేజీ తరువాయి)

రైల్వే శాఖ సహకారంతో రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ హైదరాబాద్-అమరావతి మధ్య బుల్లెట్ రైలు నిర్మాణానికి సంబంధించిన అధ్యయనం సాగిస్తోంది. గత ఏడాది నవంబరులో హైదరాబాద్‌లో మెట్రో రైలును ప్రారంభించిన ప్రధాని మోడీ రెండు రాజధానుల మధ్య హైస్పీడ్ రైలును ప్రకటిస్తారని తెలంగాణ ప్రజాప్రతినిధులు ఎదురుచూ శారు. మంత్రివర్గ సమావేశంలో రెండు రాజధానుల మధ్య హైస్పీడ్ రైలు ఏర్పాటుపై మోడీ ఆసక్తి చూపినట్లు తెలంగాణకు చెందిన ఎంపీ అప్పట్లో వెల్లడించారు. అధ్యయనం జరుగుతున్నం దున ఆయా మంత్రిత్వ శాఖల నుంచి స్పష్టత లేకపోవడంతో ఆయన ఈ ప్రాజెక్టును ప్రకటించలేదని తెలుస్తోంది. అయితే అధ్య యనం తుదిదశకు చేరుతుండడంతో రాబోయే రైల్వే బడ్జెట్‌లో బుల్లెట్ రైలు ప్రస్తావన తప్పకుండా ఉంటుందన్న ఆశాభావాన్ని తెలంగాణ ఎంపీలు వ్యక్తం చేస్తున్నారు. హైస్పీడ్ రైలు, 8 లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాల ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే.. ప్రయాణ సమయం చాలా వరకూ తగ్గిపోవడం ఖాయం. ప్రస్తుతం విజయవాడ నుంచి కాజీపేట మీదుగా, నడికుడి మీదుగా సికింద్రాబాద్‌కు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట మీదుగా అయితే 355 కిలోమీటర్లు, నడికుడి మీదుగా అయితే 313 కిలోమీటర్ల దూరం ఉంది. ఎక్స్‌ప్రెస్ రైలులో విజయవాడ నుంచి ఈ రెండు మార్గాల్లో ప్రయాణిస్తే 5.30 గంటల నుంచి 6.30 గంటల సమయం పడుతుంది. అదే రహదారి ప్రయాణం కేవలం 270 కిలోమీటర్లు మాత్రమే. బస్సులో 5.30 గంటల నుంచి 6 గంటల్లో గమ్యం చేరుకుంటున్నారు. ఎక్స్‌ప్రెస్ హైవేలో 8 లేన్లకు విస్తరిస్తే ప్రయాణ సమయం మరింత తగ్గుతుంది. ప్రస్తుతమున్న జాతీయ రహదారిని 8 లేన్లుగా విస్తరించి ఎక్స్‌ప్రెస్ హైవేగా అభివృద్ధి చేయడంతోపాటు దీనికి సమాంతరంగా హైస్పీడ్ రైలు మార్గాన్ని నిర్మించాల్సి ఉంటుంది.

**బుల్లెట్ రైలులో 40-50 నిముషాలే!**

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నుండి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ హైవేకు సమాంతరంగా హైస్పీడ్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేసి బుల్లెట్ రైలును నడిపితే 50 నిముషాలలోపే గమ్యం చేరుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. బుల్లెట్ రైలు సరాసరి వేగం గంటకు 350 కిలోమీటర్లు ఉంటుంది కనుక 270 కిలోమీటర్ల దూరాన్ని 40 నుంచి 50 నిముషాల్లో అధిగమించేందుకు అవకాశం ఉందంటున్నారు. అలాగే రెండు రవాణా మార్గాలు పక్కపక్కనే ఉండడం వలన రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పారిశ్రామిక జోన్ల ఏర్పాటుకు వీలవుతుందని, తద్వారా ప్రైవేటు పెట్టుబడులు రావడానికి అవకాశం ఉన్నదని పేర్కొంటున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే తెలుగు రాష్ట్రాల్లో రవాణా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తధ్యమని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి 65ను 8 లేన్లతో ఎక్స్‌ప్రెస్ హైవేగా విస్తరించడం, ఇబ్రహీంపట్నం నుండి కృష్ణానదిపై 8 లేన్లతో వంతెన, హైస్పీడ్ రైల్ కారిడార్‌లో భాగంగా బుల్లెట్ రైలు కోసం మరొక వంతెన నిర్మించి అమరావతితో అనుసంధానం చేస్తే చాలంటున్నారు. బుల్లెట్ రైలు కోసం అమరావతిలో రైల్వే టెర్మినల్‌ను నిర్మిస్తారు కనుక ఆ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని విజయవాడ, గుంటూరులకు సర్క్యులర్ రైళ్లు, మెట్రో రైళ్లను నడిపితే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలకు చాలా వరకూ పరిష్కారం లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

## పొత్తు లేదు

(మొదటిపేజీ తరువాయి)

పనిచేయరాదని నిర్ణయించారు. ఈ విషయంపై పార్టీ కేంద్ర కమిటీలో ఓటింగ్ జరిగినట్లు ఎన్‌డీటీవీ తెలిపింది. కాంగ్రెస్‌కు దూరంగా ఉండాలని మెజారిటీ నిర్ణయించింది. దేశంలో మతోన్మాద బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్ సహా లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పనిచేయాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు. దీనికి పశ్చిమబెంగాల్ నాయకత్వం మద్దతిచ్చింది. అయితే, కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలన్న వైఖరిని పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ కారత్ తప్పుట్టారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడాన్ని కేరళ పార్టీ సైతం వ్యతిరేకించింది.

## న్యాయపోరాటం చేస్తాం : కేజ్రీ

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయని, సోమవారం కొంత ఉపశమనం లభిస్తుందని పార్టీ భావిస్తోందని తెలిపారు. ఆప్ సీనియర్ నాయకుడు అశుతోష్ మాట్లాడుతూ 'ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ రాష్ట్రపతి ఆదేశించడం రాజ్యాంగ విరుద్ధం, ప్రజాస్వామ్యానికి ప్రమాదం' అని అన్నారు. అనర్హతకు గురైన మరో ఎమ్మెల్యే అల్కా లాంబా మాట్లాడుతూ ఈ నిర్ణయం బాధకరం, ఏదైనా నిర్ధారణకు వచ్చే ముందు వారి వాదనను రాష్ట్రపతి వినాలని అన్నారు. ఈ విషయమై మరింత సమయం ఇవ్వాలని కూడా రాష్ట్రపతిని ఆప్ ఎమ్మెల్యేలు కోరారు. పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమితులైన ఎమ్మెల్యేలు లాభదాయక పదవులు కలిగి ఉన్నట్లు ఒక పిటీషన్ పేర్కొంది. ఎన్నికల సంఘం సిఫార్సుపై స్టే విధించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆప్ ఆశ్రయించింది. అయితే వారి పిటిషన్‌ను న్యాయస్థానం సోమవారం విచారించనున్నది. 'కోర్టు నుంచి ఉపశమనం లభిస్తుందని మేము భావిస్తున్నాం. మా పిటిషన్ సోమవారం విచారణకు రానుంది' అని కస్తూర్బానగర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మదన్‌లాల్ పేర్కొన్నారు.

## బహుదూరం..! (మొదటిపేజీ తరువాయి)

గ్రామ పంచాయతీలను గుర్తించి, తక్షణమే బ్యాంక్ బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సంబంధిత జిల్లా కలెక్టర్లు, లీడ్ బ్యాంక్ మేనేజర్లు (ఎల్‌డీఎం) కొత్త బ్యాంక్ బ్రాంచ్‌లపై సమావేశాలు నిర్వహించి, ఎక్కడెక్కడ బ్యాంక్ శాఖలను ఏర్పాటు చేస్తున్నారో ఎస్‌ఎల్‌బీసీకి నివేదిక ఇవ్వాలని సమావేశం సూచించింది. కనీసం 49 మంది జనాభా నుంచి గరిష్టంగా 1,610 మంది జనాభా ఉన్న తీవ్రవాద ప్రభావిత (ఎల్‌డబ్ల్యుఇ) గ్రామాల్లో కూడా బ్యాంకింగ్ అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) గరిష్టంగా 93 గ్రామ పంచాయతీల్లో బ్యాంక్ బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. లీడ్ బ్యాంక్‌గా వ్యవహరిస్తున్న ఆంధ్రాబ్యాంక్ 31 గ్రామాల్లో, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ 69 గ్రామాల్లో బ్యాంక్ బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలని ఎస్‌ఎల్‌బీసీ నిర్ణయించింది. రాజధాని విజయవాడ నగరానికి అతి సమీపంలోనే ఉన్న జక్కంపూడి కాలనీ ప్రజలు సైతం బ్యాంకింగ్ సేవల కోసం కనీసం రెండు మూడు కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సిందే. సుమారు 30 వేల కుటుంబాలు ఆ కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకర్లు విజయవాడ, విశాఖ వంటి మెట్రో నగరాలపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. గ్రామాల్లో బ్యాంకింగ్ మిత్రాలున్నా పూర్తిస్థాయిలో సేవలు అందటంలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఎల్‌డబ్ల్యుఇ ప్రభావం ఉన్న 35 జిల్లాల్లో విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో తీవ్రవాద ప్రభావం ఉన్న పది గ్రామాల్లో కనీసం ఐదు కిలో మీటర్లకు ఒక బ్యాంక్ బ్రాంచ్ కూడా లేదు. పూర్తి గిరిజన ప్రాంతాలైన ఆ గ్రామాల ప్రజలు బ్యాంకింగ్ లావాదేవీల కోసం సమీపంలోని పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మావోయి స్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న పది గ్రామాల్లో బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే బాధ్యతను ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఎస్‌ఎల్‌బీసీ అప్పగించింది. విశాఖపట్నం జిల్లాలోని పెదబయలు మండలంలో పెద కొరవింగి, గూడెం కొత్త వీధి (జీకే వీధి) మండలంలో ఏనుగుబయలు, అనంతగిరిలో వెలమామిడి, పినకోట, గడ్డిబండ, చిందుగులపాడు, మద్రేబు, జీ మాడుగలలో చిలకల మామిడి, విజయనగరం జిల్లాలోని వేపాడ మండలంలో కందగంగుపూడి, ఎగువ కొండపర్తి గ్రామాలకు బ్యాంక్ సేవలు అందుబాటులో లేవు. తక్షణమే ఆయా గ్రామాల్లో బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఎస్‌ఎల్‌బీసీ సూచించింది.

**విశాఖ మెట్రోలోనే అధికం :** ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంక్‌లు విశాఖ మెట్రో నగరంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నాయి. మూడేళ్లలో విశాఖ నగరంలో బ్యాంక్ బ్రాంచ్‌లు క్రమంగా పెరగటమే ఇందుకు నిదర్శనం. 2015 మార్చి నాటికి విశాఖ మెట్రో నగరంలో 287 బ్యాంక్ బ్రాంచ్‌లు ఉండగా, 2016 మార్చికి 327, 2017 మార్చి నాటికి బ్రాంచ్‌ల సంఖ్య 337కి పెరిగింది. గతేడాది అక్టోబర్ నాటికి విశాఖ నగరంలో మొత్తం 346 బ్యాంక్ బ్రాంచ్‌లున్నాయి. విశాఖ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 2015 మార్చికి 190 ఉండగా, గతేడాది అక్టోబర్‌కు వాటి సంఖ్య 186కు తగ్గింది. సెమీ అర్బన్‌లో 98 నుంచి 91కి తగ్గగా, పట్టణ ప్రాంతాల్లో 2015 మార్చినాటికి 116 బ్రాంచ్‌లుండగా, గత సంవత్సరం అక్టోబర్‌నాటికి 131కి చేరింది.

## జీపు యాత్రలు (మొదటిపేజీ తరువాయి)

వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు చెప్పారు. అన్ని జిల్లాలల్లో బ్రాంచ్‌ల నుంచి అసోసి యేషన్ ప్రతినిధులు సమావేశానికి హాజరవుతార న్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణా, ఒడిశా తది తర రాష్ట్రాల నుంచి కూడా ప్రతినిధులు హాజరవుతా రన్నారు. 2 రోజుల సమావేశాల్లో భాగంగా 23న నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశంలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, సుప్రీంకోర్టు న్యాయ వాది శ్రావణ్‌కుమార్, హైకోర్టు న్యాయవాది అర్జున్ పాల్గొంటారన్నారు. విజయవా డలోని సీపీఐ కార్యాల యం దాసరి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడుతూ అగ్రి గోల్డ్ కంపెనీ మూతపడి మూడేళ్లవ్వగా, కేసు కోర్టుకెళ్లి రెండేళ్లవుతున్నా బాధితులకు ఇంకా న్యాయం జరగలేద న్నారు. అగ్రిగోల్డ్ సంస్థ యాజమాన్యం ఇప్పటికే న్యాయస్థానంలో లిటిగేషన్‌లు సృష్టిస్తుండగా, మార్చి వరకు గడువు ఇస్తే బాధితులకు తామే డబ్బులు చెల్లిస్తా మనే ప్రతిపాదనను తాజాగా తెరపైకి తెచ్చిందన్నారు. ఇది పూర్తిగా కుట్రపూరిత ప్రతిపాదనను ఆయన విమ ర్శించారు. రాష్ట్రంలోని 20 లక్షల మంది బాధితులకు తక్షణమే రూ.3,965 కోట్లను చెల్లిం చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీతో బాధితులలో డిపాజిట్‌లను తిరిగి చెల్లి స్తారనే ఆశ పెరిగిందని, కాని కేసు జాప్యం కావడంతో బాధితుల్లో ఆందోళన పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతోం దని, అగ్రిగోల్డ్ బాధితుల్లో చైతన్యం తెచ్చేందుకు త్వరలో మండల స్థాయిలో జీపు యాత్రలు నిర్వహిం చాలని భావిస్తు న్నట్లు చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం సమస్యపై స్పందించకపోతే బడ్జెట్ సమావేశాల్లో చలో అమరావతి చేపడతామని హెచ్చరించారు. హైకోర్టు ధర్మాసనం బాధితుల సమస్యపై సానుకూలంగా స్పందించి సత్వర న్యాయం చేయాలని నాగేశ్వరరావు కోరారు.

**నష్టపరిహారం చెల్లింపు నిర్ణయంపై హర్షం :** అగ్రిగోల్డ్ కుంభకోణం కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన, గుండె పోటుతో మరణించిన వారి కుటుం బాలకు పోలీసు ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం రిపోర్టుతో సంబంధం లేకుండా రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సీఎం చంద్రబాబు క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవటంపై ముప్పాళ్ల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. అసోసియేషన్ పోరాట ఫలితంగా గతేడాది మార్చి 12న నష్టపరిహారం చెల్లింపుపై ప్రభుత్వం జీఓ నంబర్ 80ని విడుదల చేసిందని, అయితే అందులో పేర్కొన్న నిబంధనల వల్ల బాధిత కుటుంబాలకు నేటికీ పరిహారం అందలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్ చైతన్య యాత్ర నిర్వహించటంతోపాటు తాజాగా విజయవాడలో 30 గంటల నిరాహార దీక్షలు చేపట్టిందన్నారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు నిబంధనలను సరళతరం చేస్తూ పరిహారం చెల్లింపునకు జీఓ ఇవ్వాలంటూ సంబంధిత శాఖకు ఆదేశాలు ఇచ్చారని ముప్పాళ్ల వివరించారు.

## వాళ్లు వీధి కుక్కలు (మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధి టామ్ వడక్కమ్ మీడియాతో అన్నారు. ఈపోరాటాన్ని ఆలకించడం కానీ, దళితుల సంక్షేమ కోసం కేంద్ర కేబినెట్ మంత్రిగా హెగ్డే ఒరగబెట్టిందేమీ లేదని ఘాటుగా విమర్శించారు. కర్నాటక బీజేపీలో హెగ్డే కొత్త సమూనాగా నిలిచినట్లయితే దళితులను ఆదేవుడే రక్షించాలని ఆయన పెదవి విరిచారు. దీనికి స్పందించిన హెగ్డే తన వైఖరిని తప్పుపట్టిన వారిని ఉద్దేశించి మాత్రమే వ్యాఖ్యానించానంటూ తన నోటి దురుసుతనాన్ని సమర్థించుకునేందుకు విఫల ప్రయత్నం చేశారు.

**సీరియల్ నేరస్థుడు : ప్రకాష్ రాజ్ విసురు**

దళితులను వీధి కుక్కలతో పోల్చిన మంత్రి అనంత కుమార్ హెగ్డేను సీరియల్ నేరస్థునిగా ప్రముఖ చలన చిత్ర నటుడు ప్రకాష్ రాజ్ విమర్శించారు. రాజ్యాంగాన్ని కించపరిచిన హెగ్డే వ్యాఖ్యలకు నిరసన తెలిపే దళితులను వీధి కుక్కలతో పోల్చడం అతి హేయమైన చర్యగా ఆయన తన ట్విటర్లో వ్యాఖ్యానించారు. ఎక్కడ పడితే అక్కడ నోరు జారుతున్న హెగ్డే నోటికి ప్రధాని మోడీనే తాళం వేయాలన్నారు. నోరు జారిన హెగ్డేను రాజీనామా చేయమని కోరగల ధైర్యం బీజేపీ అగ్రనాయకులకు ఉందా? అని ప్రకాష్ రాజ్ ప్రశ్నించారు.

## సమర్థతకే పట్టం (మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఇంటింటికి తెలుగుదేశంలో 54 లక్షల విన తులు రాగా, జన్మభూమిలో 12 లక్షల రెండు వేల 248 వచ్చాయని వివరించారు. అంటే ప్రజలలో సంతృప్తి పెరిగిందని వివరించారు.

**త్వరలో అన్నా క్యాంటీన్లు, నిరుద్యోగ భృతి :** రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లు అన్ని చోట్ల ఏర్పాటు చేస్తామని, నిరుద్యోగ భృతి అందచేస్తామని చంద్రబాబు తెలిపారు. రేషన్ కార్డులు ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అయితే రాష్ట్రంలో కోటి 38 లక్షల కుటుంబాలు ఉంటే రేషన్ కార్డులు మాత్రం కోటి 42 లక్షలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్ల కోసం అధికంగా కార్డుల కోసం దరఖాస్తు చేస్తున్నారని అవసరమైన చోట పరిస్థితులను బట్టి రెండు లేదా మూడు పింఛన్లను అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజాసాధికార సర్వేని అనుసరించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. అధికార పార్టీ నేతలే కోడిపం దేలు ఆడితే ప్రజాప్రతినిధులను ఎవరు గౌరవిస్తారని ప్రశ్నించారు.

**దళిత సంక్షేమంపై దృష్టి :** దళితుల సంక్షేమంపై దృష్టి సారించి ఈ నెల 26 నుంచి దళిత తేజం కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని చంద్రబాబు చెప్పారు. కనీసం 10 వేల మందితో బహిరంగ సభలు నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రమంతటా ప్రతి దళిత కుటుంబాన్ని సందర్శించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అమరావతిలో సైతం భారీస్థాయిలో దళిత మహాసభ నిర్వహిస్తామని వెల్లడించారు. కేంద్రం సహకారంతో 2019 నాటికి పోలవరం పూర్తిచేసి చూపుతామని ధీమా వ్యక్తం చేశారు. రూ.22 వేల కోట్లతో ప్రతి ఇంటికి నాణ్యతతో కూడిన మంచినీరు అందిస్తామని చెప్పారు.

**నేనే ఆందోళన చేస్తా..:** బహిరంగ మలమూత్ర రహితంగా రాష్ట్రాన్ని తీర్చిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. అయితే చిత్తూరు, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాలు ఓఎఫ్‌డీ సాధించని పక్షంలో ముఖ్యమంత్రిని అన్న విషయం మరిచి నేనే నిరాహార దీక్ష, ఆందోళన, ధర్నా చేపడతానని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా 175 నియోజక వర్గాలలో టీడీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలన్నీ ఒకేసారి జరుగుతాయని ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు రాష్ట్ర, మండల స్థాయి టీడీపీ నాయకులు హాజరయ్యారు.

## త్వరలో ప్రజల దృష్టికి కేసుల కేటాయింపు విధానం

**న్యూఢిల్లీ:** సున్నితమైన ప్రజాప్రయోజన వ్యాజ్యా (పిల్)లను వివిధ ధర్మాసనాలకు కేటాయించే విషయంలో అనుసరించబోయే విధాన ప్రక్రియను ప్రజల దృష్టికి తేవాలన్న యోచనలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిపాదిత విధాన ప్రక్రియ విషయంలో సంబంధిత భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలనూ ఆయన సేకరించినట్లు తెలుస్తోంది. ఇలా సేకరించిన అభిప్రాయాలను కూలంకషంగా పరిశీలించిన మీదట కేసుల కేటాయింపు విధాన ప్రక్రియను ఖరారు చేయాలన్న ఆలోచనలో జస్టిస్ మిశ్ర ఉన్నారని సమాచారం.



## మూడవ రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పాటు : జేవీఎస్

**విశాలాంధ్ర - తణుకు :** రాష్ట్రంలోని తెలుగుదేశం, బీజేపీ అధికార కూటమి, వైసీపీలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మూడవ రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆదివారం స్థానిక సురాజ్య భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోనాల భీమారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాల పట్ల తెలుగుదేశం, వైసీపీ రెండు పార్టీలు మౌనం దాల్చడం దురదృష్టమని, దేశంలోను, రాష్ట్రంలోను ప్రజావ్యతిరేక, మతోన్మాద, అవినీతికర పాలన పరాకాష్టకు చేరుకుంద న్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్ష పార్టీలతో కూడిన సెక్యులర్, భావసారూప్యత కలిగిన పార్టీలతో మూడవ ప్రత్యామ్నాయం తప్పనిసరని సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 19, 20, 21 తేదీల్లో తాడేపల్లి గూడెంలో జరగనున్న సీపీఐ 25వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ స్వయంపతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్, న్యాయస్థానాల్లో బీజేపీ జోక్యం చేసుకోవడం ప్రజాస్వా మ్యానికి తీరని ముప్పు ఏర్పడుతుందన్నారు. ఢిల్లీ ఆప్ ఎంఎల్ ఏలను అనర్హులుగా ప్రకటించడం రాజకీయ ప్రేరేపితమని విమర్శించారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ మునీర్, బండి వెంకటేశ్వరరావు, వి.విద్యాధర్, ఎం.సీతారామ్ ప్రసాద్, కలిశెట్టి వెంకట్రావు, బొద్దాని నాగరాజు, నెక్కంటి జగదాంబ, రెడ్డి శ్రీనివాస డాంగే, పి.కన్నబాబు, కారం దారయ్య, తదితరులు మాట్లాడారు.



## దావోస్‌కు చంద్రబాబు బృందం పయనం



**విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:** స్విట్జ ర్లాండ్‌లోని దావో స్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్ర బాబు సహా 13 మందితో కూడిన బృందం ఆదివారం బయలుదేరింది. ఉండవల్లి లోని తన నివాసంలో తెలుగుదేశం పార్టీ వర్క్‌షాపును పురస్కరించుకుని నేతలు, కార్యకర్తలతో ఉదయం నుంచి పూర్తిగా బిజీగా గడిపిన ఆయన రాత్రి గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు. అక్కడ నుంచి వేకువజాము 2 గంటలకు దావోస్ పయన మయ్యారు. ఈ సందర్భంగా 22వ తేదీ నుంచి 27 వరకూ బిజీగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన నున్నారు. ఏటా జరిగే సదస్సుకు చంద్ర బాబు క్రమం తప్పకుండా హాజరై రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానిస్తూ పలు ద్వైపాక్షిక సమావేశాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఈ సారి కూడా ఆయన 5 ముఖ్యమైన సమవేశాలు, 25 ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొంటున్నారు. మరికొన్ని కార్యక్రమాల్లో వక్తగా ప్రసంగిస్తారు. అలాగే ప్రపంచ స్థాయిలో పేరొందిన వివిధ సంస్థలు, కంపెనీలతో పరస్పర అవగాహన ఒప్పం దాలు (ఎంఓయూ) చేసుకోనున్నారు. ఈ బృందంలో రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ఐటీ శాఖమంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ జి సాయిప్రసాద్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ జాస్తి కృష్ణకిషోర్, పరిశ్రమలశాఖ కార్యదర్శి సాలొమన్ ఆరోకియ రాజ్, వ్యవసాయశాఖ సలహాదారు టి విజయకుమార్, ముఖ్యమంత్రి పర్సనల్ సెక్రటరీ పెండ్యాల శ్రీనివాసరావు, ముఖ్యమంత్రి ముఖ్య భద్రతాధికారులున్నారు.

# వర్ణ వ్యవస్థను తిప్పికొడదాం

- భౌతిక తత్వ శాస్త్రవేత్త చటోపాధ్యాయ రచనలు స్ఫూర్తిదాయకం
- ప్రోగ్రెసివ్ ఫోరమ్ జాతీయ అధ్యక్షులు కె.ఎస్.చలం
- 'సంగమం' ఆధ్వర్యాన చటోపాధ్యాయ రచనలపై విశ్లేషణ



**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :** దేశంలో పెట్టుబడి దారీ, వర్ణ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రగతిశీల, లౌకిక వాదులంతా ఐక్యంగా ఉద్యమించాలని ప్రోగ్రెసివ్ ఫోరమ్ జాతీయ అధ్యక్షులు ఆచార్య కె.ఎస్.చలం పిలుపునిచ్చారు.

విజయవాడ ఎంబీ భవన్‌లో ఆదివారం సంగమం (లౌకిక ప్రజాతంత్ర వాదుల ఐక్యవేదిక) ఆధ్వర్యాన దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ రచనలు-సమాలోచనలపై వక్తలు ప్రసంగించారు. 'సంగమం' కమిటీ సభ్యులు, ప్రోగ్రెసివ్ ఫోరమ్ కృష్ణాజిల్లా నాయకులు బుడ్డిగ జమీందార్ అధ్యక్షతన 'భారతీయ నాస్తికత-సింహావలోకనం' అంశంపై చలం మాట్లాడారు.

దేవీప్రసాద్ చటోపాధ్యాయ దేశంలోనే ప్రముఖ తత్వవేత్తని వివరించారు. భారతీయ సంస్కృతిలో క్రీస్తు పూర్వం నుంచి భౌతికవాదమే ఉండేదని, 1954లో మొట్ట మొదటిసారి 'లోకాయుత' గ్రంథాన్ని ప్రచురించి ప్రపంచానికి సోక్రటీస్ కంటే ముందుగా భారతీయ తాత్వికత పునాదులు న్నాయని స్పష్టం చేశారు. ఆ క్రమంలోనే భౌతికవాదంపై ఆధారపడి నాస్తిక, హేతువాద దర్శనాలను నిర్మించిన వారు భారతీయులేనని పేర్కొన్నారు. ఇది మార్క్సిస్ట్ దృష్టిలో భారతీయ నాస్తికత్వమనే..1969లో వేరొక గ్రంథాన్ని రాసి, వేదాంతం మినహాయించి భారతీయ దర్శనాలన్నీ నాస్తికత్వాన్ని ప్రచారం చేశాయని కె.ఎస్.చలం వివరించారు. బౌద్ధం, జైనమూ నాస్తిక మతాలేనని స్పష్టం చేశారు. భారతీయుల తత్వ విచారణ ఆర్యుల రాకముందు సాంఖ్య కింద ఉండేదని, అజీవకులూ దేవుడు, పాపం, పుణ్యాన్ని వ్యతిరేకించారని చెప్పారు. ఈ అజీవకులు చాలా మంది దక్షిణాదిలోని గుంటూరు మండలంలో ఉండేవారని పేర్కొన్నారు. ఎ.ఎల్.భాషం చారిత్రకంగా నిరూపించారని, క్రీ.శ.975లో రెండో అమ్మరాజు శాసనంలో తాడికొండ, తాట్రపర్రు వంటి ప్రాంతాల్లో ఉండే అజీవకులపై పన్నులు అధికంగా విధించిన ఆధారాల్ని వివరించారు. దిగువ కులాల తాత్విక జీవనం విధానంపై కొనసాగుతున్న దోపిడీపై ప్రచారం చేయాల్సిన బాధ్యత సంగమం తదితర సంస్థలపై ముడిపడి ఉందని సూచించారు.

ప్రొగ్రెసివ్ ఫోరమ్ నాయకులు బుడ్డిగ జమీందారు మాట్లాడుతూ వర్ణ, హిందూ వ్యవస్థ విధానాలకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాతంత్ర వాదులమంతా ఉద్యమిస్తూ సంగమం వేదికగా పలు కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలుత సాహితీ స్రవంతి సంపాదకులు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షతన 'భారతీయ తాత్విక చింతన-సజీవ నిర్జీవ అంశాలు'పై ప్రముఖ తత్వశాస్త్ర పరిశోధకులు టి.రవిచంద్ ప్రసంగిస్తూ తత్వశాస్త్ర రంగానికి దేవీప్రసాద్ చటోపాధ్యాయ మార్గదర్శకులని అన్నారు. తత్వశాస్త్రాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి దేశ ప్రజల కోసం అనేక గ్రంథాల్ని ఆయన పరిచయం చేశారని కొనియాడారు. ఈయన మార్క్సిస్టు భౌతికవాద ఆలోచనాపరుడని పేర్కొన్నారు. దేశంలో మరుగున పడిన భౌతికతత్వ వాదాన్ని తన రచనల ద్వారా చటోపాధ్యాయ వెలుగులోకి తెచ్చారని వివరించారు. ప్రగతిశీల, లౌకిక, సామాజిక ఉద్యమకారులకు ఈయన రచనలు ఒక తాత్విక సంపదని అభివర్ణించారు. విశ్వవిద్యా లయాల్లో నేడు స్వేచ్ఛా, మానవ హక్కులకు భంగం వాటిలు తోందని వాపోయారు. ప్రజాతంత్ర వాదులంతా ముందు కొచ్చి చటోపాధ్యాయ కృషిని కొనసాగించాలని కోరారు.

'లోకాయుత-భౌతికవాదం' అంశానికి ప్రజాసాహితి సంపాదకులు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్. శర్మ మాట్లాడుతూ మధ్యయుగం నుంచి నేటి వరకూ కుల వ్యవస్థను పెట్టుబడిదారీ వ్యవస్థ తెలివిగా వాడుకుంటోం దన్నారు. పాలకవర్గాల బలమైన ఆయుధంగా వర్ణ వ్యవస్థ నిలుస్తోందని చెప్పారు. భౌతికవాదం ఎందుకు ప్రాచుర్యం పొందట్లేదని ఆయన ప్రశ్నించారు. కుల వ్యవస్థ లేని దేశంలో బౌద్ధం ప్రముఖంగా ఉందని ఆయన వివరించారు.

'భారతీయ వైజ్ఞానిక రంగం-పునర్నిర్మాణం' అంశానికి సంగమం ప్రతినిధి బోసు అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎన్.అంజయ్య మాట్లాడుతూ కుల వ్యవస్థ పాత్రను లోకాయుత పుస్తకం ప్రశ్నించిందని వివరించారు. చటోపా ధ్యాయ చేసిన తాత్విక కృషి, భౌతికవాద సంప్రదాయాలను పునర్నిర్మించడానికి మార్గమైందని చెప్పారు. వర్తమాన జాతీయ సమాజంలో భౌతికవాద దృష్టిని కొనసాగించడానికీ, తద్వారా భావవాద దృష్టి ప్రశ్నించడానికి ఈయన రచనలు తోడ్పడ్డాయని విశ్లేషించారు. చటోపాధ్యాయ వాదంతో సమాజాన్ని చైతన్యవంతులను చేయాల్సిన అవసరముందని సూచించారు. సాంఖ్య, భౌతికవాదమే వైద్యశాస్త్రాభివృద్ధికి తోడ్పడ్డాయని విశ్లేషించారు. ఈ సమావేశంలో ప్రజానాట్య మండలి కళాకారులు కొండపల్లి మాధవరావు, ఆర్. పిచ్చియ్యలు గేయాలను ఆలపించారు.

# బెదిరింపులు కాదు.. చర్చలు జరపండి

**స్కీం వర్కర్ల రాష్ట్రవ్యాప్త సమ్మె రేపు**

**ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు**

**విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:** న్యాయమైన కోర్కెల కోసం సమ్మె చేస్తున్న స్కీం వర్కర్లను బెదిరింపులకు గురిచేయకుండా చర్చలకు ఆహ్వానిం చాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ స్కీంలలో పనిచేస్తున్న అంగన్వాడీ, మధ్యాహ్న భోజన, ఆశా తదితర పథకాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. దీనికి నిరసనగా 23 న నిర్వహించతలపెట్టిన రాష్ట్రవ్యాప్త స్కీం వర్కర్ల సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దాసరి భవన్‌లో ట్రేడ్ యూనియన్ల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనవరి 17న జరిగిన సమ్మెలో లక్షలాది మంది కార్మికులు పాల్గొన్నారని, సంక్రాంతి సెలవుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో 23న సమ్మె జరపాలని ట్రేడ్ యూనియన్ల సమన్వయ కమిటీ నిర్ణయించిందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 45వ ఇండియాన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సులను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడంలేదని, కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ స్కీం కార్మికుల సమ్మెను బలపరచడమే కాకుండా స్వయంగా పాల్గొన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సమ్మెలో పాల్గొనవద్దని స్పెషల్ కమిషనర్ ఆదేశాలివ్వడం ముఖ్యమంత్రి ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. స్కీం కార్మికుల సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలతో పాటు ఐఎఫ్‌టీయూ, వైఎస్సార్ టీయూ వంటి రాష్ట్ర సంఘాలు కూడా మద్దతు ఇస్తున్నాయని ఆయన వెల్లడించారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగే పద్ధతిలో కార్మికులు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొనాలని రామారావు కోరారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కార్మికుల సమ్మెను అణిచివేసే ప్రయత్నాలను సహించేది లేదని, కార్మిక సంఘాల ఐక్యపోరాటం ద్వారా దీనిని ఎదుర్కొంటామన్నారు. అంగన్వాడీ, స్కీం వర్కర్ల ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు జి బేబిరాణి, కె స్వరూపరాణి, కె శైలజ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు, బెదిరింపులకు పాల్పడినా 23న సమ్మె జరిపి తీరుతామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె పోలారి, కె రామారావు పాల్గొన్నారు.

# సహనానికి పరీక్ష

- అస్తవ్యస్తంగా ఈ ఏడాది పరీక్షల నిర్వహణ
- పబ్లిక్ పరీక్షలకు ముందు సమ్మేటివ్-2
- విద్యార్థులపై ప్రభావం పడుతుందంటున్న నిపుణులు



**విశాలాంధ్ర - విజయవాడ :** విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్ణ యాలు విద్యార్థుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో సక్రమంగా పరీ క్షలు నిర్వహించకుండా జాప్యం చేసిన అధికారులు మరో తొందర పాటు నిర్ణయం తీసుకుని విద్యా ర్థులను ఇక్కట్లలోకి నెట్టే చర్యలకు పూనుకున్నారు. ఈ నిర్ణయం పదో తరగతి విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుండగా మిగిలిన తరగతుల వారిపైనా పడనుందని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు. మార్చి 15 నుంచి 10 తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా ఫిబ్రవరి 26 నుంచి మార్చి11 వరకు సమ్మేటివ్-2ను నిర్వహించనున్నట్లు ప్రకటన విడుదల చేసింది. దీంతో అటు ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో అయోమయం నెలకొంది.

**ఈ ఏడాది రెండు సమ్మేటివ్ లే :**

ఈ ఏడాది పాఠశాలల్లో పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నవంబరు నెలలో సమ్మేటివ్ -1 పరీక్షలు నిర్వహిచే సమయంలో పేపర్‌లు లీక్ అయ్యాయనే కారణంతో వీటిని రద్దు చేశారు. డిసెంబరు నెలలో ఈ పరీక్షలను నిర్వహించారు. గతంలో మూడు యూనిట్ టెస్ట్‌లతో పాటు క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ప్రీ ఫైనల్ పరీక్షను నిర్వహించిన అనంతరం పబ్లిక్ పరీక్షలకు పదో తరగతి విద్యార్థులు వెళ్లేవారు. పరీక్షల నిర్వహణలో మార్పులు చేసి సమగ్ర మూల్యాకనం విధానంలో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయాలని నిర్ణయించారు. గతంలో ఒక్కో సబ్జెక్టుకు 100 మార్కులకు పరీక్ష నిర్వహించగా నేడు 80 మార్కులకు పరీక్ష పెట్టి, మిగిలిన 20 మార్కులను ఆయా సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు విద్యార్థి పనితీరును బట్టి మార్కులు ఇవ్వాలనే నిబంధన పెట్టారు. సమ్మేటివ్, షార్మేటివ్ పరీక్షలలో విద్యార్థులకు వచ్చిన మార్కులు, తదితరాలను పరిగణనలోకి తీసుకుని ఈ మార్కులు కేటాయించాల్సి ఉంది. ఈ ప్రక్రియ మొత్తం పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ముందుకుగానే జరగాల్సి ఉంది. పబ్లిక్ పరీక్షలలో ఒక్కో సబ్జెక్టులో వచ్చిన మార్కులకు, సబ్జెక్టు ఉపాధ్యా యుడు ఇచ్చిన మార్కులను కలిపి మార్కుల మెమోను తయారు చేయాల్సి ఉంది. పబ్లిక్ పరీక్షలకు 4 రోజుల ముందు వరకు సమ్మేటివ్ -2ను నిర్వహిస్తే ఈ జవాబు పత్రాలను ఎప్పటికి మూల్యాంకన చేసి ఆన్‌లైన్ చేస్తారు ? అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా విద్యార్థుల సౌలభ్యాన్ని పరిగణన లోకి తీసుకోకుండా విద్యాశాఖ ఉన్నతాధికారులు సమ్మేటివ్-2ను ఫిబ్రవరి 26 నుంచి మార్చి 11 వరకు జరపాలని నిర్ణయం తీసుకోవడం సముచితంగా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

## అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల డీపీఆర్‌పై నిపుణుల కమిటీ

**విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:** అప్పర్ పెన్నార్ ఎత్తిపోతలకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని రాష్ట్ర జలవనరులశాఖ నియమించింది. ఈమేరకు ఆశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఆదివారం జీవోను జారీ చేశారు. హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు రెండో దశ పనుల్లో భాగంగా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి అప్పర్ పెన్నార్ ప్రాజెకుతోపాటు ప్రతిపాదిత సోమరావండ్లపల్లి, పుట్టకనుమ రిజర్వాయర్‌లకు నీటిని ఎత్తిపోసేందుకు నిర్దేశించి ఈ డీపీఆర్‌ను రూపొందించారు. అనంతపురంజిల్లాలో 25వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందచనున్న వీటి నిర్మాణానికి రూ. 920 కోట్ల వ్యయం కానుంది. అయితే ఈ నివేదికను సమగ్రంగా పరిశీలించి ఇంకా ఖర్చులు తగ్గించేందుకు గల అవకాశాలపై నిపుణుల కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలో నీటిపారుదలశాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్, అనంతపురము చీఫ్ ఇంజనీర్ (కన్వీనర్),లతోపాటు మరో ఇద్దరు పదవీ విరమణ చేసిన ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు ఉన్నారు. వీరు డీపీఆర్‌పై అధ్యయనం చేసి రెండు వారాల్లో తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని జీవోలో పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగానికి ముప్పు

**ఎస్‌టీయూ రాష్ట్ర నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఆందోళన**




**విశాలాంధ్ర - తిరుపతి కార్పొరేషన్ :** విద్యా వ్యాపారీకరణతో ప్రభుత్వ విద్యా రంగానికి ముప్పు ఏర్పడుతోందన్న వాస్తవాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.జోసెఫ్ సుధీర్‌బాబు, ప్రధాన కార్యదర్శి గాజుల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎస్‌టీయూ భవన్‌లో ఆదివారం ఉదయం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు రోజులుగా ఎస్‌టీయూ 70 వసంతాల ఉద్యమోత్సవం, సీపీఎస్‌పై అవగాహన సదస్సు, మహా ర్యాలీ, రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహిం చామన్నారు. విద్యారంగ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశామని వెల్లడించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, నిరంతర సమగ్ర మూల్యాంకన విధానంలోని లోపాలు సరిదిద్దాలని, ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలుపరచాలని, జూనియర్ లెక్చరర్ పోస్టులను, స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతులతో భర్తీ చేయాలని, మున్సిపల్, ఎయిడెడ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని తీర్మానించామన్నారు. అంతే కాకుండా పండిట్, పీఈటీ పోస్టులన్నీ అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులివ్వాలని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలని, ఉన్నత పాఠశాలలన్నింటికీ బోధనేతర సిబ్బందిని నియమించాలని, వేతన సవరణ, డీఏ బకాయిలు చెల్లించి వెంటనే నూతన వేతన సవరణ కమిటి నియమించాలని, హెల్త్ కార్డుల ద్వారా నాణ్యమైన వైద్య చికిత్సలపై చర్యలు తీసుకోవాలని, అర్థవేతన సెలవులు నగదుగా మార్చుకునే సౌలభ్యం కల్పించాలని డిమాండు చేస్తూ తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై స్పందించేలా శాసనమండలి ద్వారా ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు. టీచర్లకు బోధనేతర పనుల నుంచి మినహాయించి బోధనకే పూర్తి సమయం వెచ్చించేలా చూడాలన్నారు. సమావేశంలో ఎస్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఇ.షణ్ముర్తి, రాష్ట్రఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి పి.సుబ్బరాజు, అదనపు ప్రధాన కార్యదర్శులు ఎం.వి. రమణప్ప, సన్యాసిరావు, అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్, ఉపాధ్యక్షులు ధనంజయులు నాయుడు, తిరుపతి డివిజన్ నాయకులు జగన్నాథం, ముని కృష్ణమ నాయుడు, రమేష్, వెంకటేష్, మల్లికార్జున, మురళీకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



## టీడీపీ ఎమ్మెల్సీ వాకాటి అరెస్ట్

**విశాలాంధ్ర - నెల్లూరు బ్యూరో :** టీడీపీ ఎమ్మెల్సీ వాకాటిని సీబీఐ ఆదివారం అరెస్ట్ చేసింది. విచారణ కోసం బెంగళూరుకు పిలిచి అరెస్ట్ చేసింది. బ్యాంకులను మోసం చేశారంటూ వాకాటిపై అభియోగాలున్నాయి. దీంతో గతం లోనే టీడీపీ వాకాటిని పార్టీ నుంచి బహి ష్కరించింది. ఐఎఫ్‌సీఐ నుంచి 180 కోట్ల రూపాయల రుణం తీసుకున్న వాకాటి.. శామీర్ పేటలోని 12 కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని 240 కోట్ల రూపాయల స్థలంగా చూపి రుణం పొందారని అభియోగా లున్నాయి. రుణం చెల్లించకపోవడంతో సీబీఐకి ఐఎఫ్‌సీఐ ఫిర్యాదు చేసింది.

# వంశధార లీజులో 'గలీజు'

**అనుమతిలేని చోట రాయి తవ్వేసిన కాంట్రాక్టర్**

**రూ.7.5 కోట్లు జరిమానా విధించిన గనుల శాఖ**

**విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం :** లీజుకిచ్చిన చోట తవ్వకాలు చేయకుండా, మరోచోట తవ్వకాలు జరిపి నిబంధనలు ఉల్లంఘించిన సంస్థపై గనులు, భూగర్భ శాఖ అధికారులు భారీ జరిమానా విధించారు. వంశధార నిర్మాణ పనుల కోసం మంజూరు చేసిన క్వారీని కాదని, మరొకచోట తవ్వకాలు చేపట్టిన శ్రీ సాయిలక్ష్మి కన్‌స్ట్రక్షన్ (ఎస్ఎస్ఎల్‌సి) కంపెనీ నిబంధనలు ఉల్లంఘించింది. శ్రీకాకుళం జిల్లా భామిని మండలం చిన్నదిమిలి వద్ద సర్వే నెం.284లో 4 హెక్టార్లలో రాయి, గ్రావెల్‌ను తీసుకెళ్ళేం దుకు సదరు సంస్థకు అనుమతి ఉంది. కానీ తమకు ఈ ప్రాంతం అనువుగా లేదని, ఎలాగూ ప్రభుత్వ ప్రాధాన్యతా ప్రాజెక్టే కదా అని వారికి నచ్చిన చోటే తవ్వేయడం మొదలుపెట్టారు. అలా పక్కనే ఉన్న మరో కొండ నుంచి మొత్తం 3.5 హెక్టార్లలో రాయిని తొలిచేశారు. సాధారణ తనిఖీ నిర్వహిస్తున్న మైన్స్ అధికారులు ఈ విషయాన్ని గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తున్న సంస్థకు రూ.7.5 కోట్లు జరిమానా విధించారు. ఇందుకు సంబంధించి డిమాండు నోటీసుతో పాటు షోకాజ్ నోటీసును శనివారమే సదరు సంస్థకు పంపిం చారు. వంశధార ప్రాజెక్టు కోసమే కదా ఏమవుతుంది లేనని భావిస్తూ వచ్చిన సదరు సంస్థ ఖంగుతింది. వెంటనే జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించి వారు తవ్వేస్తున్న కొండకు ఇప్పటికిప్పుడు అనుమతులివ్వాలంటూ ఒత్తిడి చేయడం మొదలుపెట్టింది. డిమాండు నోటీసు ఇంకా వారికి అందకమునుపే జిల్లా కేంద్రం నుంచి సర్వేయర్ల బృందం అక్కడకు చేరుకుని పాత అనుమతులను రద్దు చేసి, కొత్తగా తవ్వేస్తున్న చోట ఎన్‌వోసీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఎంతటి ప్రాధాన్యతా ప్రాజెక్టయినా నిబంధనలు ఉల్లంఘించిన విషయం బయటపడింది కాబ ట్టి, జరిమానా కట్టాల్సిందేనంటూ, ఇక తమ



చినదిమిలిలో అక్రమ క్వారీని పరిశీలిస్తున్న సర్వే అధికారులు

పరిధిలో ఈ అంశం లేదంటూ మైన్స్ సిబ్బంది తెగేసి చెబుతున్నారు. మరోవైపు జరిమానాను తప్పించాలంటే ఎవ్వరి తరమూ కాదని, డైరెక్టర్‌కు తొలుత అప్పీలు చేసుకుని, తర్వాత ప్రభుత్వాన్ని సంప్రదించడమొక్కటే మార్గమని తెలుస్తోంది. గనుల శాఖా మంత్రి విచక్షణతో జరిమానాను తగ్గించే అవకాశముంది గానీ, పూర్తిగా రద్దు చేయడం సాధ్యపడదు. సరిహద్దులు దాటి తవ్వకాలు జరపడం, పరిమితికి మించి తవ్వేయడంతో క్యూబిక్ మీటరుకు రూ.30 చొప్పున రావాల్సిన రాయల్టీ లెక్కన దీని విలువ దాదాపు రూ.రెండు కోట్లు ఉంది. దానికి నాలుగురెట్లు అధికంగా జరిమానా విధించడంతో అది రూ.7.5 కోట్లుకు చేరింది. ప్యాకేజీ 88లో భాగంగా సదరు ఎస్ఎస్ఎల్‌సి కంపెనీ దాదాపు 20 కి.మీల వరద కాలువ నిర్మాణంతో పాటు సింగిడి, పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ల నిర్మాణం చేస్తోంది.

### నిబంధనల ఉల్లంఘన వాస్తవమే : తమ్మునాయుడు, ఏడీ, మైన్స్



ఎస్ఎస్ఎల్‌సి కంపెనీ నిబంధనలు ఉల్లంఘించిన విషయం మా క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. వారికి రూ.7.5 కోట్లు జరిమానా కింద డిమాండు నోటీసు పంపించాం. అనుమతిలిచ్చిన చోట కాకుండా మరోచోట తవ్వకాలు చేయడం, పరిమితికి మించి తవ్వకాలు చేయడం లాంటివి నిర్ధారణ అయ్యా యి. భామిని మండలంలో సర్వే నెం. 284లో తవ్వకా లకు అనుమతినిస్తే వారు మరోచోట తమకు ఎన్‌వోసి ఉందని చెప్పారు. గడువు ఇచ్చినా వారు ఎలాంటి ఎన్‌వోసీలను చూపించనందునే జరిమానా విధించాం. విషయాన్ని మా శాఖ డైరెక్టర్‌కు తెలియజేశాం.

# అవార్డు వాపసీతో మరో ధిక్కారస్వరం

డాక్టర్ దేవరాజు మహారాజు,
✆: 9908633949

మానవవాదుల్ని, హేతువాదుల్ని, రాజ్యాన్ని విమర్శించే మేధావుల్ని ఒక పద్ధతి ప్రకారం హత్య చేయడం ఈ దేశంలో 2015 నుండి జరుగుతూ ఉంది. ఏళ్ళు గడుస్తూ ఉన్నా హంతకుల జాడ తెలియకపోవడం పాలకుల వైఫల్యాన్ని తెలియ జేస్తూ ఉంది. సామాన్యుడి నడ్డి విరగగొట్టే పథకాల గురించి అత్యుత్సాహంగాప్రసంగించే జాతీయనేతలు ఇలాంటి విషయాల మీద నోరుమెదపడంలేదు. వారు తమ బాధ్యతను విస్మ రిస్తున్నారని సామాన్యులు అనుకుంటున్నది అందుకే. భిన్నత్వం లో ఏకత్వం సాధించుకుని హాయిగా వేలయేళ్ళ నుండి సహ జీవనం చేస్తున్న భారతీయుల్ని అధికారం అడ్డుపెట్టుకుని, బల వంతపు ఏకత్వంలోకి తీసుకురావాలను కోవడం ఒక పెద్ద తప్పిదం. అది రాజ్యాంగాన్ని అతిక్రమిం చడం. అందువల్లనే ఇటు సామాన్యుల, అటు మేధావుల నిరసనలు వెల్లువెత్తు తున్నాయి. గతంలో రచయితలు, శాస్త్రజ్ఞులు, సినీనాటక రంగాల వారు మూకుమ్మడిగా తమ తమ అవార్డుల్ని, బిరుదుల్ని కేంద్ర ప్రభుత్వానికి తిప్పి పంపి, దేశంలో ఒక సంచలనం సృష్టించారు. డెబ్బయ్యేళ్ళ స్వాతంత్ర్య భారతంలో అదొక చారిత్రాత్మక సంఘటన. ఆ నిరసనలోని తీవ్రతను, ఆర్ద్రతను, ప్రభుత్వం సహృదయంతో స్వీకరించలేక పోయింది. నివారణ చర్యలు చేపట్టలేకపోయింది. పైగా, అవార్డుల్ని తిప్పికొట్టి నిరసన తెల్పిన వారిదే 'అసహనం' అన్నట్టు కొందరు పెద్దలు మాట్లాడారు. హత్యలు చేసిన వారికి, ఇక ముందు చేయబోతున్న వారికీ ఆ మాట ప్రోత్సాహ కారిగా పనిచేసింది. అది, మరీ దారుణమైన విషయం!

ఇటీవల ప్రకటించిన 2017 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల్లో కీర్తిశేషుడయిన తమిళకవి మక్కల్ పవలార్ ఇంకులాబ్ (ఇంక్విలాబ్) కూడా ఉన్నారు. ఆయన తన జీవితకాలంలో రాజ్యాన్ని దూరంగానే పెట్టారు. పైగా రచయితల, జర్నలిస్టుల హత్యలను ఆయన తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా తీవ్రంగా నిరసిస్తూ వచ్చారు. ఇప్పుడు ఆయన చనిపోయిన తర్వాత, కేంద్ర సాహిత్య అకాడమీ ఆయనకు అవార్డు ప్రకటించింది. దాన్ని స్వీకరిం చాలా వద్దా అన్నది ఆయన కుటుంబం నిర్ణయించాల్సి వచ్చింది. కవి ఇంక్విలాబ్ ఏ విలువలకోసం రచనలు చేశారో, ఏ విధానాల్ని అవలంబించారో, ఏ ఆలోచనా ధోరణిని పరి వ్యాప్తం చేశారో బాగా తెలిసిన కుటుంబ సభ్యులు కేంద్ర అకాడమీ అవార్డును తిరస్కరిస్తున్నామని ప్రకటించారు. ఒక వేళ ఆ అవార్డు స్వీకరిస్తే చనిపోయిన కవి ఆశయాలను నిర్దాక్షిణ్యంగా నీరుగార్చినట్లవుతుందని బాధపడ్డారు. కీర్తి కోసమో, దానితో వచ్చే పారితోషికం కోసమో ఆశపడితే, సమాజం దృష్టిలో తాము హీనులమైపోతా మనీ, అందువల్ల అవార్డు స్వీకరించకుండా, కవి ఆశయాల్ని నిలపడమే తమ ధ్యేయమని ప్రకటించారు.

21 డిసెంబర్ 2017న కేంద్ర సాహిత్య అకాడమీ వెలు వరించిన ప్రకటనలో తమిళకవి ఇంక్విలాబ్ పేరుంది. 'కాంథల్ నాట్కల్' అనే శీర్షికతో వెలువడిన కవితాసంపుటికి ఆ గౌరవం దక్కింది. కవి మరణానంతరం ప్రకటింపబడింది గనక, ఆయన కూతురు అమైనా భారలిన్ దానిపై స్పందిం చారు. తన తండ్రి, కవి ఇంక్విలాబ్ మొదటి నుండి తాడితుల, పీడితుల పక్షాన నిలబడ్డవారని, అణగదొక్కబడిన, వెనకబడిన జాతుల గూర్చి ఆవేదన చెందుతూ రచనలు వెలువరించారని, అందుకు ఫలితంగా ప్రభుత్వాలు ఆయనపై ఆంక్షలు విధించి, అరెస్టులు చేసి ఎన్నో ఇబ్బందులు పెట్టారని, అలాంటి ప్రభుత్వ అవార్డుల్ని, తన తండ్రి బతికి ఉంటే స్వీకరించేవారు కాదని, ఆయన లేకపోయినా, ఆయన కుటుంబమంతా ఆయన ఆలోచనా ధోరణికి కట్టుబడి ఉందని, అందుకే మేం ఆ అవార్డుని తిరస్కరిస్తున్నామని ప్రకటించారు. కవి ఇంక్విలాబ్ బతికి ఉన్నంతకాలం, వేర్వేరు సమస్యలమీద జనం మనిషిగా స్పందిస్తున్న కాలం, ఈ ప్రభుత్వం మాటిమాటికీ ఆయనను అరెస్టు చేసింది. దర్యాప్తు పేరిట నిరంతరం వేధించింది. ఆయన చనిపోయాక ఇప్పుడు ఆయనకో అవార్డు ప్రకటించి, గొప్ప పనిచేశామని మురిసిపోతున్న... ప్రభుత్వ విధానాల్ని రచయిత కుటుంబం నిర్ద్వందంగా ఎండగట్టింది.

1980లో తమిళనాడు పెరంబలూర్ జిల్లాలోని కొలప్పడి గ్రామంలో నలుగురు దళితులపిల్లలు ఊరిబావిలోంచి మంచి నీరు తోడుకుని తాగినందుకు హత్య చేయబడ్డారు. మత ఛాందసులతో నిండి ఉన్న ఆ ఊర్లో ఎవరూ ఆ సంఘటన పట్ల దిగ్భ్రాంతిగానీ, సంతాపంగానీ ప్రకటించలేదు. చని పోయిన పిల్లల కుటుంబాలు, వారి మద్దతుదార్లు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతూ, ఊరేగింపుగా వెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. హత్యలు చేసిన వారిని వదిలిపెట్టి, పోలీసులు నిరసనలు తెల్పిన వారిని నానా రకాలుగా హింసించారు. దేశంలో జరుగుతున్నదేమిటీ? ఇదేం న్యాయం? అని కవి ఇంక్విలాబ్ 'మనుసంగదా' (మేమూమనుషులమే) అనే పాట రాశారు. అది ఊరూరా పాకి పోయింది. చివరికి అది తమిళ నాడులో దళితుల జాతి గీత మైంది. 'కొలప్పడి బావి నీరు మా దళిత పిల్లల్ని కాల్చేసింది. అవును! నీరే పిల్లల్ని కాల్చేసింది. దానికి అగ్రవర్ణాలవారు, ప్రభుత్వమూ చట్టాల సహాయంతో అగ్నికి ఆజ్యం పోశారు. మా పిల్లల ఎముకలు, మాంసం, అగ్నిచితిపై నిర్దాక్షిణ్యంగా కాల్చేశారు.'- అన్నది ఆ పాటలోని సారాంశం: (ఆ బావి ఇప్పటికీ కొల ప్పడిలోఉంది. అయితే వాడుకలో లేదు).



ఇదేకాకుండా, అంతకు ముందు 1968లో కీజా వెన్మణి సంఘటనలో నలభై నాలుగుమంది దళితుల్ని అగ్రవర్ణ భూస్వాములు చంపేసినప్పుడు కూడా కవి ఇంక్విలాబ్ కోపంతో రగిలిపోయారు. తన రచనలతో విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. ఎన్నో రాజకీయ కారణాల వల్ల, ఎన్నెన్నో అంతర్గత సమస్యల వల్ల ఆ సంఘటనల వివరాలు ప్రధాన వార్తాస్రవంతిలో రాలేదు. కాని, ఈ ఇంక్విలాబ్ రచనవల్లవిషయం బయటి ప్రపంచానికి తెలి సింది. పైగా చరిత్రలో అది నమోదయింది. ఈ సంఘటనపై కవి ఇంక్విలాబ్ రాసిన ఆ పాట 'ఫేసెస్ ఆఫ్ చేంజ్' అనే అంతర్జాతీయ డాక్యుమెంటరీ చలనచిత్రంలో చిత్రీకరించ బడింది. జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ఒక ఐదుగురు మహానుభావుల గురించి తీసిన డాక్యుమెంటరీ అది! దళితుల హక్కులకోసం పనిచేసే ఎవిడెన్స్ (రుజువు) అనే సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎ. ఖతీర్ చెప్పిన విషయమేమంటే - 'ఇంక్విలాబ్ రాసిన ఒకే ఒక్క పాట ప్రభుత్వాల్ని, రాజకీయాల్ని, కులవ్యవస్థను, మీడియాను ఆలోచనలో పడేసింది. కదిలించింది కూడా!' - అని! ప్రజాకవిగా అంతటి ఘనచరిత్రగల కవిని బతికి ఉన్నప్పుడు హింసించి, చనిపోయాక అవార్డులిచ్చే రాజకీయాలు మారాలి. ప్రభుత్వ విధానాలు మారాలి. వ్యవస్థే మారాలి.

'మను సంగదా' అనే పాట ఏదో ఒకరోజులో జరిగిన అద్భుతం కాదు. ఏళ్ళకేళ్ళుగా అణగారిన వర్గాలతో మమేకమై కవి నడుస్తూ వస్తున్న దానికి ఫలితం! ఒకచోట ఇంక్విలాబ్ ఇలా చెప్పుకున్నారు. 'నావి స్వతంత్ర సృజనాత్మక రచనలు కావు. ఒకరకంగా అవి అనువాదాలు. అణగారిన వర్గాల జనం ఉచ్ఛ్వాస నిశ్వాసల్ని పైకి లేచిన వారి కనుబొమల ప్రశ్నల్ని నేను సాహిత్యంలోకి అనువదించాను... అంతే! ముఖ్యంగా ఆ వర్గాల యువకుల కళ్లలోని ఆశల వెలుగుల్ని నేను కవితలుగా మలిచాను' - అని! అదీ ఆయన నిజాయితీ.. అసలు పేరు షహుల్ హమీద్ (72). 1944లో జన్మించారు. కమ్యూనిస్ట్ కార్యకర్తగా ఎదుగుతూ విద్యాభ్యాసం ముగించుకుని, చెన్నైలోని న్యూకాలేజీలో తమిళ ప్రొఫెసర్‌గా పనిచేశారు. పెరియార్‌ను అమితంగా అభిమానించే ఈయన, మార్క్సును, లెనిన్‌ను శ్రద్ధగా అధ్యయనం చేశారు. ఆ ఆలోచనా ధోరణితోనేరచనలు చేస్తూ వచ్చారు. కన్మణి రాజమ్, మణిమేఖలై, కురింజిపట్టు వంటివి ఆయన ప్రసిద్ధ రచనలు. ఈయన కవి మాత్రమే కాదు, కథారచయిత కూడా! రాజకీయ విశ్లేషకుడిగా కూడా మంచి పేరుంది. పురాణాల్లోని స్త్రీ పాత్రలతో ఆయన రాసిన నాటకాలు 'అవ్వాయ్', 'మణిమేఖలై'- బహుళ ప్రజాదరణ పొందాయి. ఇందులో 'అవ్వాయ్' కళాశాల స్థాయిలో పాఠ్యపుస్తకమయింది.

నరేంద్ర దబోల్కర్, పన్సారే వంటి వారి హత్యలు కొనసాగుతున్నప్పుడు అవార్డు వాపసీ నిరసన కార్యక్రమం ఉధృతంగా కొనసాగుతున్నప్పుడు కలతచెందిన షహుల్ హమీద్ - ఇంక్విలాబ్ 'మృతప్రాయుడిగా జీవించాలని అనుకునేవారే ఇలాంటి అవార్డులు స్వీకరించాలి!' అని - తనకు అవార్డు కాకముందే... అవార్డు గురించి తన అభిప్రాయం ప్రకటించారు. 1డిసెంబర్ 2016న కన్నుమూసిన ఈ కవి ఆకాంక్ష మేరకు, ఆయన కుటుంబం నడుచుకోదలచింది. కవి స్థాయిని ఎన్నో రెట్లు పెంచింది. మహోన్నతుల స్థాయికి అవార్డులు, బిరుదులు ఎదగలేవని దీనితో తేటతెల్లమయింది.

కేంద్ర సాహిత్య అకాడమీ స్వతంత్ర సంస్థ కదా- అని అనుకునేవారున్నారు. నిజమే! కాని దానికి నిధులెక్కడి నుండి వస్తున్నాయ్? కేంద్రప్రభుత్వం ఇవ్వాల్సిందే కదా? కేంద్ర ప్రభుత్వానికి ఆదాయమెక్కడిదీ? ప్రజలు పన్నులు చెల్లిస్తేనే కదా దానికి ఆదాయం వచ్చేది? అంటే ప్రజల సొమ్ముతోనే ప్రభుత్వాలూ, ప్రభుత్వ సంస్థలూ నడుస్తున్నాయన్నది ప్రజలు గ్రహించాలి. ప్రభుత్వంలో ఉండి అధికారం చలాయిస్తున్నవారేం చేస్తున్నారూ? ఎక్కువమందిని దోచుకుని ఏ కొద్దిమందికో మేలు చేస్తున్నారు. అలాగే ఏ కొద్దిమందినో చంపించి లేదా చంపేవాళ్ళను వెనకేసుకొస్తూ, అధిక సంఖ్యాకుల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. శాంతి వచనాల చాటున బీభత్సాలు సృష్టిస్తున్నారు. అందుకే జనం చైతన్యవంతులై వాస్తవాలు గ్రహించే దిశలో ప్రయాణించాలి. అవార్డు వాపసీ అయినా, నోట్ల రద్దయినా, మేధావుల హత్యలైనా, దళితులపై దాడులైనా... ఏవైనా అవి ప్రభుత్వం ప్రజల్ని ఆటాడుకుంటున్న తీరుతెన్నుల్ని చూపెడుతున్నాయన్నది నిజం!

'ఇంక్విలాబ్' - కున్న తెగువ, అలాంటి నిబద్ధత ఉన్న తెలుగు సాహిత్యకారులెవ్వరని ఆలోచించడం వృథా! గతంలో పెన్నుతోనూ, గన్నుతోనూ ప్రత్యక్షంగా రాజ్యంతో పోరాడిన సాహితీయోధుడు డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య ఉండేవారు. అలాంటి అరుదైన వ్యక్తిత్వం భారతీయ రచయితలలోనే కాదు, ప్రపంచ సాహితీ వేత్తలలోనే అరుదు. ఇక సమకాలీనంలో ఇంక్విలాబ్ లాంటి రచయితల వ్యక్తిత్వం తెలుసుకుని, తెలుగు సాహిత్యకారులంతా ఆత్మవిమర్శ చేసుకోవడం అవసరం!

# చాసో కవిత్వం- సార్వజనీనత

(గతవారం తరువాయి)

**ధ్వని** (Rhetorically Implied Meaning)

వాక్యంలోని పదాలకు ఉండే నైఘంటికార్థం కాకుండా ఆ పదాల సమూహార్థపు సమన్వయార్థం - ఒక పరోక్షార్థం - స్ఫురించటమే ధ్వని అంటే.

"ఆకలి మంటలు బాబూ! ఇవి ఆరని మంటలు బాబూ!"
"అతడు పశ్చాత్తాపంతో తండ్రిపాదాలను కన్నీళ్లతో కడిగాడు"
"ఆమె తన గుండెను గుడిగా చేసుకుంది"
"నీవు పరీక్ష పాసుకాలేదనుకో. ఇక చూసుకో ఉంటుంది"
"నీకు ఎన్ని సార్లు చెప్పాను?"

- ఇలాంటి వాక్యాలలో ప్రతి పదార్థం వేఱు. ఆ వాక్యాల వెనుక ఉన్న అంతరార్థం వేఱు. ఇదీ - 'ధ్వని' అంటే. దీనినే ఆంగ్లంలో "Between the lines" అంటారు ఒక రకంగా. ఈ ధ్వని అనే కావ్య లక్షణం చాసో కవితలలో అన్నింటి కన్నా ప్రబలంగా, ప్రతిభావంతంగా కనిపిస్తుంది. అసలు అదే ఏ కవిత్వానికైనా ప్రాణం. కావ్యానికి 'రసం' ఆత్మ అన్నాడు భారతీయ అతి ప్రాచీన అలంకారికుడు భరతుడు. ప్రాచీన వేద వాఙ్మయమైతే 'రసోవైః' (రసం అనేది దైవం) అన్నది. కానీ ఆ రసము అనే కావ్యాత్మను అనుభూతి మార్గంలో ఆవిష్కరించేది 'ధ్వని' మాత్రమే. అందుకనే కావ్యానికి గరిమనాభి 'ధ్వని' అంటాడు ఆనంద వర్ధనుడు తన 'ధ్వన్యాలోక' అలంకార శాస్త్ర గ్రంథంలో 'కావ్య స్యాత్మా ధ్వనిః' అంటూ ఈ రస, ధ్వని ప్రాధాన్యవాదాలను సమన్వ యించుకోవా లంటే ధ్వని లేని కవితలో రసం ఉండదు. రస మూరని కవితలోది 'ధ్వని'కాదు. ఈ రెండూ ఒకే నాణెమునకు బొమ్మ-బొరుసు. ఈ ఉద్దేశంతోనే ధ్వని సిద్ధాంత కర్త ఆనంద వర్ధనుడు, రససిద్ధాంతాన్ని గౌరవిస్తూనే 'ధ్వని'ని రసధ్వని, వస్తు ధ్వని, అలంకారధ్వని అని మూడు విధాలుగా విభజించి చెప్పాడు. మళ్ళీ పై మూడు రకాల ధ్వనులలోనూ శాఖోపశాఖలుగా చాలా ఉప విభజనలున్నాయి.

చాసో కవితలలో రసధ్వని, వస్తుధ్వని, అలంకార ధ్వని అనే ముమ్మూర్తులూ ఎడనెడ సందడిస్తూనే ఉంటాయి. కానీ అంత విపులీకరణకు ఇప్పుడు ఇక్కడ నేను పూనుకోవడం లేదు. అయితే ఆధునిక భావజాల ధ్వనిపరంగా చాసో కవితలలో కనిపించేది 'మానవతావాద జిజ్ఞాసా పూర్వక ధ్వని' ఇదే ఇందులోని ఇంపైన కవిత్వపు విలువ.

ధ్వనిఅనేది శాఖోపశాఖలుగా విభజితమై ఎన్నో ఉప విభాగాలుగా ఉన్నదని చెప్పుకొన్నాం. కానీ స్థూలంగా చూస్తే రెండు విధాలు - (1) అవివక్షిత వాచ్య ధ్వని (2) వివక్షితాన్య పరవాచ్య ధ్వని. ఒక పద బంధానికిగాని, వాక్యానికి గాని కనిపించే అర్థం కంటే పరోక్షమైన భావమే ప్రధానంగా ఉండటం అవివక్షిత వాచ్య ధ్వని. అలా కాకుండా ప్రత్యక్షంగా కనిపించే అర్థము. పరోక్షంగా ధ్వనించే విలక్షణ భావము - రెండూ ముఖ్యంగానే కనిపిస్తే అది వివక్షితాన్య పరవాచ్య ధ్వని. ఈ రెండు రకాల ధ్వని (Technique) శిల్పములలో ఏదో ఒకటి చాసో కవితలలో కనిపిస్తూనే ఉంటుంది.

ఈ ధ్వన్యాకర్షణ 'చాసో కవితలు' పుస్తకంలోని మొదటి కవితా శీర్షికతోనే ప్రారంభమవుతుంది. కవిత పేరు 'ధర్మక్షేత్రము'. ధర్మక్షేత్రము అంటే ధర్మము నెలకొనియున్న పుణ్యభూమి అని అర్థం. ఇది రెండవ ప్రపంచ యుద్ధమప్పుడు మానవాళి, సైనికాళి అనుభవించిన దుస్థితిమీద రాసిన కవిత. కురుక్షేత్ర సంగ్రామాన్ని వర్ణిస్తున్నట్టుగా రాసిన వ్యంగ్య కవిత.

'సామాన్య మానవుడు సైన్యంలో చేరిన పాపానికి తన రక్తం ధారలుగా కారిపోతుంటే, తాను చనిపోతుంటే, భార్య, పిల్లలు, పాపలు దీనులై, మ్లానులై క్షోభిస్తుంటే, రాజులు వాళ్ళ స్వార్థం కోసం, రాజ్యాధికార లబ్ధికోసం బీభత్సంగా, నిర్దాక్షిణ్యంగా రుధిరపుటేరులు పారిస్తుంటే, మారణహోమం చేస్తూ ఉంటే ఇది ధర్మమా? పుణ్యమా? నరజాతికి శ్రేయమా? ఆహా! ఇది ఎంత గొప్ప ధర్మం?! ఈ ఇలాతలం ఎలాంటి పవిత్ర స్థలం?!' అంటూ గౌణంగా నిగ్గుదీస్తున్న శీర్షిక 'ధర్మక్షేత్రం'. ఇలాంటి శీర్షిక పెట్టడం తోనే కవి ధ్వనిస్తున్న వెటకారపు, బాధాతీవ్రపు, చింతాక్రాంతపు ఎడ్వొకసీ (న్యాయార్థపు వకాల్తా) పాఠకుడిని 'ఆలోచించవా?' అని నిలదీస్తుంది. ఇది ఇక్కడి ఆలంకారికశైలి - అవివక్షిత వాచ్య ధ్వని శిల్పం. ఇక్కడ ధర్మక్షేత్రం అంటే అది ఆ పదం యొక్క ప్రత్యక్షార్థం కాదు. అందులో ప్రస్తావించబడిన నరనారాయణులూ కాదు. ఆ పదాల వెనుక భావాత్మకంగా స్ఫురించే అప్పటి సామ్రాజ్యవాద దేశాల నేతలు. కవితలో 'మారణాస్త్ర హత', 'వికలాంగ వీరులు', 'విగత ప్రాణులు' ఆ సామ్రాజ్యవాద దేశాల తరపున ప్రాణాలొడ్డి సంగర రంగంలో నేలగూలిన భారత సైనికులు.

'నారాయణుడే నరునకు సారథియైనాడు' - నారాయణుడు అంటే నీటికి నిలయమైన వాడు. 'నీరే ప్రాణాధారము' అనేది ఒక నిత్యసత్యసూక్తి. అలాంటి ప్రాణాధారానికి నెలవైన పురుషోత్తముడు అనేవాడు నరుడుని నడిపిస్తున్నాడు - రథాలంబనతో సారథిగా. 'నృణంతి నయంతి స్వవశమితి నరాః (అన్నింటినీ తమ వశమం దుంచుకొనువారు నరులు)' అని అమరకోశం చెప్పిన నిర్వచనం. స్వయంశక్తి కల నరుడిని నారాయణుడనే ఆదిశక్తి తన ఇష్టానుసారం నడిపించడం అనే అవాంఛనీయ స్థితి రెండవ ప్రపంచయుద్ధం నాటి యుద్ధ కండూతి, అధికార పిపాసలు కల ప్రపంచ నాయకుల దుర్మదాంధ స్థితి అని చాసో మనసు విలవిల.

ఇదే కవితలో

'కదన భూమి కల్లోలంలో
మార్గణాది
మారణాస్త్ర హత
వికలాంగ వీరుల
... ... ...'

అంటూ రాసిన పంక్తులలో గూడా ఇదే రకపు అవివక్షిత వాచ్య ధ్వని. ఎలాగంటే మార్గణము అంటే బాణము అనే అర్థం సరేసరి. మార్గణము అంటే వెదకుట అని గూడా అర్థం. అంటే బలహీనులను, ఆయుధ విహీనులను, వికలాంగులను మొదలైన వారిని గూడా వెదకి వెదకి మఱీ చంపారు అని అర్థం. ఇది అతి దారుణం, ఘోరాతిఘోరం.

'గోవర్ధన మెత్తి
గో, గోపికాగణమును
గాచిన
నారాయణుడే నరునకు
సారథియైనాడు' అంటారు చాసో ఇదే కవిత చివరలో.

కొండనేఎత్తేసి, ఆవులకు, అబలలకు అండ ఇచ్చిన అచ్యుతుడే అర్జునుడితో నరమేధం చేయించటమా? అని ముక్కుమీద వేలేసు కుంటాడు కవి ఇక్కడ. కరుణాకరుడైన ఏసు ప్రభువును నిత్యం స్మరించే పాశ్చాత్య దేశాల నాయకులేనా ఇలా ప్రపంచ యుద్ధం పేరుతో మానవ నాశానికి పూనుకోవటం అంటూ అసహ్యించు కోవటమే ఇందులోని 'వస్తు ధ్వని'. పోరు నష్టం పొందులాభం అనే పరోక్షసందేశం ఇందులోని విశ్వశ్రేయోర్దకావ్యలక్షణ ప్రయోజనం.

**అలంకారాలు, 'రీత్యా'దులు**

'విగత ప్రాణులౌ
విభులపైబడి
వెర్రెత్తిన యువిదల
యుద్ధాంతర
హృదయ దళన
రోదనార్తులు
విహాయసానికి మొత్తముగా
వినిపించాయి
"దదబరోం! దదబరోం!"
"హాఁహోం, హాఁహోం"
"సోహం, సోహం"

- 'ధర్మక్షేత్రం'లోని ఈ పది పంక్తులలో గూడా ఎన్నో కవిత్వపు విలువలు ఉన్నాయి. 'హృదయ దళన రోదనార్తులు' అన్న ఒక్క సమాసంలో ఎన్నో భావవిస్తృతిప్రభల భాసిస్తాయి. హృదయ దళన (గుండెలుపగిలే) రోదనార్తులు (రోదిస్తున్నవారి ఆర్తనాదాలు) విహా యసానికి (ఆకాశానికి) మొత్తంగా (విస్తరించి ఉన్నాయి అని అర్థం) విహాయసం అంటే ఉన్న ఆకాశం అనే అర్థానికి, రోదన శబ్దానికి అర్థవంతమైనసాంగత్యం (Congruence)ఉంది. 'రుదం త్యస్మిన్ఇతిరోదఃరోదసీ(దీనియందు దుఃఖపడుదురు)'అని అమరం అంటుంది. విహాయసంఅంటే రోదసి. ఇలా రోదనం, విహాయసం అనే శబ్దాలు అర్థ తాత్పర్యాలపరంగా పరస్పర సంబంధ భావ బంధంతో ప్రయోగితాలు.

(మిగతా వచ్చేవారం)

- శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం

# సాహితి



## గోదారి కళ్ళల్లో నెత్తుటి చుక్కలు

మట్టిని పిసికి చిన్న చిన్న అచ్చులు చేసి ఎండబెట్టి, రంగులేసి ఆ పడతి
మెడలో దండలుగా తయారు చేస్తుంది
బంగారం, వెండి, రాగి, ఇత్తడి అన్నింటి కంటే మట్టే సుందరమైంది కదా!
మంచుకు తడిసిన మట్టి ముత్యాల ముగ్గులతో వెలిగిపోతుంది
మట్టి నుండే కుండ, కూజా,మిద్దె ఏర్పడ్డాయి కదా!
మట్టిలో చాలా రంగులున్నాయి సుమా!
ఎర్ర మట్టి, నల్ల మట్టి, చౌడు మట్టి
అవును! తత్వవేత్తలందరూ మట్టి మీదే తత్వాలు పాడారు
"ఎంతటి భోగాలు అనుభవించినా చివరకు శరీరం ఆ మట్టిలోనేగా కలిసేది" అన్నారు.
చిన్నపిల్లలు నృత్యం చేస్తుంటే
నేల వణుకుతూ వుంది
చెట్ల పూలురాలుతూ వుంటే
తలపై కిరీటాలు అమరుతున్నాయి
ఆ పిల్లలు పూల మీద నడుస్తుంటే
పుడమి ఫక్కున నవ్వింది
ఆ చిన్న పిల్లల కళ్ళు మెరుస్తున్నాయి
వారికి ఎవరి భయమూ లేదు
నవ్వు, ఏడుపు, విస్మయాలను వారి కనురెప్పలు కుమ్మరిస్తున్నాయి
వారెందుకు భయంతో జీవిస్తున్నారు
వారి చెవులకు ఏ శబ్దాలు వినపడటం లేదు, కళ్ళకు ఏ దృశ్యాలు కనిపించడం లేదు
ఆంతరంగిక చలనాలు స్తంభించాయి
మనిషికి భవిష్యత్తుమీద ఆశలేనప్పుడు
మనస్సు గదికి అన్ని తలుపులు మూయబడే వుంటాయి
స్పందన లేని మనుష్యుల అంతరంగం చీకటి గుహ వంటిది సుమా!
అతడు ఆ ఢిల్లీ ప్రభువు దగ్గర చేతులు కట్టుకు నిలబడ్డాడు
"బానిసగానే వుంటాన"ని పదే పదే మొక్కుతున్నాడు
అవినీతే బానిసత్వానికి హేతువు
మరో ప్రక్క కోళ్ళ కాళ్ళకు కట్టుకున్న కత్తులతో నేలనెత్తురోడుతోంది
గోదావరి నది ఎర్ర బారింది
బలైపోయిన కోళ్ళన్నీ 'బీభత్సమే మన సంస్కృతా' అని ప్రశ్నిస్తున్నాయి
ఆమె ఏనాడూ మొక్కనాటి ఎరుగదు పొలం గట్టుమీద నడిచీ ఎరుగదు
పంట పండగను మాత్రం వంటకాలతో అనుభవిస్తోంది
ఆరుగాలం నాటేసినామెకి గారె ముక్క తెలియదు
ఇంట్లో పొయ్యి ఆరిపోయే వుంది
పండుగ పేరుతో మాత్రం ఈవిడ అన్నీ అనుభవిస్తుంది
నిజానికి పంటకి మతానికి సంబంధమే లేదు
మనిషి మొక్క నాటాక వెయ్యి ఏళ్ళకు గాని మతం పుట్టలేదు
జూద సంస్కృతి గాలి పటాలుగా ఎగురుతోంది
ఇంటి ముందు వేసిన రంగవల్లులన్నీ ఆబోతుల చిందులతో చిందరవందరయ్యాయి
ఆ కొండల సందుల్లో నుండి వస్తున్న నీటి పాయల్లో నుండి ఒకే పాట వినిపిస్తుంది
నక్షత్రాలు భూమిని చూసి విస్తుపోయాయి, గడ్డిపూలు కన్నీరు పెట్టాయి
మనుషులు మురికయిపోయారు, గాలి పటాలు చిరిగినట్టు చిరిగిపోయారు
గుండె దివ్వెలు ఆరిపోయాయి
కళ్ళు కుంకుమ పూలయ్యాయి, కొబ్బరితోట విలపించింది
గోదారి కళ్ళలో నెత్తుటి చుక్కలు
మనుషులు అప్పుల్లో కూరుకుపోతున్నారు
ఒకనాడు శ్రమ నుండి ఉత్పత్తి సాధించారు
ఈనాడు వ్యసనం శ్రమ ఆయుస్సు ధ్వంసం చేస్తుంది
పండగంటే మనుషులతో మనుషులు గడిపేది
మనస్సులు, మనస్సులు పెనవేసుకొనేది
మనుష్యులను విడదీసేది కాదు
బుద్ధ బోధనలు ఎలుగెత్తిన నేల ఇది సుమా!
వ్యవసాయ సంస్కృతికి వెన్నుపోటు పొడుస్తూ
'ఇదే మన పండగ' అని కేరింతలు కొడుతున్నారు
పునర్వివేచనే పునర్జీవన సూత్రం
ముందు మనుషులుగా ఆలోచించండి!
ఆ తరువాతే బుద్ధి వికసిస్తుంది.
జ్ఞానమే మనిషి జీవితానికి సోపానం

-డాక్టర్ కత్తి పద్మారావు,
✆ : 9849741695

## ప్రపంచ దర్శనం



రాహుల్ సాంకృత్యాయన్ విశ్వవిఖ్యాతి గాంచిన భాషా పండితుడే కాదు, గొప్ప చరిత్రకారుడు కూడా. స్వాతంత్ర్య సమరంలో పదేళ్ళు కారాగారవాసం చేసే అద్భుత అవకాశం ఆయనకు దక్కింది. ఆ రోజుల్లో జైలు జీవితం కొత్త వెలుగుల్ని, అంతర్ దృష్టినీ కలిగించి, శాశ్వత విలువలున్న రచనలు చేయించింది. నెహ్రూ తన కుమార్తె ఇందిరకు రాసిన లేఖలు ఇందుకు ఉదాహరణ. రాహుల్‌జీ రచించిన సుప్రసిద్ధ గ్రంథాల్లో ప్రస్తుత గ్రంథంతో బాటు, రుగ్వేద ఆర్యులు, సింహసేనాపతి, మధుర స్వప్నం, మధుపురి, జయయౌధేయ, దివో దాసు-లోకసంచారి, ఓల్గా నుంచి గంగకు చెప్పదగినవి. సంస్కృత పండితుడిగా కాశీ పీఠంవారు 'మహా పండిత్' బిరుదుతోను, బౌద్ధవిజ్ఞానులు, 'త్రిపీఠికా చార్య' పురస్కారంతోను గౌరవించారు. వైరాగ్య జీవితం గడుపుతు కులమతాలకు అతీతంగా సమదృష్టితో ప్రపంచాన్ని, సమాజాన్ని దర్శించారు. లెనిన్‌గ్రాడ్ విశ్వవిద్యాలయంలో బోధకుడిగా పనిచేసిన విజ్ఞాని.

మహాజ్ఞానులందరూ మహారచయితలు కారు. రాహుల్‌జీ అరుదైన యీ ఘనతను సొంతం చేసుకున్నారు. ఆయన జ్ఞాని, బోధకుడు, గొప్ప రచయిత కూడా. రాహుల్‌జీ రచనలు చదవడం ఒక జీవితానుభూతి. ఆయన శైలి, శిల్పనిర్మాణం, ఇతివృత్తానికి అలవోకగా ఇమిడిపోతాయి. అనువాదం చేయడంలో అనేక సమస్యలుంటాయి. కొన్ని మాటలకు తెలుగులో సమాన పదాలు సులువుగా దొరకవు. మూల విషయాన్ని సొగసుగా, స్థానీయమాధుర్యంతో, ఎక్కడా పొరబాట్లు దొర్లకుండా రాయగలిగిన అనువాదకులు ఆలూరి భుజంగరావుగారు, ఇలాంటి అమూల్య గ్రంథాన్ని పునర్ముద్రణతో పాఠకులకు అందిస్తున్న గడ్డం కోటేశ్వరరావుగారు శతధా అభినందనీయులు. ఇరవై అధ్యాయాలలో సాగిపోయే యీ రచన నదీ ప్రవాహంలా పాఠకుని తనతో లాక్కువెళ్తు అనేక సుందర ప్రదేశాలను పరిచయం చేస్తూ అను భూతుల్ని పంచుతుంది. చదవాల్సిన మంచి పుస్తకం.

విస్మృత యాత్రికుడు(యాత్రారచన)
-రాహుల్‌సాంకృత్యాయన్,
అనువాదం: ఆలూరి భుజంగరావు
పేజీలు:351, వెల: రూ. 280/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్,
33-22-2, చంద్రబిల్డింగ్స్, చుట్టుగుంట,
విజయవాడ-520004, ఫోన్:0866-2430302
మరియు విశాలాంధ్రబుక్‌హౌస్, అన్నిబ్రాంచీలలో

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్,
✆ :9849568901

Dwaraka

విశాలాంధ్ర

# బతుకు

The Life

సోమవారం

22 జనవరి 2018

## రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com









## నిండైన మాక్సీ!

చిన్నారులకు ఏ డ్రస్ వేసినా ముచ్చటగానే ఉంటుంది. అందులోనూ ఆడపిల్లలకు అంటే కావలసినన్ని మోడల్స్, అందులో పాత, కొత్తల మేలు కలయికగా ఉన్న వాటిలో మాక్సీ ఒకటి. సంప్రదాయంతో పాటు ఆధునిక డిజైన్‌ల కలబోతతో ఇవి అలరిస్తున్నాయి. నిండుగా మురిపిస్తున్నాయి. అలాంటి మాక్సీలపై మీరూ ఓ లుక్కేయండి మరి!







## సన్‌స్పాట్స్ భూవాతావరణాన్ని నియంత్రిస్తాయా?

ఎక్కడో కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉండే సూర్యుడి మీది మచ్చలు, భూ వాతావరణాన్ని నియంత్రిస్తాయంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. భూమికి వెలుతురు, వేడిని ఇచ్చేది సూర్యుడే కాబట్టి ఇందులో వింతేముందని కొందరు అనుకోవచ్చు. సూర్యుడి మీద ఉండే సన్‌స్పాట్ల సంఖ్య పెరుగుదల, తరుగుదలతోనే భూమ్మీద వాతావరణపు హెచ్చుతగ్గులు ముడిపడి ఉన్నాయన్నది మాత్రం వింతే. ఈ విషయాన్ని కొందరు శాస్త్రవేత్తలు ఏనాడో చెప్పినా మరికొందరు కొట్టివేశారు. సంబంధంలేని రెండు విషయాలకు ముడిపెట్టి సంచలనం సృష్టించే ప్రయత్నంగా అభివర్ణించారు. స్కాట్లాండుకు చెందిన 18వ శతాబ్ది శాస్త్రవేత్త థామస్‌షార్ట్ ఈ సన్‌స్పాట్ల గురించి చేసిన పరిశోధనల వివరాలు, గ్రాపులూ కొద్ది సంవత్సరాల క్రితం వెలుగులోకి వచ్చాయి.



### సన్‌స్పాట్ అంటే..

సన్‌స్పాట్లను, సూర్యగోళపు వైశాల్యాన్ని దృష్టిలో ఉంచుకొని చిన్నచిన్న మచ్చలుగా చెప్పినా నిజానికి అవి వేల కిలోమీటర్ల వెడల్పు ఉంటాయి. భగభగమండే సూర్యుడి మీద ఇవి శీతల ప్రాంతాలని చెప్పవచ్చు. అలాగని వీటి ఉష్ణోగ్రత తక్కువేమీ కాదు. సూర్యగోళ కేంద్ర భాగంలో కోటి 40 లక్షల డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణోగ్రత ఉంటే, సన్‌స్పాట్స్ ఉష్ణోగ్రత దాదాపు నాలుగువేల డిగ్రీల సెంటీగ్రేడు దాకా ఉంటుంది. సూర్యగోళపు ఫొటోస్ఫియర్ ప్రాంతంలో సన్‌స్పాట్స్ ఏర్పడతాయి. బాగా చీకటిగా ఉండే వీటి మధ్య భాగాన్ని అంబ్రా అనీ, అంత చీకటిగా ఉండని చుట్టుపక్కల ప్రాంతాన్ని పెనంబ్రా అని అంటారు. అంబ్రాలో వేడిగాలి ప్రవహిస్తూ ఉంటుంది. చీకటి లోయల్లో కనిపించే ఈ సన్‌స్పాట్స్‌ను ఆధునిక శాస్త్ర పరిభాషలో ఎలక్ట్రిక్ చార్జి పొందిన సౌర వాయువులు, సౌర అయస్కాంత క్షేత్రాల ఘర్షణల వల్ల పుట్టిన శీతల ప్రాంతాలుగా అభివర్ణిస్తున్నారు.

### సన్‌స్పాట్ సైకిల్

ఈ సన్‌స్పాట్స్ ప్రత్యేక కాలంలో కనిపించి మాయమవుతూ ఉంటాయి. వీటి సంఖ్య కాలానుగుణంగా పెరుగుతూ, తగ్గుతూ ఉంటుంది. దీన్నే సన్‌స్పాట్ సైకిల్ అంటారు. సౌర వలయం అని కూడా పిలుస్తారు. ఈ వలయం కాల పరిమితి దాదాపు పదకొండు సంవత్సరాలు ఉంటుంది. తొలుత చిన్నచిన్న సన్‌స్పాట్స్ ఏర్పడి, ఆ తర్వాత అనేకంగా పెరుగుతాయి. మొదట సూర్యగోళ మధ్యరేఖకు ఉత్తరంగా, దక్షిణంగా ఏర్పడతాయి. ఆ తర్వాత ఏర్పడే సన్‌స్పాట్స్ సూర్యమధ్య రేఖకు దగ్గరగా వస్తాయి. వలయం పూర్తయేనాటికి సూర్యమధ్య రేఖ చుట్టూ కొన్ని సన్‌స్పాట్స్ మిగిలిపోతాయి.

ఇవి జంటలు జంటలుగా ఉత్పత్తి అవుతాయి. కాలక్రమేణా విడిపోతాయి. ప్రతి సన్‌స్పాట్‌కు శక్తివంతమైన అయస్కాంత క్షేత్రం ఉంటుంది. సన్‌స్పాట్ జతలో ఒక ధనధ్రువమైతే రెండోది రుణధ్రువం అవుతుంది. సన్‌స్పాట్స్ అత్యధికంగా ఉన్న సమయంలో సూర్యుడు అత్యంత శక్తివంతంగా ఉండడం విశేషం. ఈ సమయంలో తీసిన సూర్యుడి ఛాయాచిత్రాలు ఎంతో ప్రత్యేకత కలిగి ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సౌర వలయంలో ఒక నెలలో సగటున 30 నుంచి 200కు పైగా ఇవి ఏర్పడతాయి. కొన్ని సందర్భాలలో అసలు ఏర్పడవని థామస్‌షార్ట్ పరిశోధనలు చెబుతున్నాయి.

కాలానుక్రమంగా ఏర్పడే సన్‌స్పాట్ల సంఖ్యకు గ్రాఫ్ (ఫ్రీక్వెన్సీ కర్వ్ -తరచుదనపు వలయం) గీసి, భూవాతావరణానికి సంబంధించిన ఎన్నో రహస్యాలను థామస్‌షార్ట్ కనుగొనట్లు ఆయన పరిశోధన పత్రాలు వెల్లడిస్తున్నాయి. ఈ రహస్యాలను కనుగొనేందుకు ఆయన మూడు విషయాల మీద ఆధారపడ్డారు. వాటిలో మొదటిది ప్రస్తుతం సౌరవలయం ఏ దశలో నడుస్తున్నది. రెండోది ఒక యాంప్లిట్యూడ్ కొలత లేదా రెండు పక్కపక్క యాంప్లిట్యూడ్ల సరాసరి కొలత. గ్రాఫ్‌లో వలయం పైకిలేచిన లేదా కిందికి దిగిన అతి హెచ్చు కొలతనే యాంప్లిట్యూడ్ అంటారు. శాస్త్ర పరిభాషలో కంపన విస్తృతి. మూడోది ప్రస్తుతం చిన్న చిన్న యాంప్లిట్యూడ్స్ ఏర్పడుతున్నాయా లేదా పెద్దవా అనే అంశాలపై ఆధారపడ్డారు. పెద్ద యాంప్లిట్యూడ్స్ తరుణంలో సన్‌స్పాట్స్ అతి తక్కువ సంఖ్యలో ఏర్పడే కాలానికి సరిగ్గా రెండు సంవత్సరాల ముందు కూడా పిడుగులతో కూడిన అధిక వర్షాలు పడతాయని ఆయన వివరించారు. కొన్ని సంవత్సరాల పాటు సన్‌స్పాట్లను సరిగ్గా లెక్కిస్తూ వాటికి ఒక గ్రాఫ్‌ను గీసినట్లయితే, ఆ వలయం ఏ విధంగా ప్రయాణిస్తోందనేదాన్ని బట్టి తర్వాతి సంవత్సరాల వాతావరణాన్ని అంచనా వేయడం కష్టం కాదు. సౌరమండలంలోని వివిధ ప్రాంతాలలోని సన్‌స్పాట్ల సంఖ్యను సరిగా గుర్తించడం ద్వారా భూమి మీద ఏ ప్రాంతపు వాతావరణం ఎలా ఉండబోతుందో గ్రహించే వీలుంటుంది. ఈ పరిశోధనను ఆధునిక శాస్త్రవేత్తలు పరిపూర్ణంగా అంగీకరించారు.

## గోళ్ళు రంగు మారాయా..!

నెయిల్ పాలిష్‌లు, రిమూవర్లు ఎక్కువగా వాడుతున్నారా? అయితే మీ గోళ్ళ రంగు మారిపోయే ఉంటుంది. రంగే కాదు కళావిహీనంగానూ తయారై ఉంటాయి. చాలామంది గోళ్ళ మాదిరిగానే మీ గోళ్ళూ పసుపు రంగులోకి మారి ఉంటాయి. ఇవి చూడడానికి ఇబ్బందిగా ఉండడమే కాదు ఆరోగ్యపరంగానూ మంచిది కాదు. ఈ సమస్య నుంచి బయటపడేందుకూ కొన్ని గృహ చిట్కాలూ ఉన్నాయి.



- **బేకింగ్ సోడా** : రెండు చెంచాల బేకింగ్ సోడాలో మూడు లేదా నాలుగు టీ స్పూన్‌ల నీళ్ళు కలిపి ఈ పేస్ట్‌ని గోళ్ళకి పట్టించండి. కొన్ని నిముషాలు అలాగే ఉంచి తర్వాత చల్లని నీళ్ళతో కడిగేయండి. వారానికి ఒకసారి ఇలా చేస్తే చాలు.
- **టీ ట్రీ ఆయిల్** : కొద్దిగా ఆలివ్ ఆయిల్‌లో కొంచెం టీ ట్రీ ఆయిల్ వేసి ఈ మిశ్రమాన్ని గోళ్ళకు రాసి పావుగంట ఉంచండి. తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. ఈ చిట్కానూ వారానికి ఒకసారి ఉపయోగించుకోవచ్చు.
- **యాపిల్ సిడర్ వెనిగర్** : ఒక గిన్నె గోరువెచ్చని నీళ్ళల్లో అర టీ స్పూన్ యాపిల్ సిడర్ వెనిగర్ వేసి ఈ గోళ్ళని అందులో ఉంచండి. ఐదు, పది నిముషాలు తర్వాత తీసేయండి. వారానికోసారి ఇలా చేయవచ్చు.
- **హైడ్రోజన్ పెరాక్సైడ్** : పెద్ద గిన్నె గోరువెచ్చని నీళ్ళు తీసుకుని అందులో ఒక టేబుల్ స్పూన్ హైడ్రోజన్ పెరాక్సైడ్ వేయండి. ఇందులో మూడు, నాలుగు నిముషాలు మీ గోళ్ళను నానబెట్టండి. తర్వాత మరోసారి గోరువెచ్చని నీళ్ళతో గోళ్ళని కడిగేయండి. పసుపు రంగు పోయేవరకూ వారానికి ఒకసారి ఇలా చేస్తూ ఉండండి.
- **ఆరంజ్ జ్యూస్** : తాజా కమలాపండు రసం తీసుకుని అందులో దూది ముంచి దాంతో గోళ్ళమీద రుద్దండి. నాలుగైదు నిముషాలు అలాగే ఉంచి తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారంలో రెండు, మూడుసార్లు ఈ చిట్కాని ఉపయోగించుకోవచ్చు.
- **టూత్‌పేస్ట్** : కొంచెం టూత్‌పేస్ట్ తీసుకుని గోళ్ళన్నింటికీ రాయండి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. శుభ్రమైన, అందమైన గోళ్ళు కావాలంటే వారంలో రెండు, మూడుసార్లు ఇలా చేసి చూడండి.

## ముఖంపై మచ్చలు ఇబ్బంది పెడుతున్నాయా ?



కొందరు స్త్రీలకు ముఖంపై చారికల్లాంటి మచ్చలు ఇబ్బంది పెడతాయి. వీటిని నివారించడానికి ఈ కింది చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

- ముఖాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా కడుక్కోవాలి.
- ఎక్కువగా నీరు తాగడంవల్ల ముఖం తాజాగా తయారయ్యి మచ్చలు పోతాయి.
- కొంచెం ఉల్లి రసంలో చెంచా తేనె కలిపి ముఖానికి రాసుకుంటే ముఖంపై మచ్చలు నివారించవచ్చు.
- మచ్చలపై నిమ్మతొక్కలతో మసాజ్ చేసుకోవాలి.
- వారానికి రెండు సార్లు బాదం పప్పును నీటిలో నానబెట్టి నానిన తరువాత దంచి ఒక చెంచా నిమ్మరసంలో కలిపి మెత్తగా పేస్ట్ లా చేసుకుని ముఖానికి పట్టిస్తే గుణం కనబడుతుంది.
- కొంచెం ఉల్లి రసంలో దూదిని ముంచి నల్ల మచ్చలు ఉన్నచోట రాసుకుంటే ఫలితం ఉంటుంది.
- అరకప్పు టమోటో రసంలో అరకప్పు మజ్జిగను మిక్స్ చేసి మచ్చల మీద రాస్తే అవి పోతాయి.



# అతడు-ఆమె 50

**డాక్టర్ వుప్పల లక్ష్మణరావు**

**జరిగిన కథ**

అంటే ఇంకా కొంత పిచ్చి వుండి పోయిందన్న మాట! ఈ ఎండాకాలానికి ఉత్తరదేశం తీసుకెళ్ళి మసూరీ, సిమ్లా వెళ్ళి అక్కడవుంటే, అక్కడ సరదాలు, చూసే సరికియిది కుదిరిపోతుంది. శాంతం మళ్ళీ నలుగురిలో పడాలి.

నాలుగునెలలా? - ఇంకా ఐదునెలలు గడవాలి? ఎలా గడుస్తాయో? ఈ జీవితం చిత్రం యేమిటో కదా? నా మనస్సులో వున్న ఆలోచనలని నేనే పోల్చలే కుండా వున్నాను. నా హృదయాన్ని నేనే విప్పి చదువుకోలేకుండా వున్నాను. నా దేహంలో యే బ్రహ్మాండమయిన మార్పులు జరుగుతున్నాయో నాకే తెలియడంలేదు...నాకు స్వేచ్ఛా స్వాతంత్ర్యం వ్యక్తిత్వం వుందా-లేకపోతే- అరిషడ్వర్గాల చేతుల్లో కీలుబొమ్మలాగు-ఈ సంసారం అనే తుపానులో గాలి గుడ్డులా- కొట్టుకు పోతూండ డమేనా? పులుసూ కారంతింటూ- అచ్చంగా భూమిమీద రెండు కాళ్ళ తోనూ నిర్మొహమాటంగా - నిలబడ దానికా - ధైర్యం లేదు!

(నిన్నటి సంచిక తరువాయి)

నిష్కామంగా "నా" అన్న తాపత్రయం లేకుండా ఆధ్యాత్మికంగా పరలోక ధ్యాన్నం మీదే వుందామా - ఆ ఆకాశం అందదయ్యో! ఇప్పుడు నే నిలా ఎందుకుండాలి? ఈ స్థితి - నా దేహస్థితి ఐచ్ఛికమా - ప్రమాదమా? ఎట్లా సంభవించింది? జాగ్రదావస్థా - సఘుప్తావస్థా? ప్రేమో? ప్రణయంవా? కామంవా?...లేకపోతే అలవాటా?.... యీ మాటు వెనకటి మాటులా లేదు నా మనస్సు. అప్పుడా - డాక్టరు చెప్పగానే మనస్సంతా, ఆనందంతో నిండి పోయింది. కాళ్ళకి రెక్కలొచ్చాయా అని అనిపించింది. గాలిలో నడిచినట్టే - ఆకాశంమీద నుంచి అలా మేఘాలతో కలిసి యీదుకుని వెళ్ళిపోతున్నట్టే వుండేది. శాస్త్రిని చూసి నప్పుడల్లా - గుండెల్లో - మనసులో - చెవుల్లో - సంగీతమయం! కళ్ళంట నీళ్ళొచ్చేవి. ఆ కారణంగా ఓ పెద్ద కెరటంలాగు దుఃఖం వచ్చేది. అతన్ని కౌగలించేసుకుని - అతని దేహంలో అమాంతంగా మాయం అయిపోదామా అనిపించేది. నలుగురిలో తిరగడానికి సిగ్గు మొహమాటంగా వుండేది - మళ్ళీ రెండో నిమిషానికి - ఎంతో గర్వంగాను వుండేది...ఇప్పుడల్లా లేదేం? శాస్త్రి అంటే ప్రేమపోలేదే? అయితే - ఆ ఉధృతం తగ్గిందేమో అనిపిస్తూంది... "ఉధృతం" అని కలం వెళ్ళిందేమిటి? ప్రేమకూడా కొన్ని సందర్భాల్లో ఉన్మాదం - రోగమేనా ఏమిటి చెప్మా? అబ్బే - జీవకోటిలో ప్రతీ వ్యక్తీ అనుభవించే లీలని రోగం అని ఎట్లా అనడం? శాస్త్రీ అంటే ప్రేమ - ఆపేక్ష - అనురాగం - చనువు - అలాగే వున్నాయి. కాని...ఏదో అడ్డు తగులుతూంది. ఏమిటది? యీ ఏడేళ్ళ సంసారంలో అనేక ఘటనలు సంభవించాయి. అనేక అనుభవాలు అనేక కొత్తభావాలు అనేక రభసలు ఎదుర్కొన్నాం. "మనిద్దరిదీ ఒకటే మనస్సు దేహం" అని అనుకున్నా - హావభావాలు వేరుగానే వున్నాయి. దృక్పథాలు వేరేగా వున్నాయి... గోరంతల్ని కొండంతలు చేస్తున్నానా యేమిటి? వ్యక్తులు ఇద్దరైం తరువాత యే భేదాలు లేకుండా ఎలా ఉంటారు? కవలపిల్లలో సహా వాళ్ళ మనస్సు వీళ్ళది కాదు, వీళ్ళ మనసు వాళ్ళది కాదు. గంగా-యమునా కలిసిపోయినా, గంగనీళ్ళు గంగవే యమున నీళ్ళు యమునవే! అయినా, ఆమాత్రం వడుదుడుకులు లేకుండా సంసారం ఏమిటి? - అబ్బే! యీ కలవరంలోంచి నేను బయటికి వచ్చేయాలి. మా ఇద్దరి మధ్యనీ మరొకరు రానంతసేపు - యీ భేదాలున్నా ఫరవాలేదు. అలాంటిదెప్పుడూ జరగదు కూడానూ....మనం అనుకున్నట్టు - మళ్ళీ ప్రయత్నం లేందే - ఎల్లా జరుగుతాయో? అనేక సార్లు అనుకునేదాన్ని - పాపాయి ఒక్కర్తే అయిపోతూంది - దానితో ఆడుకోడానికి పూసుకోవడానికి దానికి మరో చిన్న తమ్ముడో - చిట్టి చెల్లాయో వుంటే బాగుండును - అని! సరిగ్గా అల్లాగే అయింది! ఈ మాటు అచ్చంగా మా మామగారి పేరో - అత్తగారి పేరే పెడితే తీరిపోతుంది.



శాస్త్రి సంతోషిస్తాడు. వాళ్ళ వాళ్ళకి నామీద కోపం కాస్త తగ్గుతుంది. ఏమిటో పేర్లలో ఏముంది? అలాగని వెంకయ్య, పుల్లంబొట్లు, సుబ్బి, సత్తి అని ఎట్లా పెట్టను? అయితే ఏం? తత్వమ తత్వవాన్యాయిగా, కాళిదాసు వాజ్మయాన్ని మర్చిపోయినా, బొంబాయి ఫిలిమ్ముల్ని వాళ్ళ తారల్ని మనం చేస్తున్నాం! బంకించంద్రుడూ, పాంచకడీ మన ఆంధ్రదేశంలో విలసిల్లినంతకాలం - నా పిల్లలకి మల్లమ్మనీ, రుద్రమ్మనీ ఎట్లా పేర్లు పెట్టను? రవీంద్రనాథ రాగోరు, విద్యాసాగరూ అని పేర్లు పెట్టడం - ఆ కుర్రాళ్ళ నాలుగో ఫారంలోనే దండయాత్రలు కొడుతూండడం - తిలక్కు, గాంధీ అని మనం పెట్టడం - వాళ్ళు యింతా యే గవర్నమెంటు అబ్కారీ డిపార్టుమెంటులోనో, యే సి.ఐ.డి.లోనో చేరటం - ఏం అందంగా ఉంటుంది! మనం పరిమళ అని పెట్టడం అది పెద్దదయాక జిడ్డోడుతూ తయారవడం - ఎంత పౌడరు పూసుకున్నా ఎంత సబ్బుతో తోముకున్నా! తల్లిదండ్రులు వాళ్ళ దేశభక్తికి ఆంధ్రత్వం, వాళ్ళ భావకవిత్వం వాళ్ళ పిల్లల పేర్లలో చూపించడం - తోటిపిల్లలు ఉడికిస్తూంటే వీళ్ళు ఏడవలేక చావడం, మా నాన్నా అమ్మా యీ పేర్లు మా కెందుకు పెట్టారురా బాబూ - యే పుల్లయ్యో, సింగయ్యో, యే సీతో, వెంకో అని నలుగురిలాగా పెడితే తీరిపోయేది - అని యావజ్జీవం వాళ్ళు ఏడ్వటం - ఎందుకొచ్చింది? నేను మామూలు పేర్లే పెడతాను. ఆ తరువాత వాళ్ళు దేశభక్తులూ, పండితులూ అవుతే వాళ్ళు పేర్లు వాళ్ళే మార్చుకుంటారు. వాళ్ళకి నచ్చినట్టూను... శాస్త్రితో చెప్పా - విని పొంగిపోయాడు! "ఈ మాటు కొడుకు పుడితే బాగుండును శాంతం!" అన్నాడు. ఏమిటో కొడుకైతేనేం కూతురైతేనేం? కొడుకే కావాలని కోరికేమిటో? "నీకేం కావాలో కోరుకో!" అన్నాడు. "ఏం ఘనకార్యం చేశామని కోరమన్నావు- వరాన్ని?" అన్నా. "నీలాంటి ఆంధ్ర నారీరత్నమో - నాలాంటి తెలుగు దొరో రేపు అవతరించబోతూంటే" - "బొమ్మూరు మెట్ట మొండి సారంగధరుడా, కొండవీటి కొండదొరా - లేకపోతే నెల్లూరు నెరజాణా - పల్నాటి వీరాంగనా?" అన్నా నేను నవ్వుతూ. "నీ కన్నీ వేళాకోళాలే! శ్రీకృష్ణ దేవరాయలో - మల్లమ్మదేవో అనకూడదూ!" అంటూ ఫోనుచేసి సూరజ్ మహల్‌కి ప్లాటినం బ్రూచి - వుమ్మిడి వారినుంచి రిస్టువాచీ - కన్నిమేరానుంచి కేక్సు, రామకృష్ణా నుంచి బాదంఖీరు తెప్పించి హడావుడి చేసేశాడు! శాస్త్రి కింకా కుర్రతనం పోలేదు!....

**64 అతడు**

ఈవేళ కొండందుకున్నట్టుంది - యీ శుభవార్త విన్నాక. ఈ మూడు నాలుగు నెలలూ ఈ వాదనలు ఈ చికాకు యిప్పుడు బోధపడింది. పాపం, శాంతం మాత్రం ఏం చేస్తుంది - వొంట్లో బాగుండకపోతే! ఆవేళ నిజంగా నాకు యెంతేనా కోపం - నిరుత్సాహం- అనకూడదుగాని చివరికి అసహ్యంకూడా వచ్చేసింది శాంతంమీద. నన్ను అర్థంచేసుకోకుండా నా తెలివితేటలు పోల్చుకోకుండా, లౌక్యం తెలుసుకోకుండా ఏవో నాలుగు ముక్కలు కొత్తపోకడలు పట్టుకుని ఆ దాణీని అడ్డుపరీక్ష చేశానని నన్ను అమాంతంగా తిట్టిపారేయడమా - ఆ లేడీ అయ్యంగారు ఎంతో మెచ్చుకోడమా - ఏమిటీ అన్యాయం అనిపించింది. రహస్యం తెలిసేక యిప్పుడు బోధపడింది. ఆ రోజుల్లో మనిషిని పూర్తిగా అల్లాడించేసి - తల్లకిందులుచేసి పారేస్తుంది కాంసు? స్త్రీ జాతి అంతా యీ యాతన పడవలసిందేగా? అందులోకి సున్నితమైన మనస్సు, నాజూకు చిత్తప్రవృత్తిగల స్త్రీయేగనక ఐతే మరీ గాభరా పడిపోతుంది! అందుకోసమే పురుడు పోసుకోవడం అంటే మృత్యువు నోటిలోంచి బైటపడి మళ్ళీ జన్మయెత్తడమే అంటారు మనవాళ్ళు. ఈ రెండుమూడు రోజులాయి శాంతం చాలా ప్రశాంతంగా వుంది. ఈ మధ్య మనస్పర్థలూ, గొడవ లయాక పాత శాంతయే అయిపోయింది. వచ్చే యీ అయిదారు నెలలోనూ, నూతన సృష్టితో యీ నిన్నా మొన్నా తెచ్చి పెట్టుకున్న తమాషా భావాలన్నీ మర్చిపోతుంది తప్పకుండానూ. అసలు ఆవేళ అఖద్దరు కట్టుకోవడంతో మొదలు. అదికూడా మర్చిపోతే...అసలే తెలుగు - అరవపోటీ - అందులోకి బ్రాహ్మణ - బ్రాహ్మణేతరం ఒకటి - దుర్భిక్షంలో అధిక మాసంలాగ. అదిగో వీడి పెళ్ళాం ఖద్దరు కడుతుంది అని - ఇదో రాయి వెయ్యగానే ఆ అడ్వకేట్ జనరలుగిరీకున్న అవకాశాలు రోంతా ఎగిరిపోయి పూరుకుంటాయి. శాంతానికి అసలు ప్రపంచం ఏం తెలుసు? ఎం.ఏ. అంటే ప్యాసయి ఆ పరదా కాలేజీలో నాల్గేళ్ళు పనిచేస్తే మాత్రం ప్రపంచం ఎట్లా తెలుస్తుందీ - నాలుగు దక్కాముక్కీలు తినాలి - కాస్త సాఫీతేరాలి కాని! బొత్తిగా సత్యకాలం అవుతే ఎట్లా...యీ మాటు బాచిగాడు పుడితే...ఏమిటి మన యిష్టం యేమిటి! ఎల్లాగేనా ఆడపిల్ల అంటే తల్లిదగ్గరే చనుం - తండ్రికేం అధికారం వుండదు. మగపిల్లాడనగానే తండ్రిదే పై చెయ్యి అవుతుంది - అవాలికూడా. మగపిల్లలకి తర్ఫీదు చెయ్యడం యెంత చదువుకున్న ఆడవాళ్ళకేనా తెలీదు. ఆ ప్రపంచకమే వేరు - ఆ సరదాలు - ఆ భావాలు - ఆ కోరికలూ - ఆ వాంఛలూనూ. ఏదైనా ప్రయోజకుడై వో యింటివాడై కుటుంబ సాంప్రదాయం నిలబెడుతూ డబ్బు సంపాదించి వో హోదా - వోతాహతూ - పెళ్ళాం పిల్లలూ - "నా" అని నిలబెట్టేవాడు మొగాడేగా - ఎన్నికబుర్లు చెప్పినా బాచిగాడికి ఓనమాలదగ్గిర నుంచి నేనే స్వయంగా చదువు చెప్తా.

- ఇంకా వుంది.

# పరీక్షల్లో రాయాలంటే గుర్తురావడం లేదా ?

కొందరు విద్యార్థులు ఎంత బాగా చదివినా పరీక్షల్లో యావరేజ్ మార్కులే వస్తుంటాయి. సిలబస్ అంతా చదివినా రాసేటప్పుడు సరిగా జ్ఞాపకం రాకపోవడం ఇందుకు ప్రధాన కారణం. చాలా మంది విద్యార్థుల్లో ఇప్పుడు ఇదే కనిపిస్తోంది. తల్లిదండ్రులు కూడా పిల్లల సమస్య తెలుసుకొని పరిష్కరించుకోవడం ఒక్కటికి గురి చేస్తున్నారు. చదివింది గుర్తుపెట్టుకోవడం ఒక పని. మెదడుతో చేసే పని. ఒక రకమైన శరీరాన్ని కలిగి ఉన్నప్పటికీ మనం ఒక జిమ్నాస్ట్ లేదా క్రీడాకారుడిగా చేయలేం. ఎందుకంటే వాళ్లు తమ శరీరానికి కావాల్సినంత శిక్షణ ఇస్తారు. అద్భుతాలు చేస్తారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందినవారంతా ప్రత్యేక శక్తులతో పుట్టరు. శిక్షణతోనే తమ సామర్థ్యాన్ని అసాధారణంగా ప్రదర్శిస్తారు. ఒక కొత్త టాపిక్‌ను అర్థం చేసుకొని, గుర్తుంచుకొని తర్వాత ఎప్పుడైనా సొంతమాటల్లో తిరిగి రాయగలిగితే ఆ విషయంపై ఏ ప్రశ్నలు అడిగినా మనం తేలిగ్గా సమాధానం ఇవ్వగలం. అప్పుడు మరచిపోవడం అనే సమస్య ఉండదు. అదే చదువులో మనం ఉపయోగించాల్సిన కిటుకు. అసలు సమస్య నేర్చుకునే పద్ధతితోనే మొదలవుతుంది. గైడ్లలోని ప్రశ్నలు-జవాబులను చదివి వాటిని యథాతథంగా పరీక్షలో రాయాలనుకుంటేనే మరచిపోవడం అనే ఇబ్బంది ఎదురవుతుంది. అర్థం చేసుకొని సొంతవాక్యాల్లో రాయాలనుకుంటే ఆ సమస్య తలెత్తదు.



**లాజిక్ ఏది?**

ఓ విద్యార్థిని జవాబు పత్రాన్ని పరిశీలించిన ఆమె తండ్రి.. మార్కులు వేయడంలో మాస్టారు వివక్ష చూపాడని గొడవ పడటానికి వచ్చాడు. స్కూల్లో ఆ ప్రశ్నకు ఇచ్చిన జవాబును యథాతథంగా తన కూతురు రాసిందని, అయినా మార్కులు తక్కువ వేశారని ఆయన వాదన. అడిగిన ప్రశ్నలో ఉన్న చిన్న మెలికను అర్థం చేసుకోకుండా జవాబు రాసిందని, అందుకే తక్కువ మార్కులు వచ్చాయని సర్దిచెప్పేసరికి మాస్టారు తల ప్రాణం తోకకి వచ్చింది. అసలు ప్రశ్న ఏమిటి? దానికి మనం రాస్తున్న సమాధానం సరైనదేనా? అనే లాజిక్‌ను విద్యార్థులు విస్మరిస్తున్నారు. బట్టీ పెట్టడంపైనే దృష్టి పెట్టడంతో సొంతమాటల్లో జవాబు రాసే ప్రయత్నం చేయడం లేదు.

ఈ పరిస్థితి గురించి ఆలోచించే మనం జ్ఞాపకశక్తి ఏ విధంగా పనిచేస్తుందో చూద్దాం. ఒక విషయం మనకు గుర్తుండాలంటే మూడు నియమాలున్నాయి.

- ఆ విషయం మనకు అర్థం కావాలి. దాని పూర్వాపరాలు మనసులో ఏర్పడాలి. రాజు గుర్రం మీద అడవికి వెళ్లాడు అనే వాక్యాన్ని మనం ఊహించుకోగలం. కానీ ఎక్స్ వై మీద ప్రయాణిస్తూ జెడ్‌కి వెళ్లాడు అంటే కళ్ల ముందు కదలదు. మొదటి వాక్యం తేలిగ్గా గుర్తుంటుంది. రెండోది కష్టం.
- శబ్దానికి, రూపానికి సంబంధించింది స్పష్టత ఉండాలి. అర్థమైనా కాకపోయినా సినిమా పాటలూ, ప్రార్థనా శ్లోకాలూ చాలామందికి గుర్తుంటాయి. కారణం వాటి శబ్దం స్పష్టంగా ఉండటమే. అలాగే సినిమా డాన్స్‌లు సులభంగా వేసేస్తారు. శాస్త్రీయ నృత్యాలు గుర్తుండవు. కారణం సినిమా స్టెప్స్ విడివిడిగా స్పష్టంగా ఉంటాయి. భరతనాట్యం లాంటి శాస్త్రీయ నృత్యాల్లో స్టెప్స్ కలిసిపోయి, సంక్లిష్టంగా ఉంటాయి.
- మనకు చదివే అంశం మీద ఆసక్తి ఉండాలి. అది ఉంటే అర్థం చేసుకోవడం, స్పష్టత ఏర్పరచుకోవడం సాధ్యమవుతాయి. ఆసక్తి వల్ల ఆయా శబ్దాలు, దృశ్యాలు మెదడులో బలంగా ముద్రితమవుతాయి.

**అంకెలూ, పేర్లు, ఫార్ములాలు...**

సాధారణ విద్యార్థులకు ఎదురయ్యే మరో ప్రధాన సమస్య జవాబుల్లో భాగంగా వచ్చే అంకెలూ, పేర్లు, ఫార్ములాలూ గుర్తుండకపోవడం. చిన్న అలవాటుతో ఆ సమస్యను అధిగమించవచ్చు. ఒక చిత్తు పుస్తకం, నలుపు లేదా ఎరుపు స్కెచ్ పెన్ను తీసుకోవాలి. మనం చదివే జవాబులో గుర్తుంచుకోవాల్సిన సంఖ్య, దానికి సంబంధించిన పేరు లేదా పదాన్ని రాసుకోవాలి. '1757లో జరిగిన ప్లాసీ యుద్ధం భారతదేశంలో బ్రిటిష్ ప్రత్యక్ష రాజ్యాధికారానికి నాంది పలికింది' అనే వాక్యంలో 1757, ప్లాసీ యుద్ధం అనే మాటలు ముఖ్యమైనవి. చిత్తు పుస్తకంలో పెద్దపెద్ద అక్షరాలతో ఈ రెండు పదాలనే రాసుకోవాలి. దానిపైకి చూస్తూ పదిసార్లు పైకి ఉచ్చరించాలి. మళ్లీ స్కెచ్‌తోనే రాయాలి. ఇలా ఒకటికి రెండుసార్లు చేస్తే ఆ సంఖ్య, పేరు మీకు తప్పకుండా గుర్తుంటాయి. ఇదే పద్ధతిలో సైన్సులో శాస్త్రీయ నామాలు, ఫార్ములాలు గుర్తుంచుకోవచ్చు.

**ఏకాగ్రత తప్పనిసరి**

ఏకాగ్రత అంటే చేసే పని మీద మనసు లగ్నం కావడం. చదివేటప్పుడు వేరే ఆలోచనలు మనసులోకి వస్తుంటే చదివింది గుర్తుండదు. అంతరాయాల ప్రభావాన్ని తగ్గించడానికి ఈ కింది విధానాలు పాటించవచ్చు.

**ఏకాంతాన్ని ప్రకటించడం :** 'ఈ గంట సమయం నన్ను పలకరించ వద్దు. నేను చదువుకుంటున్నాను' అని ప్రకటించాలి.

**ఫోన్లు, టీవీలు వద్దు :** సెల్‌ఫోన్లు, టీవీలు స్విచ్ఛాఫ్ చేయాలి.

**కాపలా పెట్టుకోవాలి :** ల్యాండ్‌లైన్ ఫోను వచ్చినా, కాలింగ్ బెల్ మోగినా, బయట నుంచి ఎవరైనా పిలిచినా స్పందించడానికి కుటుంబ సభ్యులను లేదా మీ స్నేహితులను కాపలా పెట్టుకోవాలి.

**బోర్డు పెట్టుకోవాలి :** మీరు ఏం చదవబోతున్నారో ప్లానర్, సమయం వివరాలు బోర్డు మీద రాసి ఎదురుగా పెట్టుకోవాలి.

**కౌంట్‌డౌన్ టైమర్ పెట్టుకోవాలి :** మీరు చదవడానికి నిర్ణయించిన సమయాన్ని గుర్తుచేయడానికి కౌంట్‌డౌన్ టైమర్ పెట్టుకోవాలి.

కచ్చితంగా అనుకున్న పని చేయాలన్న సంకల్పం ఏకాగ్రతకు మూలం. చేయాల్సిన, చేయగలిగిన పని మీద దృష్టి ఉంచడం మానేసి చేయలేకపోయిన పనులు, వృథా అయిన కాలం గురించి ఆలోచించి చెందితే ఏకాగ్రత దెబ్బతింటుంది. ధ్యానం, ప్రార్థన వల్ల ఆందోళన తగ్గి మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. దాంతో ఏకాగ్రత కుదిరి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఆందోళన, మరచిపోతామనే భయం, త్వరగా ముగించేయాలనే కంగారు జ్ఞాపకశక్తికి ప్రతికూలాంశాలు.

**ఎలా చదివితే గుర్తుంటుంది**

| | |
|---|---|
| నిశ్శబ్దంగా | - 10 శాతం |
| వినడం | - 20 శాతం |
| బొమ్మలు, కథలు, ఫార్ములాలు, సూత్రాలు తదితరాలు చూడటం | - 30 శాతం |
| బయటకు చదివితే | - 50 శాతం |
| ఇతరులతో చర్చిస్తే | - 70 శాతం |
| చేసి చూస్తే, అనుభూతి చెందితే | - 80 శాతం |
| -ఇతరులకు నేర్పితే | - 90 శాతం గుర్తుంటాయి. |

**పెద్ద జవాబును ముక్కలు చేయండి**

పేజీలకు పేజీలు ఉండే పెద్ద జవాబులను గుర్తుంచుకోవడం కష్టమే. అయితే దానికి సాధారణ కారణం ప్రతికూల దృక్పథమే. దీన్ని అధిగమించడానికి పెద్ద జవాబులను సాధ్యమైనన్ని చిన్న పేరాలుగా విడగొట్టుకోవాలి. ఒక్కో పేరా మీద దృష్టి పెట్టి అంతవరకే చదవాలి. అవసరమనుకుంటే ఒక్కో పేరాను విడిగా చిత్తు పుస్తకంలో రాసుకోవాలి. అది వచ్చిన తర్వాత దాని కింద మిగతా పేరాలు వరుసగా రాసుకొని చదవాలి.

**బిట్లు మరచిపోతున్నారా?**

ప్రతి పరీక్షలో బిట్లు లేదా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు తప్పకుండా ఉంటాయి. అయితే బిట్లను గుర్తుంచుకోవడం అంత తేలిక కాదు. గుర్తున్నట్లే అనిపించినా అవసరమైన సమయంలో జ్ఞాపకం రాకపోవడం వీటి ప్రత్యేకత. అందుకే బిట్ పేపర్ అంటే అదృష్టం అనే అభిప్రాయం కొంతమంది విద్యార్థుల్లో ఏర్పడింది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల్లో నాలుగు జవాబులు ఇచ్చి అక్కడే ఉన్న సరైన సమాధానం గుర్తురాకపోతే చాలా చికాకుగా ఉంటుంది. దీనివల్ల పరీక్షలో విజయావకాశాలకు నష్టం జరుగుతుంది. బిట్లు స్పష్టంగా గుర్తుంచుకోవడానికి కథ పద్ధతి, సమాహార పద్ధతి అని ఉన్నాయి. కథ పద్ధతిలో ఆ బిట్టుకు సంబంధించిన పూర్వాపరాలను కలిపి ఒక కథ తయారు చేసుకుంటారు. మొత్తం కథను గుర్తుంచుకొని దాన్ని బిట్టుగా మార్చుకొని జవాబులు ఇవ్వవచ్చును.

ఉదాహరణకు 'ప్లాసీ యుద్ధం జరిగిన సంవత్సరం 1757' అనేది ఒక బిట్టు. దీనికి కథాపద్ధతి అనువర్తిస్తే... '1757లో జరిగిన ప్లాసీ యుద్ధంలో రాబర్ట్ క్లైవ్ నాయకత్వంలోని బ్రిటిష్ సైన్యాలు, బెంగాలు నవాబు సిరాజుద్దౌలాను ఓడించాయి. అప్పటి నుంచి బెంగాలులో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యాధికారాన్ని ఆంగ్లేయులు, బెంగాలు నవాబుతో కలిసి పంచుకోవడం ప్రారంభమైంది.' ఇది ఈ బిట్టుకు సంబంధించిన చిన్న కథ. దీనిలో ఆ యుద్ధానికి సంబంధించిన ఇతర ముఖ్యమైన బిట్లకు జవాబులు కూడా ఉన్నాయి. ఈ కథను బట్టీ పట్టకూడదు. మనకు కావాల్సిన పేర్లను, సంవత్సరాలను పైకి ఉచ్చరిస్తూ ఒకటికి రెండుసార్లు ఎవరికైనా చెప్పాలి. సొంతమాటలతో చెబితే ఇంకా మంచిది. అప్పుడు బిట్లన్నీ గుర్తుంటాయి. సమాహార పద్ధతిలో ప్లాసీ యుద్ధం, బక్సారు యుద్ధం, మొదటి మహారాష్ట్ర యుద్ధం, రెండో మహారాష్ట్ర యుద్ధం, మొదటి మైసూరు యుద్ధం ఇలా బ్రిటిష్‌వారు తమ రాజ్యవిస్తరణ కోసం భారతదేశంలో చేసిన యుద్ధాలకు సంబంధించిన సంవత్సరం, జరిగిన ప్రదేశం, భారతీయ రాజు, బ్రిటిష్ గవర్నర్ జనరల్, ఫలితం తదితరాలను ఒకచోట కాలక్రమంలో రాసుకోవాలి. ఒకదానితో ఒకటి పోల్చుకుంటూ వాటిలోని భేదాలను, కామన్ పాయింట్లను మననం చేసుకోవాలి. ఇలాంటి సాధన వల్ల ఒకే రకమైన బిట్ల మధ్య తలెత్తే గందరగోళం లేకుండా గుర్తుంచుకోవచ్చు.

**ముచ్చటగా మూడు అలవాట్లు**

గుర్తుంచుకోవడానికి సంబంధించిన ప్రాథమిక అవసరాలను తెలుసుకుంటే, వాటిని చదువులో ఎలా ఉపయోగించాలో తెలుస్తుంది. అందుకు విద్యార్థులు మూడు అలవాట్లను నేర్చుకోవాలి.

**ప్రశ్న, జవాబు రెండూ చదవాలి**

ప్రశ్న ఒకసారి చదివి జవాబు పదిసార్లు చదవడం సాధారణంగా విద్యార్థులు చేసే పొరపాటు. జవాబు చదివే ప్రతిసారీ ప్రశ్న కూడా చదవడం వల్ల ఈ రెండింటికీ మధ్య ఉన్న సంబంధం మనసులో స్థిరపడుతుంది.

**అంతరాయం లేకుండా..**

ఒకసారి ప్రశ్న-జవాబు చదవడం ప్రారంభిస్తే మొదటి అక్షరం నుంచి చివరి అక్షరం వరకూ ఆపకూడదు. తలెత్తకుండా చదవాలి. సగంలో దిక్కులు చూడకూడదు. పక్కవారితో మాట్లాడకూడదు. అత్యవసరంగా అలా చేయాల్సి వస్తే ప్రశ్నను మళ్లీ మొదటి నుంచి చదవాలి.

**ప్రతి పదమూ, అక్షరమూ పైకి చదవాలి**

కొత్త ప్రశ్నలను సగం వచ్చిన తర్వాత సగం చూసి, సగం కళ్లు మూసుకొని చదవడం, కొన్ని పదాలనూ, అక్షరాలను పైకి పలకకుండా మింగేయడం చాలామంది విద్యార్థులకు అలవాటు. దీన్ని మానుకోవాలి. చదివేటప్పుడు చూసే చదవాలి. అప్పజెప్పేటప్పుడు పూర్తిగా చూడకుండా చెప్పాలి. అన్ని పదాలూ సరిగ్గా ఉచ్చరించాలి.



ఈ మూడు అలవాట్లూ చేసుకుంటే ప్రశ్నలూ- జవాబులు త్వరగా నేర్చుకోవచ్చు. పరీక్ష సమయంలో జవాబు సగం రాశాక మరచిపోవడం ఉండదు.

# కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) నోటిఫికేషన్ విడుదల

దేశంలోని జాతీయస్థాయి న్యాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందడానికి నిర్వహించే ప్రవేశపరీక్ష- క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్). దీని ప్రకటన వెలువడింది. కోచిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ ఈ ఏడాది పరీక్షను నిర్వహిస్తోంది. ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రాముల్లో సీటు లభిస్తుంది. క్లాట్ ద్వారా ప్రవేశం కల్పించే సుప్రసిద్ధ విద్యాసంస్థల్లో... అత్యాధునిక కరిక్యులమ్, మౌలిక వసతులూ, అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది ఉండటం మూలంగా నాణ్యమైన బోధన లభిస్తుంది. ప్రాంగణ నియామకాలూ ఉంటాయి. అందుకే కోర్సు పూర్తిచేసేవారికి కెరియర్ పరంగా ఢోకా ఉండదు. క్లాట్- 2018 ద్వారా తెలుగు రాష్ట్రాల్లో... తెలంగాణలో నల్సార్ (హైదరాబాద్), ఆంధ్రప్రదేశ్‌లో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయవిశ్వవిద్యాలయం (విశాఖపట్నం)లో ప్రవేశాలు పొందవచ్చు.


**ఎల్ఎల్‌బీ పరీక్ష విధానం**

ఇది ఆన్‌లైన్ పరీక్ష. దీనిని 200 మార్కులకు నిర్వహిస్తారు. 200 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. ఇంగ్లిష్: 40 ప్రశ్నలు, జనరల్ నాలెడ్జ్/ కరెంట్ అఫైర్స్: 50 ప్రశ్నలు, ఎలిమెంటరీ మ్యాథ్స్: 20 ప్రశ్నలు, లీగల్ ఆప్టిట్యూడ్/ లీగల్ అవేర్‌నెస్: 50 ప్రశ్నలు, లీగల్ రీజనింగ్: 40 ప్రశ్నలు ఉంటాయి. రుణాత్మక మార్కులున్నాయి. తప్పుగా గుర్తించిన ప్రతి ప్రశ్నకు పావు మార్కు చొప్పున తగ్గిస్తారు.

**ఈ సంస్థల్లో ప్రవేశాలు**

క్లాట్ స్కోరు ఆధారంగా... 19 న్యాయశాస్త్ర విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలుంటాయి. అవి :

- నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ, బెంగళూరు (ఎన్ఎల్ఎస్ఐయూ)
- నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీ అండ్ రిసెర్చ్ యూనివర్సిటీ ఆఫ్ లా, హైదరాబాద్ (నల్సార్)
- ది నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ, భోపాల్ (ఎన్ఎల్ఐయూ)
- ది వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జురిడికల్ సైన్సెస్, కోల్‌కతా (డబ్ల్యూబీఎన్‌యూజేఎస్)
- నేషనల్ లా యూనివర్సిటీ, జోధ్‌పూర్ (ఎన్ఎల్‌యూజే)
- హిదాయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ, రాయ్‌పూర్ (హెచ్ఎన్ఎల్‌యూ)
- గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ, గాంధీనగర్ (జీఎన్ఎల్‌యూ)
- డా.రామ్ మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ, లఖ్‌నవూ (ఆర్ఎమ్ఎల్ఎన్ఎల్‌యూ)
- రాజీవ్‌గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా, పంజాబ్ (ఆర్జీఎన్‌యూఎల్)
- చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ, పట్నా (సీఎన్ఎల్‌యూ)
- ది నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్, కొచ్చి (ఎన్‌యూఏఎల్ఎస్)
- నేషనల్ లా యూనివర్సిటీ ఒడిశా, కటక్ (ఎన్ఎల్‌యూఓ)
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రిసెర్చ్ ఇన్ లా, రాంచీ (ఎన్‌యూఎస్ఆర్ఎల్)
- నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జుడిషియల్ అకాడమీ, అసోం (ఎన్ఎల్‌యూజేఏ)



- దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ, విశాఖపట్నం (డీఎస్ఎన్ఎల్‌యూ)
- తమిళనాడు నేషనల్ లా స్కూల్, తిరుచిరాపల్లి (టీఎన్ఎన్ఎల్ఎస్)
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ, ముంబయి (ఎంఎన్ఎల్‌యూ)
- నేషనల్ లా యూనివర్సిటీ, నాగ్‌పూర్ (ఎన్ఎల్‌యూ)
- నేషనల్ లా యూనివర్సిటీ, ఔరంగాబాద్ (ఎన్ఎల్‌యూ)

(ఈ 19 కాకుండా పలు ప్రైవేటు సంస్థలు క్లాట్ స్కోర్‌తో న్యాయ విద్యలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి)

**సిద్ధమవ్వండిలా...**

ఇది ప్రవేశపరీక్ష అయినప్పటికీ ఈ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఆలోచనాత్మక, వివరణాత్మక ప్రతిభ పాటవాలను అంచనావేస్తూ వారి అనువర్తన తీరును పరిశీలిస్తారు. క్లాట్‌లో అవసరమైన నైపుణ్యాల సహాయంతో గత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. జనరల్ ఇంగ్లిష్ గురించి కేవలం వ్యాకరణమే కాకుండా వాడుక, సాధన మీద పట్టు ఉండాలి. కమ్యూనికేషన్ నైపుణ్యాలను వాక్య రూపంలో ప్రదర్శించే రీతిలో ఉండాలి. జనరల్ నాలెడ్జ్/ కరెంట్ అఫైర్స్ కోసం మనోరమ ఇయర్ బుక్/ సీఎస్ఆర్ ఇయర్ బుక్/ ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలను చదవాలి. వార్తాపత్రికలు/ పీరియాడికల్స్ చదువుతూ ఉండాలి. లీగల్ నాలెడ్జ్/ అవేర్‌నెస్ కోసం యూనివర్సల్ లా బుక్స్ వారు ప్రచురించిన లెక్సిస్ నెక్సిస్/ ఈస్టర్న్ బుక్స్ వారు ప్రచురించిన పుస్తకాలు చదవాలి. ఇవి అన్ని ప్రముఖ లా పుస్తకాల దుకాణాల్లో లభిస్తాయి. న్యాయశాస్త్ర అధ్యాపకుల సలహా సంప్రదింపులు తీసుకోవడం ఉత్తమం. 200 మార్కులకు కనీసం 150 మార్కులు సాధిస్తే ఏదో ఒక న్యాయ విశ్వవిద్యాలయంలో ప్రవేశం లభించే అవకాశాలుంటాయి. క్లాట్ ద్వారా ప్రవేశం లభించే ప్రసిద్ధ విద్యాసంస్థల్లో అత్యాధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే కరిక్యులమ్ ఉంటుంది. మౌలిక వసతులూ, అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది ఉండటం మూలంగా నాణ్యమైన బోధన లభిస్తుంది. ప్రాంగణ నియామకాలూ ఉంటాయి. అందుకే కోర్సు పూర్తిచేసినవారికి కెరియర్ పరంగా ఢోకా ఉండదు. బహుళజాతి సంస్థలూ, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులూ, ప్రైవేటు ఈక్విటీ కంపెనీలూ, కన్సల్టింగ్ సంస్థలూ, అకౌంటింగ్ కంపెనీల్లో న్యాయశాస్త్ర పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, కార్పొరేట్ లా కోర్సులకూ గిరాకీ, సైబర్ లా, లీగల్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్‌లకు అవకాశాలు పెరుగుతున్నాయి.

**గమనించ తేదీ, అర్హతల వివరాలు**

- ఎల్ఎల్‌బీ 5 సంవత్సరాల కోర్సు (యూజీ), ఎల్ఎల్ఎం సంవత్సరం (పీజీ) కోర్సులకు ప్రవేశం.
- 5 సంవత్సరాల కోర్సుల్లో చేరే విద్యార్థులు 10+2 లేదా సమాన పరీక్షను 45% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ విద్యార్థులు 40% మార్కులతో పాస్ అయి ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు కూడా క్లాట్ రాయవచ్చు.
- ఎల్ఎల్ఎం కోర్సు చేయదల్చినవారు ఎల్ఎల్‌బీ పరీక్షను 55% మార్కులతో, ఎస్సీ, ఎస్టీ వారు 50% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. చివరి పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు కూడా క్లాట్ రాయవచ్చు.
- అభ్యర్థులకు వయః పరిమితి నిబంధన ఏమీ లేదు.

**ఆన్‌లైన్ దరఖాస్తు :** 01.01.2018 నుంచి ప్రారంభమవుతాయి.

**చివరి తేదీ :** 31.03.2018 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**దరఖాస్తు ఫీజు :** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.4000+ ఎస్సీ, ఎస్టీలకు రూ.3500.

**ఆన్‌లైన్ పరీక్ష తేదీ :** 13.05.2018 (ఆదివారం) సాయంత్రం 3 నుంచి 5 వరకు నిర్వహిస్తారు.

వెబ్‌సైట్: క్లాట్- 2018 పూర్తి వివరాలకు www.clat.ac.in చూడవచ్చు.

## భారత్‌రోడ్లపై లగ్జరీ రేంజ్ రోవర్ కారు



**న్యూఢిల్లీ:** ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ లాండ్ రోవర్ భారత్‌లో కొత్త మోడల్ కారును విడుదల చేసింది. రేంజ్ రోవర్ వెలార్ మోడల్‌ను కంపెనీ ఇక్కడ అధికారికంగా ప్రవేశపెట్టింది. వెలార్ మోడల్ ధర రూ.78.83లక్షలు. డిసెంబర్ నంచే దీనికి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. రేంజ్ రోవర్ ఫ్యామిలీలో ఇది నాలుగో ఎస్‌యూవీ. ఇది బీఎండబ్ల్యు ఎక్స్5, ఆడి క్యూ7, వోల్వో ఎక్స్‌సీ90 తరహాలో ఉంటుంది. వెలార్ మోడల్ కారు 2లీటర్ల డీజిల్ ఇంజిన్ 178బీహెచ్‌పీ/430ఎన్ఎం లేదా 237బీహెచ్‌పీ/500ఎన్ఎం ఫీచర్లతో ఉంది. 3లీటర్ల డీజిల్ ఇంజిన్ 296బీహెచ్‌పీ/700ఎన్ఎం కలిగి ఉంది. అలాగే 2లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌కు 247బీహెచ్‌పీ/365ఎన్ఎం లేదా 296బీహెచ్‌పీ/400ఎన్ఎం ఉంది. 3లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌కు 375బీహెచ్‌పీ/450ఎన్ఎం ఫీచర్ ఉంటుంది. అన్ని ఇంజిన్లకు జెడ్ఎఫ్ 8-స్పీడ్ ఆటోమేటిక్ గేర్ బాక్స్ ఉంటుంది.

## రికార్డు సృష్టించిన విదేశీ నిధులు

**413.825 బిలియన్ డాలర్లు నమోదు**

**ముంబై:** విదేశీ కరెన్సీ ఆస్తుల పెంపు కారణంగా జనవరి 12తో ముగిసిన వారాంతానికి విదేశీ నిధులు 2.7 బిలియన్ డాలర్లు పెరిగి 413.825 బిలియన్ డాలర్లతో సరికొత్త గరిష్టాలకు చేరింది. అంతకు ముందు వారంలో విదేశీ నిధులు 1.758 బిలియన్ డాలర్లు పెరిగి 411.124 బిలియన్ డాలర్లుగా నమోదైంది. 2017, సెప్టెంబరు 8 తరువాత మొదటిసారి విదేశీ నిధులు 400 బిలియన్ మార్కులను దాటినట్లు నమోదైంది. మొత్తం నిల్వలో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్థులు రిపోర్టింగ్ వీక్‌లో 2.685 బిలియన్లు పెరిగి 389.834 బిలియన్లుకు చేరింది. యుఎస్ డాలర్ నిబంధనలలో వ్యక్తీకరించబడిన విదేశీ కరెన్సీ ఆస్తుల పెరుగుదల, తరుగుదల యూరో,పౌండ్, యెన్ వంటి నాన్‌యూరో కరెన్సీల విలువ పరిగణలోకి తీసుకోబడుతుంది. బంగారు నిల్వలు మాత్రం 20.421 బిలియన్ డాలర్లుగా ఎటువంటి మార్పులేదని సెంట్రల్ బ్యాంకువెల్లడించింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థతో స్పెషల్ డ్రాయింగ్ హక్కులు 6.2 మిలియన్ డాలర్లు పెరగడంతో 1.520 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దేశీయ రిజర్వుస్థానం కూడా 9.3 మిలియన్ డాలర్లుపెరిగి 2.048 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.



బీఎండబ్ల్యూ కున్ ఎక్స్‌క్లూజివ్

## డీలర్‌షిప్ ప్రారంభం

**విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్ :** బీఎండబ్ల్యూ ఇండియా కొత్త, పూర్తిస్థాయి 4ఎస్ కున్ ఎక్స్‌క్లూజివ్ డీలర్‌షిప్‌ను ప్రారంభించింది. అతిపెద్ద ప్రీమియం ఆటో మొబైల్ డీలర్‌షిప్‌ను మదురైలోని విరుద్‌నగర్‌లో కున్ ఎక్స్‌క్లూజివ్‌ను ఏర్పాటు చేసింది. వాసంతిభూపతి ప్రిన్సిపల్ డీలర్‌షిప్‌తో పాటు దీనికి చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా అధ్యక్షులు విక్రంపవాహ్ మాట్లాడుతూ ఇతర కారులతో పోల్చుకుంటే బీఎండబ్ల్యూ ప్రత్యేకమైన ఉత్పత్తే కాకుండా సర్వీసులతో పాటు ప్రపంచ స్థాయి డీలర్‌షిప్ నెట్‌వర్క్ కలిగి వుందన్నారు. తమ డీలర్ల వద్ద కస్టమర్లు వినూత్నమైన అనుభూతిని పొందుతున్నారన్నారు. కస్టమర్లను సంతృప్తి పరిచే విధంగా సేవలు అందిస్తున్నట్లు వివరించారు. అత్యాధునిక వసతులతో 36,552 చదరపు అడుగులలో తెలిపారు.



## ఇకపై స్క్రీన్ గ్లాస్‌లోనే కెమేరా

**ముంబై :** శాంసంగ్ మొబైల్‌లో ఫ్రంట్ కెమెరా, ఐరిష్ స్కానర్ కోసం స్పేస్ విడిచిపెట్టకుండా, స్క్రీన్ గ్లాస్‌లోనే పొందుపరిచేలా సాంకేతికతను సిద్ధం చేస్తున్నారు. దీని వల్ల మొబైల్‌లో కెమెరా, ఐరిష్ స్కానర్, ఫింగర్ ప్రింట్ సెన్సర్ లాంటివి బయటకు కనిపించవు. స్క్రీన్ వెనుకనే ఉంటాయన్నమాట. ఈ సాంకేతికత పేటెంట్ కోసం శాంసంగ్ దరఖాస్తు చేసుకొంది. శాంసంగ్ నుంచి త్వరలో రాబోతున్న గెలాక్సీ నోట్ 9లో ఈ తరహా స్క్రీన్ ఉంటుందని సమాచారం. ప్రస్తుతం ఉన్న ఫుల్ స్క్రీన్ మొబైల్ స్క్రీన్ యాస్పెక్ట్ రేషియో 18:9 గా ఉంది. ఇప్పుడు కెమెరా, సెన్సర్‌లు కూడా తెర వెనక్కి వెళ్లిపోతే ఆ రేషియో 21:9గా మారనుంది. అంటే వినియోగదారుడు మరింత పెద్ద స్క్రీన్‌ను పొందొచ్చు. ఈ తరహా మొబైల్స్‌లో లౌడ్ స్పీకర్ దిగువన కాకుండా, పైన ఉంటుందట. అంత పెద్ద స్క్రీన్ అవసరం లేదనుకుంటే సాధారణ స్క్రీన్‌లా కూడా మార్చుకోవచ్చట. ఫింగర్ ప్రింట్ సెన్సార్ డిస్‌ప్లే బయటకు కనిపించకుండా ఉండే సాంకేతికత మరో మొబైల్‌లో కూడా రాబోతోంది. వీవో ఎక్స్ 20 ప్లస్‌లో ఇప్పటికే ఈ సాంకేతికతను పొందుపరిచారు. త్వరలో ఈ మొబైల్ మార్కెట్‌లోకి రాబోతోంది.

# జోరుగా వడ్డీ దందా

- చిరువ్యాపారులు, రైతులే టార్గెట్
- రూ.3నుంచి రూ.10 వడ్డీ వసూలు
- అనుమతి లేని ఫైనాన్స్‌లే అధికం



**విశాలాంధ్ర అమరావతి :** రాష్ట్రంలో వడ్డీ వ్యాపారుల దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. సామాన్య ప్రజలు, రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీ వసూలు చేస్తూ వారిని దోచుకుంటున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని రోజంతా కష్టపడుతున్న శ్రమజీవులకు అప్పులు ఇచ్చి అధిక వడ్డీ గుంజుతున్నారు. రైతులు తమ పిల్లల ఫీజులకోసం ,ఈ ఏడాది పంటలు సరిగా లేక కుటుంబ అవసరాల నిమిత్తం ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ఇష్టారాజ్యంగా వడ్డీ వేస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. తోపుడు బండ్లు, టీ హోటళు, పాన్‌షాపు, ఆటోరిక్షాలు, చిన్నచిన్న మెకానిక్ సెంటర్లను టార్గెట్‌గా చేసుకుని ఫైనాన్స్ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. సకాలంలో బ్యాంకుల నుంచి పంట రుణాలు అందడం లేదు. రుణమాఫీ డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో కొందరు, జమ అయినా బ్యాంకు నుంచి నగదు అందక కొందరు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు విధి లేక వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. రాష్ట్రంలో చిన్నవి.. పెద్దవి కలిపి అనుమతులు , పొందనివి వందలాది ఫైనాన్స్‌లు ఉన్నాయి. వీరంతా రూ.100కు రూ.3 నుంచి రూ.10 వరకు వడ్డీ వసూలు చేస్తున్నారని బాధితుల ద్వారా తెలుస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో తమ వద్దకు వచ్చిన రైతులకు చెందిన భూముల పత్రాలను తాకట్టు పెట్టుకుంటున్నారు. ఖాళీ బాండ్ పేపర్ల మీద రైతులతో పాటు వారి కుటుంబ సభ్యుల సంతకాలు చేయించుకుని అప్పులు ఇస్తున్నారు. అనుమతి లేని ఆఫీసులను ఏర్పాటు చేసుకుని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.రైతులకు ఇచ్చే అప్పుల్లో ముందుగానే వడ్డీలను పట్టుకుని మిగతా డబ్బులు చెల్లిస్తున్నారు. రైతులు పంటలు పండగానే మొత్తం డబ్బులను ఒకేసారి కట్టాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఆలస్యమైనా ఇచ్చిన డబ్బులకు మళ్లీ వడ్డీ వసూలు చేస్తున్నారు. అలాగే చిరు వ్యాపారులకు ఇచ్చే డబ్బుల్లోనూ ముందుగానే వడ్డీ తీసుకుని డబ్బులు చెల్లిస్తున్నారు. రోజువారీగా డబ్బులు వసూలు చేస్తుంటారు. దీంతో అప్పులు తీసుకున్న వారి నుంచి 20శాతం ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మధ్యతరగతి ప్రజలు కూడా తమ పిల్లల చదువుల కోసం వేలాది రూపాయలు చెల్లించలేక వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్తున్నారు. వడ్డీ ఎక్కువైనా సరే అంటూ పిల్లల భవిష్యత్ కోసం అప్పులు తెచ్చుకుంటున్నారు. వడ్డీ భారాన్ని మోయలేక, తిరిగి చెల్లించలేక నానా యాతన పడుతున్నారు. ఈ ఫైనాన్స్‌లలో చాలావరకు ప్రభుత్వ ఉద్యోగులున్నట్లు సమాచారం. పలు చోట్ల అడ్డాలుగా ఏర్పాటు చేసుకుని అప్పులు ఇస్తున్నారు. ప్రతీరోజు కోట్లలో వ్యాపారం సాగుతోంది. ఇంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

ప్రభుత్వం ఇటీవలే మని లాండరింగ్ బిల్‌నుకూడా ప్రవేశపెట్టినప్పటికీ అమలులో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా లైసెన్సు లేకుండా ఫైనాన్స్ నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని , అంతేకాకుండా అధికవడ్డీలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నరు.. ఫైనాన్స్ నిర్వహించేందుకు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా అనుమతులు కలిగి ఉండాలి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని పోలీస్ శాఖలో చెబుతున్నారు .

## షోలాపూర్‌లో 27 నుంచి వస్త్ర ప్రదర్శన

**విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్ :** రెండవ అంతర్జాతీయ యునిఫాం వస్త్ర ప్రదర్శనను ఈ నెల 27 నుంచి నిర్వహిస్తున్నట్లు సదస్సు సంయుక్త కార్యదర్శి అమిత్‌కుమార్‌జైన్ తెలిపారు. 27 నుంచి 29వ వరకు షోలాపూర్‌లో అంతర్జాతీయ వస్త్ర ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనకు పదివేల మంది రిటైలర్లు, 150 బ్రాండ్ల ప్రతినిధులు హాజరవుతారని స్పష్టం చేశారు. మఫత్‌లాల్, బ్యాంకు ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వివరించారు. దేశంలో యూనిఫాం నిర్మాణ పరిశ్రమ రూ.18వేల కోట్లకు చేరుతుందని స్పష్టం చేశారు. షోలాపూర్‌లో కొత్తగా 2వేల యూనిట్ల వస్తున్నట్లు చెప్పారు. స్కూల్ బ్యాగులు, బెల్టులు, టైలు, ట్రావెల్ బ్యాగుల తయారీదారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని వివరించారు. ఫార్మా లైఫ్ సైన్స్ హబ్‌గా వున్న హైదరాబాద్‌లో ఫిబ్రవరి 22 నుంచి 24 వరకు మూడు రోజుల పాటు బయో ఆసియా 2018 సదస్సును నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్ చెప్పారు. ఈ సదస్సుకు 1500 మంది శాస్త్రవేత్తలు, 500మంది పారిశ్రామిక వేత్తలు హాజరవుతారని వెల్లడించారు. ఫార్మా, జీవా శాస్త్ర రంగాల్లో పరిశోధనలు టెక్నాలజీపై సదస్సులు ఏర్పాటు చేసి చర్చిస్తామని అన్నారు. దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్, ఐర్లాండ్, దేశాల నుండి పెద్దఎత్తున శాస్త్రవేత్తలు వస్తారన్నారు. హైటెక్ సిటీలోని హెచ్ఐసీలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌ను 15వ ఎడిషన్ బయో అసియా సదస్సు నిర్వహించేందుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువులపై సుంకాలు

## డిజిటల్ ఇండియాకు ఊతం?



**న్యూఢిల్లీ:** ఎన్‌డీఏ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ ఇండియాకు ఈసారి సార్వత్రిక బడ్జెట్‌లో మరింత ఊతం లభించడం ఖాయంగా కనిపిస్తోంది. కస్టమ్స్ పన్నులను పునర్ వ్యవస్థీకరించడం ద్వారా ప్రభుత్వం ఈ పని చేయను న్నట్లు తెలుస్తున్నది. ఇదే గనుక జరిగితే విదేశాల నుంచి దిగుమతి చేసుకునే హై-ఎండ్ మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు మరింత ప్రియమవు తాయి. ప్రస్తుతం సుంకాలు లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తున్న ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, కెమెరా మాడ్యూళ్లు, డిస్‌ప్లేల్లాంటి విడిభాగాలపై ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో కనీస సుంకాలను విధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పరిధిలో కస్టమ్స్ సుంకం మాత్రమే మిగిలి ఉన్నది. దేశాన్ని అసెంబ్లింగ్ (విడిభాగాలను దిగుమతి చేసుకుని వస్తువులను తయారుచేసే) కేంద్రంగా కాకుండా ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా మార్చాలని మోదీ సర్కారు ఆకాంక్షిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మొబైల్ ఫోన్లపై గతేదాది జూలై 1వ తేదీన 10 శాతం కనీస కస్టమ్స్ సుంకాన్ని విధించిన ప్రభుత్వం.. డిసెంబర్ 14న ఆ సుంకాన్ని 15 శాతానికి పెంచింది. అయితే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కస్టమ్స్ సుంకాన్ని మినహాయిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్య చేపట్టడం ఎంతవరకు సమర్థనీయమని పన్ను నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

**బీమాకు ప్రోత్సాహకాలు**

దేశంలో బీమా రంగాన్ని విస్తరించి ఎక్కువ మందిని జీవిత, ఆరోగ్య బీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో ప్రజలకు కొన్ని రాయితీలను ప్రకటించే అవకాశం ఉంది. కనీసం బీమా పెట్టుబడులకు పన్నుల పరంగా ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకాలను అందజేయాలని, జీఎస్టీ నుంచి ఇన్సూరెన్స్ పాలసీలను మినహాయించాలని బీమా రంగం కోరుతోంది. కుటుంబాలకు సామాజిక భద్రతను కల్పించేందుకు ఎంతో అవసరమైన జీవిత బీమాకు ఇంతకు ముందు ఆదాయం పన్ను చట్టంలోని సెక్షన్ 80సీలో ప్రత్యేకమైన స్థానం ఉండేదని. అయితే ప్రభుత్వం ఇప్పుడు ఈ సెక్షన్‌లో ఎన్నో ఉత్పత్తులకు చోటు కల్పించడంతో జీవిత బీమాకు ప్రాధాన్యత క్రమేణా తగ్గుతున్నదని బజాజ్ క్యాపిటల్ సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ బజాజ్ విచారాన్ని వ్యక్తం చేశారు. మొత్తం జనాభాలో ఎంతో మందికి జీవిత, ఆరోగ్య బీమా రక్షణ లేదన్నది కఠోర వాస్తవం. ఆ సదుపాయాలతో ఇటువంటి వారికి సామాజిక భద్రతను కల్పించేందుకు ప్రత్యేక పన్ను రాయితీలు ఎంతగానో తోడ్పడతాయని, కనుక దీనిపై ప్రభుత్వం పరిశీలన జరిపి బడ్జెట్‌లో తగిన చర్యలను ప్రకటించాలని బీమా రంగ నిపుణులు కోరుతున్నారు.

షియోమీకి పోటీగా

## తక్కువ ధరకే శాంసంగ్ స్మార్ట్‌ఫోన్లు !



**ముంబై :** గడిచిన మూడేళ్ల కాలంలో షియోమీ మన దేశంలోనే నంబర్ వన్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఒకప్పుడు టాప్ ప్లేస్‌లో శాంసంగ్ కొనసాగగా ఇప్పుడా స్థానాన్ని షియోమీ చేజిక్కించుకుంది. ఈ క్రమంలో పవర్‌ఫుల్ ఫీచర్లు కలిగిన స్మార్ట్‌ఫోన్లను చాలా తక్కువ ధరకే అందిస్తూ వినియోగదారులను ఎంఐ బ్రాండ్ ఫోన్లు ఆకట్టుకుంటున్నాయి. అయితే తిరిగి నంబర్ వన్ స్థానాన్ని పొందడం కోసం శాంసంగ్ తన ప్రయత్నాలు ప్రారంభించింది. చైనాకు చెందిన మొబైల్స్ తయారీదారు షియోమీ ఏ కొత్త మోడల్‌ను విడుదల చేసినా ముందుగా ఆన్‌లైన్‌లో ఫ్లాష్ సేల్ ద్వారా వాటిని విక్రయిస్తుంది. తరువాత నెమ్మదిగా వాటిని ఆఫ్‌లైన్ స్టోర్స్‌లో అమ్మడం ప్రారంభిస్తుంది. దీంతో వీలైనన్ని ఎక్కువ ఫోన్లు అమ్మడమే కాదు, ఆన్‌లైన్‌లో అమ్మడం ద్వారా విక్రయదారు కమీషన్ చెల్లించాల్సిన పని ఉండదు. దీంతో ఫోన్‌ను మరింత తక్కువ ధరకే అందించవచ్చు. మొదట్నుంచీ షియోమీ ఇదే పంథాతో ముందుకు సాగుతుండగా, ఇప్పుడు అదే బాటలో శాంసంగ్ నడవనుంది. త్వరలో శాంసంగ్ షియోమీకి పోటీగా కొత్త మోడల్ స్మార్ట్‌ఫోన్లను తన ఆన్ సిరీస్‌లో విడుదల చేయనుంది. వీటి ధరలు చాలా తక్కువగా ఉండే అవకాశం ఉంది. శాంసంగ్ వీటిని మొదటగా ఆఫ్‌లైన్ స్టోర్స్‌లో కాకుండా కేవలం ఆన్‌లైన్‌లోనే... అది కూడా ఫ్లాష్ సేల్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిసింది. ఆన్‌లైన్‌లో కూడా కేవలం ఇద్దరు లేదా ముగ్గురు ప్రియారిటీ సెల్లర్స్ ద్వారానే శాంసంగ్ తన ఫోన్లను విక్రయించాలని చూస్తున్నది. ఇక శాంసంగ్ నుంచి తక్కువ ధరలకే స్మార్ట్‌ఫోన్లు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయో వేచి చూడాలి..!

## ఏడు లక్షల మంది భవిష్యత్తు ప్రశ్నార్థకం

**తాత్కాలికంగా మూతపడిన ట్రంప్ పాలన**

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హ్రస్వదృష్టి కారణంగా సుమారు ఏడు లక్షల మంది స్వాప్నికుల (అక్రమ వలసదారుల) భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. బాధితుల్లో అమెరికన్ భారతీయులు వేల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. అధ్యక్ష పీఠం అలంకరించి సరిగా ఏడాది ముగిసిన సమయానికే ట్రంప్ పాలన యంత్రాంగానికి సెనేట్‌లో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. స్వాప్నికులపై రూపొందించిన ద్రవ్య వినిమయ బిల్లుకు సెనేట్‌లో ఆమోదం లభించలేదు. ఈబిల్లులో స్వాప్నికుల భద్రతకు ఎలాంటి హామీ లేదని డెమొక్రాట్లు అభ్యంతరం పెట్టడంతో బిల్లు వీగిపోయింది. ఈపరిస్థితికి కారణం నువ్వంటే నువ్వంటూ రిపబ్లికన్లు, డెమొక్రాట్లు పరస్పరం దూషించుకున్నారు. దీని పర్యవసానం అమెరికా ఆర్థిక కార్యకలాపాల ప్రతిష్టంభనకూ దారి తీశాయి. ఒక రకంగా ట్రంప్ ప్రభుత్వం తాత్కాలికంగా మూతపడినట్లు భావించాలి. అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని రకాల కార్యకలాపాలు స్థంభించి పోయిన పరిస్థితి తలెత్తింది. ఈ పరిస్థితి కారణంగా అమెరికా ప్రభుత్వానికి వారానికి సుమారు రూ.40వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. ఆరు నెలల క్రితం రూపొందించిన ద్రవ్య వినిమయ బిల్లుకు జనవరి 19లోగా సెనేట్ ఆమోదం పొందడం అనివార్యం. అయితే, రిపబ్లికన్లు, డెమొక్రాట్ల మధ్య విభేదాలతో బిల్లుకు సెనేట్ ఆమోదం దక్కని పరిస్థితికి కారణమైంది. కాగా. సోమవారం నాటికి పరిస్థితులు చక్కబడతాయని బడ్జెట్ డైరెక్టర్ మిక్ ముల్వానీ ధీమా కనబరుస్తున్నారు. మరో వైపు, ఫిబ్రవరి 16 వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందనే అభిప్రాయం వినవస్తోంది. చిన్న వయసులోనే తల్లిదండ్రులతో కలిసి వచ్చి అమెరికాలో స్థిరపడిన వారినే స్వాప్నికులు అంటారు. అమెరికాలో నివసించేందుకు అవసరమైన ధృవీకరణ పత్రాలు వీరికి ఉండవు. వీరిని అక్రమ వలసదారులుగా గుర్తించడానికి ట్రంప్ ప్రయత్నించారు 2001లో బరాక్ ఒబామా అధ్యక్షునిగా ఉన్న సమయంలో వీరి భద్రత కోసం రూపొందించిన బిల్లుకు ఇప్పటి వరకు ఆమోదం లభించక పోవడం. పరిస్థితిని చక్కదిద్దేందుకు ట్రంప్ ఎంచుకున్న మార్గం సరైంది కాక పోవడంతో ప్రతిపాదిత ద్రవ్య వినిమయ బిల్లుకు సెనేట్ ఆమోదం లభించకపోవడానికి ప్రధాన కారణంగా చెప్పాలి. 2013 తరువాత అమెరికా పాలన యంత్రాంగం మూత పడటం ఇదే తొలి సారి.

## మళ్లీ జియో 4జీ ఫీచర్ ఫోన్ అమ్మకాలు..!



**ముంబై:** జియో 4జీ ఫీచర్ ఫోన్.. ఆరంభం నుంచి మొబైల్ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖేష్ అంబానీ ఈ ఫోన్ గురించి ప్రకటన చేసినప్పటి నుంచి దీని కోసం వినియోగదారులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. ఈ క్రమంలోనే మొదటిసారి నిర్వహించిన సేల్‌లో ఈ ఫోన్‌ను లక్షల మంది కొనుగోలు చేశారు. దాంతో మొదటిసారి జియో ఫోన్ల అమ్మకం ముగిసింది. అయితే తిరిగి ఈ ఫోన్లను ఎప్పుడు అమ్ముతారో జియో ఇప్పటి దాకా వెల్లడించలేదు. కానీ తాజాగా ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండానే ఈ ఫోన్ అమ్మకాలను జియో మళ్లీ ప్రారంభించింది. జియో వెబ్‌సైట్‌లో ఇప్పుడు జియో 4జీ ఫీచర్ ఫోన్‌ను ఎవరైనా కొను గోలు చేయవచ్చు. ఆ సైట్‌ను ఓపెన్ చేస్తే అందులో జియో ఫోన్ విభాగంలో గెట్ నౌ అనే ఆప్షన్ దర్శనమిస్తోంది.

అందులో ఫోన్ నంబర్, పిన్‌కోడ్ ఎంటర్ చేసి ముందుకు సాగితే రూ.1500 పేమెంట్ చేసి డెలివరీ అడ్రస్ ఇవ్వాలంటూ ఆప్షన్స్ కనిపిస్తున్నాయి. జియో ఫోన్‌కు రెండో దఫా అమ్మకాలు మళ్లీ ప్రారంభమయ్యాయని అర్థమవుతోంది. అయితే దీనిపై జియో అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు.

## వాట్సాప్‌కు ఇకపై డబ్బులు చెల్లించాలా..?

**ముంబై :** వాట్సాప్ ఇకపై ఫ్రీ కాదు. ఆ సేవలు వాడుకుంటున్నందుకు ఇకపై వాట్సాప్‌కు ఒక డాలర్ ఫీజు చెల్లించాలి. వాట్సాప్ సేవలు మీ ఫోన్‌లో నిలిచిపోకుండా ఉండేందుకు వెంటనే కింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేసి ఒక డాలర్ ఫీజు చెల్లించండి..! ఇలా గనక మీకు వాట్సాప్‌లో మెసేజ్‌లు వస్తున్నాయా..! అయితే వాటిలో ఎంత మాత్రం నిజం లేదు. వాటిని అస్సలు నమ్మకండి. వాటిని నమ్మి ఆ మెసేజ్‌లలో ఇచ్చిన లింక్‌లను క్లిక్ చేశారో.. ఇక అంతే సంగతులు. మీ ఫోన్‌లోకి వైరస్ వ్యాప్తి చెందుతుంది. వాట్సాప్ ఉచితం కాదు, దానికి డబ్బులు చెల్లించాలి.. అంటూ గతేడాది చాలా మంది యూజర్లకు పై విధంగా మెసేజ్‌లు వచ్చాయి. కానీ చివరకు ఈ విషయంపై వాట్సాప్ స్పష్టతనిచ్చింది. వాట్సాప్ ఎప్పటికీ ఉచితమేనని తెలియజేసింది. అయినప్పటికీ ఇప్పుడు తాజాగా మళ్లీ ఇలాంటి నకిలీ మెసేజ్‌లు వాట్సాప్‌లో వైరల్ అవుతున్నాయి. కనుక మీకు ఇలాంటి నకిలీ మెసేజ్‌లు వస్తే వెంటనే వాటని బ్లాక్ చేయండి. లేదా.. స్పామ్ కింద రిపోర్టు చేయండి..! అంతేకానీ వాటిని మాత్రం ఓపెన్ చేసి వైరస్‌తో ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దు..!



## మారుతి నుంచి నాలుగు కొత్త కార్లు

**పూణే :** ఏడాదిన్నర వ్యవధిలో మారుతి సుజుకి నుంచి నాలుగు కొత్త ప్రోడక్టులు మార్కెట్‌లోకి రానున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరాన్ని రెండంకెల విక్రయ వృద్ధితో ముగించాలని భావిస్తున్న కంపెనీ కొత్త ప్రోడక్టులతో మరింతగా సేల్స్ పెంచుకోవడంపై దృష్టి సారించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 9-14 తేదీల్లో జరిగే ఆటో ఎక్స్‌పోలో మారుతి తన స్విఫ్ట్ ఆల్ న్యూ వెర్షన్‌ను లాంచ్ చేయనుంది.

న్యూ స్విఫ్ట్‌తో పాటు సెడాన్, సియాజ్, ఎర్టిగాల న్యూరిఫ్రెష్డ్ వెర్షన్స్‌ను రానున్న కొద్ది మాసాల్లో మార్కెట్‌లో ప్రవేశ పెట్టాలని మారుతి సన్నాహాలు చేస్తోంది. ఇక వాగన్‌ఆర్ ఆల్ న్యూ వెర్షన్‌ను కూడా లాంచ్ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. అయితే దీనికి మరికొంత సమయం పడుతుందని మారుతి వర్గాలు తెలిపాయి.

# ఉగ్రవాదం ముప్పు గుర్తించి ఇకనైనా పోరాడు


- అఫ్ఘనిస్థాన్‌లో శాంతిపై దృష్టిపెట్టాలి
- ఐరాస భద్రతా మండలిలో పాక్‌కు భారత్ హితవు
- అఫ్ఘన్‌లో శాంతి, సుస్థిరతకు భారత్ కృషి



**ఐక్యరాజ్యసమితి :** ఐక్యరాజ్యసమితి వేదికగా పొరుగు దేశం పాకిస్థాన్ తీరును భారత్ మరోసారి తీవ్రంగా ఎండగట్టింది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే విషయంలో పాక్ ఇకనైనా తన బుద్ధి మార్చుకోవాలని హితవు పలికింది. ఉగ్రవాదుల వల్ల వచ్చే సమస్యలేమిటో గుర్తించి వాటిపై పోరాడాల్సిందిగా పాక్‌కు సూచించింది. అలా చేసినప్పుడే అఫ్ఘనిస్థాన్‌లో శాంతి, సుస్థిరత ఏర్పడతాయని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి సయాద్ అక్బరుద్దీన్ వక్కాణించారు. ఉగ్రవాదులకు స్వర్గధామంగా నిలిచిన వాళ్లు తమ బుద్ధిని మార్చుకోవాలి అన్నారు. శుక్రవారం జరిగిన ఐరాస భద్రతా మండలి ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్.. ఉగ్రవాదుల కార్ఖానా అని అన్నారు. పాకిస్తాన్‌లో అడుగడుగునా ఉగ్రవాదులను తయారు చేసే ఫ్యాక్టరీలు ఉన్నాయని ఆయన చెప్పారు. పాకిస్థాన్‌లోని టెర్రరిస్టుల స్వర్గధామాలను నిర్మూలించడంపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. సరిహద్దు వెంబడి వున్న ఈ స్వర్గ ధామాల వల్ల ఎదురయ్యే టెర్రరిజం సవాళ్లపై దృష్టిసారించాలని అన్నారు. అఫ్ఘనిస్థాన్ తిరిగి తన స్థానాన్ని పొందేందుకు ఇలా చేయడం తప్పనిసరని అక్బరుద్దీన్ పేర్కొన్నారు. అఫ్ఘనిస్థాన్‌లో శాంతి, సుస్థిరత, భద్రత, సౌభ్రాతృత్వం వెల్లివెరియడానికి ఈ ప్రాంతంలోని, అంతర్జాతీయ భాగస్వాములతో సన్నిహితంగా పనిచేయడానికి న్యూఢిల్లీ నిబద్ధతతో ఉన్నదని చెప్పారు. 'ఉగ్రవాదం కారణంగా అఫ్ఘనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వానికి ముప్పు వాటిల్లుతోంది. తీవ్రవాద ప్రభావం ఆ దేశంలో చాలా ఎక్కువగా ఉంది. అందుకు ప్రపంచ బ్యాంకు గణాంకాలే నిదర్శనం. 2003 నుంచి 2014 వరకు అఫ్ఘనిస్థాన్ వార్షిక ఆర్థిక వృద్ధి రేటు 9.6శాతంగా ఉంది. కానీ 2016లో ఆ దేశంలో ఉగ్రవాద చర్యలు ఎక్కువగా ఉండటం వల్ల వృద్ధి రేటు 2.2శాతానికి పడిపోయింది. ఇక గతేడాది 2.6శాతం నమోదైంది. సరిహద్దు ఉగ్రవాదంపై దృష్టి సారించి దాన్ని నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాల్సిన సమయం ఇది. అఫ్ఘనిస్థాన్‌లో శాంతి నెలకొల్పే విషయంలో భారత్ కట్టుబడి ఉంది. ఇదే మా ప్రధాని నరేంద్రమోడీ ఆలోచన విధానం" అని చెప్పారు. "2015, డిసెంబరు 24న అఫ్ఘనిస్థాన్‌లోని పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మోడీ పాక్‌లోని లాహోర్‌కు వెళ్లారు. కానీ దురదృష్టవశాత్తూ ఆయన సందర్శన దుష్ప్రభావాన్ని చూపింది. పఠాన్‌కోట్ సైనిక స్థావరంపై ఉగ్రవాదులు దాడులు చేశారు. అంతేకాదు.. అఫ్ఘనిస్థాన్‌లో ప్రతిరోజు ఉగ్రవాదులు పలు చోట్ల దాడులు చేసి ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారు" అని అక్బరుద్దీన్ ధ్వజమెత్తారు. "ఇటువంటి ఆలోచన విధానం ఉన్నవారు శాంతిని కోరుకోరు. ఉగ్రవాదులకు స్వర్గధామంగా నిలిచిన వాళ్లు తమ బుద్ధిని మార్చుకోవాలి' అంటూ పరోక్షంగా పాక్ తీరును అక్బరుద్దీన్ ఎండగట్టారు. ఉగ్రవాద ముప్పు కారణంగా అఫ్ఘనిస్థాన్ ఎంతో నష్టపోతోందని ఆయన తెలిపారు. దాని నుంచి కోలుకునేందుకు అఫ్ఘనిస్థాన్‌కు భారత్ ఎంతో తోడ్పాటును అందిస్తోందన్నారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, తాగునీటి సరఫరా తదితర రంగాల్లో సహకారం అందించేందుకు భారత్-అఫ్ఘనిస్థాన్ మధ్య ఒప్పందాలు జరిగిన విషయాన్ని అక్బరుద్దీన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే గతేడాది అఫ్ఘనిస్థాన్‌కు ఒక బిలియన్ డాలర్ల సాయాన్ని భారత్ అందించిందని అక్బరుద్దీన్ తెలిపారు.


ఫ్లిప్‌కార్ట్‌లో రిపబ్లిక్ డే సేల్ షురూ..

## భారీ తగ్గింపు ధరలకు స్మార్ట్‌ఫోన్లు..!




**హైదరాబాద్ :** ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'రిపబ్లిక్ డే సేల్'ను శనివారం ప్రారంభించింది. ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనున్న ఈ సేల్‌లో భాగంగా స్మార్ట్‌ఫోన్లు, మొబైల్ యాక్ససరీలు తదితర అనేక ఉత్పత్తులపై ఆకట్టుకునే ఆఫర్లు, భారీ రాయితీలు వినియోగదారులకు లభిస్తున్నాయి. ఫ్లిప్‌కార్ట్ నిర్వహిస్తున్న రిపబ్లిక్ డే సేల్‌లో గూగుల్ పిక్సల్ 2 ఎక్స్‌ఎల్ ఫోన్ భారీ తగ్గింపు ధరకు కేవలం రూ.48,999 ధరకే లభిస్తున్నది. హెచ్‌టీసీ యూ11 రూ.43,999 ధరకు, యాపిల్ ఐఫోన్ 7 (32 జీబీ) రూ.40,999కు, గూగుల్ పిక్సల్ 2 రూ.39,999కు, శాంసంగ్ గెలాక్సీ ఎస్7 రూ.26,990కి, హానర్ 8 ప్రొ రూ.24,999కు, శాంసంగ్ గెలాక్సీ ఎస్7 ఎడ్జ్ రూ.35,900కు, షియోమీ ఎంఐ మిక్స్ 2 రూ.32,999కు, ఒప్పో ఎఫ్3 ప్లస్ రూ.24,990కి, మోటో జడ్2 ప్లే రూ.22,999కు లభిస్తున్నాయి. ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే సేల్‌లో యాపిల్ ఐఫోన్ ఎస్ఈ (32 జీబీ) రూ.18,999కే లభిస్తున్నది. దీంతోపాటు వివో వీ7 రూ.16,990కి, శాంసంగ్ గెలాక్సీ ఆన్ మ్యాక్స్ రూ.13,990కి, మోటో ఎం 64 జీబీ రూ.12,999కు, శాంసంగ్ గెలాక్సీ ఆన్ ఎన్ఎక్స్‌టీ 64జీబీ రూ.11,900కు, షియోమీ రెడ్‌మీ నోట్ 4 (64జీబీ) రూ.10,999కు, శాంసంగ్ గెలాక్సీ ఆన్ ఎన్ఎక్స్‌టీ (16జీబీ) రూ.9,999కు, మోటో జీ5 ప్లస్ రూ.10,999కు, మోటో ఈ4 ప్లస్ రూ.9,499కు, లెనోవో కె8 ప్లస్ (3జీబీ ర్యామ్) రూ.8,999 ధరకు లభిస్తున్నాయి. టీవీలు, పవర్ బ్యాంక్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్కులు, స్పీకర్లు, హెడ్‌సెట్స్, కెమెరాలు తదితర ఉత్పత్తులపై కూడా ఈ సేల్‌లో భారీ రాయితీలు లభిస్తున్నాయి. సిటీ బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డులను ఉపయోగించి కొనుగోలు చేస్తే 10 శాతం క్యాష్‌బ్యాక్ వస్తుంది. ఫోన్ పే వాలెట్‌తో కొనుగోలు చేస్తే 15 శాతం క్యాష్ బ్యాక్ లభిస్తుంది.

# వంటింటి దినుసులతోనే వాపును నయం చేయవచ్చు



మనం ప్లేగు, క్షయ వంటి ఎన్నో రకాల మొండి వ్యాధులను జయించాం. యాంటీబయాటిక్స్‌తో ఇన్ఫెక్షన్లను తేలికగానే వదిలించుకుంటున్నాం. అత్యాధునికమైన చికిత్సలతో గుండె జబ్బులు, పక్షవాతం, ఉబ్బసం వంటి చాలా వ్యాధులనూ సమర్థంగానే ఎదుర్కొనగలుగుతున్నాం. కానీ ఒక రకంగా ఈ గుండెజబ్బుల వంటివన్నీ మనం తీసుకునే ఆహారం, మన రోజువారీ అలవాట్లు, శారీరక వ్యాయామం వంటివాటితో బలంగా ముడిపడిన వ్యాధులు. అందుకే వీటిని జీవనశైలీ వ్యాధులని కూడా అంటున్నారు.

క్యాన్సర్‌తో సహా ఇలాంటి జీవనశైలి జబ్బులను లోతుగా పరిశోధించినప్పుడు ఇలాంటి చాలా వ్యాధులకు మూలం.. మన ఒంట్లో తలెత్తే 'వాపు' ప్రక్రియలో కనబడుతోంది. ఒకరకంగా మనకు 'వాపు' అనేది తెలియనిదేం కాదు. దెబ్బ తగిలితే అక్కడ వాస్తుంది. బెణికితే వాస్తుంది. ఇదంతా బయటి నుంచి జరిగిన నష్టానికి మన శరీరం స్పందన. ఆ నష్టాన్ని పూడ్చుకునే, దెబ్బను మాన్పుకునే ప్రక్రియలో భాగం. ఈ వాపు పైకి కనిపిస్తుంది కాబట్టి మనం దీన్ని గుర్తిస్తున్నాం. అయితే ఇలా బయటకు కనిపించకుండా.. మన లోలోపల రకరకాల అవయవాల్లో, రకరకాల వ్యవస్థల్లో కూడా వాపు లాంటి మార్పు తలెత్తుతుంటుంది. దీన్నే 'ఇన్‌ఫ్లమేటరీ ప్రాసెస్' అంటారు. ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న చాలా రకాల దీర్ఘకాలిక సమస్యలకు లోలోపల ఈ 'వాపు' తరహా మార్పులు కారణమవుతున్నాయని ఆధునిక వైద్యరంగం స్పష్టంగా గుర్తించింది. ముఖ్యంగా గుండె జబ్బులు, పక్షవాతం, కొన్ని రకాల క్యాన్సర్లు, కీళ్లవాపులు, కొన్ని రకాల చర్మవ్యాధులు.. వీటన్నింటి వెనకా... ఎంతోకొంత ఈ 'వాపు' మార్పుల పాత్ర ఉంటోందని తేలటం విశేషం. కాబట్టి వాపు తరహా మార్పులను ముందు నుంచీ సమర్థంగా ఎదుర్కొంటే మనం చాలా రకాల జబ్బులను మూలాల్లోనే నివారించుకోవచ్చు. అందుకోసమే ఈ 'వాపు'నకు తేలికైన విరుగుడు కనుగొనేందుకు వైద్యపరిశోధనా రంగం విస్తృతంగా కృషి చేస్తోంది. అదృష్టవశాత్తూ.. దీన్ని ఎదుర్కొనటంలో మనం రోజువారీ ఇంట్లో వాడుకునే రకరకాల ఆహార పదార్థాలు, ముఖ్యంగా కొన్ని రకాల దినుసులు, సుగంధ ద్రవ్యాలు బాగానే ఉపకరిస్తున్నాయని బయటపడింది. ముఖ్యంగా పసుపు, వెల్లుల్లి వంటి వాటిలో ఉండే మూల ద్రవ్యాలు- వాపునూ, మన శరీరంలో ఒక పరంపరగా అది సృష్టించే విలయాన్నీ నివారించటంలో కొంత ముఖ్యపాత్రే పోషిస్తున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో రోజూ పాలలో పసుపు వేసుకుని తాగటమన్నది ఇటీవలి కాలంలో తరచూ చర్చల్లోకి వస్తోంది. ఇది ఏకంగా 'గోల్డెన్ మిల్క్' పేరుతో విస్తృత ప్రాచుర్యంలోకి వస్తోంది. ఇవన్నీ చిరకాలంగా మనకు తెలిసినవే అయినా.. వీటికి సరికొత్త ఆరోగ్య ప్రయోజనాలున్నాయని, ఇవి ఆధునిక కాలంలో మనల్ని వేధిస్తున్న చాలా వ్యాధులకు విరుగుడుగా కూడా పని చేస్తాయని తేలటం.. మనం తప్పకుండా గుర్తించాల్సిన విశేషం.



**అల్లం :** వాపు రావటంలో.. ఒంట్లో విశృంఖలంగా తిరిగే 'ఫ్రీర్యాడికల్స్' పాత్ర ఎక్కువ. వీటి ఉత్పత్తిని ఎదుర్కొనే రసాయనాలు అల్లంలో ఉన్నాయి.

**కారం :** మిర్చిలోని క్యాప్సియాసిన్ అనే ప్రత్యేక రసాయనం వాపుల కారణంగా తలెత్తే నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

**దాల్చించెక్క :** వాపు ప్రక్రియ తలెత్తితే 'ఎన్ఎఫ్-కప్పా బి' అనే ప్రోటీన్ విడుదలై చాలా నష్టం చేస్తుంది. దీన్ని అడ్డుకోవటంలో దాల్చినచెక్క ఉపయోగపడుతుంది.

**లవంగాలు :** లవంగాల్లోని ఇరోజినాల్ అనే ప్రత్యేక రసాయనానికి వాపులకు కారణమయ్యే కాక్స్2 అనే ఎంజైమ్‌ని అడ్డుకునే శక్తి ఉంది.

**వెల్లుల్లి :** ఆర్థ్రైటిస్ కారణంగా తలెత్తే నొప్పులు, వాపుల నివారణిగా వెల్లుల్లి చక్కగా ఉపకరిస్తుంది. నొప్పులకు కారణమయ్యే నైట్రిక్‌ఆక్సైడ్, ప్రోస్టోగ్లాడ్సిన్స్ విడుదలని అడ్డుకుంటుంది.

**నల్లమిరియాలు :** మిరియాల్లోని పెపరైన్ నొప్పులని, వాపులని కూడా అదుపులో ఉంచుతుంది.

పసిడిపాలు!

పాలల్లో చిటికెడు పసుపు వేసుకుని తాగడం... దీన్ని పాతకాలం నాటి బామ్మల చిట్కాగా కొట్టిపారేయకండి. ఎందుకంటే ఈ చిట్కా కేవలం దగ్గు, జలుబుల నుంచే కాకుండా.. శరీరంలోని అంతర్గత వాపుల (ఇన్‌ఫ్లమేషన్) నివారణకూ ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రాచుర్యంలోకి వస్తోందే పసిడిపాలు!

**పసిడిపాలు :** దీన్నే గోల్డెన్ మిల్క్ అని వ్యవహరిస్తున్నారు. గోరువెచ్చని పాలల్లో అరచెంచా పసుపు వేసుకుని తాగితే ఇన్‌ఫ్లమేషన్ నుంచి ఉపశమనం కలుగుతుంది. పసుపులోని కర్‌క్యుమిన్ అనే శక్తివంతమైన పాలిఫినాల్‌కు గాయాలను మాన్పే గుణం, చీముపట్టకుండా చూసే లక్షణమే (యాంటిసెప్టిక్) కాదు.. యాంటిఆక్సిడెంట్ గుణాలూ దండిగా ఉన్నాయి. అందుకే పసుపు వేసిన పాలని తీసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. ఈ పాలల్లోనే అరచెంచా మిరియాల పొడి వేసుకుంటే మరీ మంచిది. వీటకి తోడు దాల్చిన చెక్క, తేనె, దంచిన అల్లం కూడా కలుపుకోవచ్చు. ఇవి పడని వారు.. గుండెల్లో మంట, అసిడిటీ బాధలున్నవారు పసుపు వేసుకుంటే చాలు.

## మధుమేహ వ్యాధిని తగ్గించే సులువైన మార్గాలు



మధుమేహం వ్యాధి బారినపడితే జీవితాంతం పాటూ మందులు వాడాల్సిందే. కానీ కొన్ని చిట్కాలను పాటించటం వలన వ్యాధి తీవ్రతలను తగ్గించవచ్చు. అవేంటో తెలుసుకుందాం..

**ఆహారంలో మార్పులు :** రక్తంలోని చక్కెర స్థాయిలు పెరుగుతున్నట్లయితే, మొదటగా తీసుకునే ఆహారంలో మార్పులు చెయాలి. మంచి పోషకాహార నిపుణుడిని కలిసి ఆహార ప్రణాళికను రూపొందించుకోండి. నాణ్యమైన, పరిమిత మోతాదులో తినటం వలన అనుకూల ఫలితాలను పొందుతారు. అదనంగా కార్బోహైడ్రేట్లను తగ్గించి వీటికి బదులుగా ప్రోటీన్‌లను తీసుకుంటే చాలా మంచిది.


**వ్యాయామాలు :** మధుమేహ వ్యాధిని తగ్గించే ప్రణాళికలో వ్యాయామాలు ముఖ్యమనే చెప్పాలి. 30 నిమిషాల ఏరోబిక్ వ్యాయామాల వలన రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు తగ్గటమే కాకుండా, ముఖ్యమైన కణజాలాలను మరింత సున్నితంగా మారుస్తుంది. వ్యాయామాల వలన మధుమేహ వ్యాధి తగ్గడంతోపాటు కాక పూర్తి ఆరోగ్యం మెరుగుపడుతుంది.

**బరువు తగ్గటం :** రక్తంలోని గ్లూకోస్ స్థాయిలను తగ్గించే అందుబాటులో ఉన్న మరొక సులువైన మార్గం బరువు తగ్గటం. బరువు తగ్గటం వలన ఇన్సులిన్‌కు శరీరం మరింత సున్నితంగా మారుతుంది.

**మందులు:** మాత్రలు శరీర రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తాయి. రోజువారి ఇన్సులిన్ ఇంజెక్షన్ కూడా టైప్-1 మధుమేహాన్ని శక్తివంతంగా తగ్గిస్తుంది. కొన్ని సార్లు టైప్-2 మధుమేహాన్ని నియంత్రణలో ఉంచడానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ అవసరం అవుతుంది.

**ఇంట్లోనే రోజు చెక్ చేయటం :** క్రమంగా వైద్యుడిని కలిసి రక్తలోని గ్లూకోజ్ స్థాయిలను చెక్ చేయించుకోవటంతో పాటూ, బ్లడ్ గ్లూకోస్ మీటర్‌తో తరచూ స్వతహాగా ఇంట్లో కూడా చెక్ చేస్తూ ఉండటం మంచిది. ఇలా క్రమంగా చెక్ చేస్తూ ఉండటం వలన రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తగ్గినా లేదా పెరిగిన వాటికి అనుగుణంగా వైద్యం అందించవచ్చు.





## డార్లింగ్‌తో వివాదాస్పద హీరోయిన్ ?



"ప్రభాస్‌తో ఓ భారీ చిత్రంలో నటించబోతున్నా.. ఇంతకు మించి వివరాలు ఇప్పుడే చెప్పలేను" అంటూ మోడల్, నటి అర్షి ఖాన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాగా, భోపాల్‌కు చెందిన మోడల్ అర్షి.. పాక్ క్రికెటర్ షాహిద్ అఫ్రిదీతో ప్రేమాయణం అంటూ వార్తల్లో నిలిచారు. ఆపై బిగ్ బాస్ షో 11వ సీజన్‌లో పాల్గొన్న ఆమె మరిన్ని వివాదాలను మూటగట్టుకున్నారు. దీంతో కాంట్రవర్సీ కేరాఫ్‌గా మారారు అర్షి. ప్రస్తుతం అర్షి ఓ హిందీ, తమిళ చిత్రాల్లో నటిస్తుండగా.. ఇంతలో ఏకంగా ప్రభాస్ చిత్రంలో కూడా యాక్ట్ చేయబోతున్నట్లు ప్రకటించింది. దీనిపై అధికారికంగా ప్రభాస్ నుంచి కానీ, చిత్ర యూనిట్ నుంచి కానీ ఎటువంటి స్పష్టత రాలేదు. ప్రస్తుతం యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ సాహో సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఇదయ్యాక బాలీవుడ్ సినిమా ఉంటుందని స్వయంగా ప్రభాసే ప్రకటించటం తెలిసిందే. అయితే ఈ రెండింటిలో ఏ ప్రాజెక్టో తెలీదుగానీ మోడల్, నటి అర్షి ఖాన్.. తాను ప్రభాస్ చిత్రంలో నటించబోతున్నానంటూ తనకు తానే ప్రకటించేసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది.



## కమల్, అక్షర, విక్రమ్‌తో సినిమా

కమల్‌హాసన్, ఆయన చిన్న కుమార్తె అక్షరా హాసన్, విక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుంది. ఈ చిత్రాన్ని తన సొంత బేనర్ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్‌నేషనల్‌పై కమల్‌హాసన్ నిర్మిస్తున్నారు. ట్రిడెంట్ ఆర్ట్స్ బ్యానర్స్ మరో నిర్మాణ సంస్థగా వ్యవహరించనుంది. కమల్‌తో 'తూంగావనమ్' (తెలుగులో 'చీకటి రాజ్యం') చిత్రానికి దర్శకత్వం వహించిన రాజేశ్ ఎమ్.సెల్వ ఈ చిత్రానికి దర్శకుడు. "ఈ కాంబినేషన్ సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను" అన్నారు కమల్. "విక్రమ్, అక్షరాహాసన్‌కు థ్యాంక్స్. నా శక్తి సామర్థ్యాలను నమ్మిన కమల్‌హాసన్‌గారికి స్పెషల్ థ్యాంక్స్" అన్నారు రాజేశ్ ఎమ్. సెల్వ. ఇదిలా ఉంటే... కమల్‌హాసన్ నటించి, దర్శకత్వం వహించిన 'విశ్వరూపం 2' విడుదలకు సిద్ధమవుతోంది.




## ముద్దు సీన్లు ఉన్నాయని 'అర్జున్‌రెడ్డి'ని వద్దన్నా!

తమిళ చిత్ర పరిశ్రమలో గుర్తింపు పొందిన కథానాయిక పార్వతి నాయర్. ప్రస్తుతం ఆమె పలు తమిళ సినిమాలతో బిజీగా ఉన్నారు. కాగా, రెండు సూపర్‌హిట్స్‌ను వదులుకుని, చాలా బాధపడ్డానని ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. తెలుగులో తీసిన 'అర్జున్‌రెడ్డి', తమిళ చిత్రం 'అరువి'కి తన డేట్స్ అడిగినట్లు తెలిపారు. "దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా నన్ను కలిసి కథ చెప్పారు. శ్రుతిమించిన సన్నివేశాలు ఉండటంతో అందులో నటించడానికి ఇబ్బందిగా ఫీలయ్యా.. ముద్దు సన్నివేశాలు చాలా ఉన్నాయి. హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు కొత్త వ్యక్తులని అభిప్రాయపడ్డా. అందులోనూ సినిమాలోని కొన్ని సన్నివేశాలు నాకు ఇబ్బందిగా అనిపించాయి. నేను ఈ సినిమా కథ చదివినప్పుడు చాలా సామాన్యంగా ఉంది. కానీ, అప్పుడు ఓ నూతన దర్శకుడి నైపుణ్యాన్ని గుర్తించలేకపోయా. అందుకే నేను ఆ సినిమాలో నటించేందుకు ఒప్పుకోలేదు. 'అర్జున్‌రెడ్డి' సినిమాను చూసినప్పుడు మిస్ అయ్యానే అని చాలా బాధపడ్డా. ఓ సాధారణ ప్రేమకథను ప్రభావంతంగా, భావోద్వేగాలతో తెరకెక్కించిన ఘనత సందీప్‌రెడ్డిది. ఆయన సినిమాను తీర్చిదిద్దిన తీరు నాకు చాలా నచ్చింది"."అరువి' సినిమా కోసం 2015 ఫిబ్రవరిలో నన్ను సంప్రదించారు. కథలో భాగంగా నేను గుండు చేయించుకోవాలని చెప్పారు. దీంతో వద్దు అనుకున్నా.. కానీ సినిమాలో అలాంటి సన్నివేశాలే లేవు. కథానాయిక వెంట్రుకలు ట్రిమ్ చేశారంతే, పూర్తిగా తీసేయలేదు. ఈ సినిమాను చూశా, చాలా బాగుంది. దీన్ని కూడా మిస్ అయ్యానే అనుకున్నా. ఈ సినిమాలో నటించే అవకాశం వదులుకున్నందుకు రెండు వారాలు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. 'అర్జున్‌రెడ్డి'ని మిస్సైనందుకు నెలరోజులు బాధపడ్డా. ఇలాంటి సినిమాల్లో నటించాలని ప్రతి నటి కోరుకుంటుంది. కానీ ఆ అవకాశాన్ని నేను చేతులారా వదులుకున్నా" అని ఆమె చెప్పారు.

## 7 భాషల్లో బన్నీ సినిమా?



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ తదుపరి చిత్రం నా పేరు సూర్యను ఏడు భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగుతోపాటు తమిళ్, హిందీ, మళయాళం, మరాఠీ, భోజ్‌పురి భాషల్లో ఈ చిత్రం విడుదల కాబోతోందని సమాచారం. దేశభక్తికి సంబంధించిన కంటెంట్ కావటంతో అన్ని భాషల ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకంతో నిర్మాతలు ఉన్నారని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కథా రచయిత వక్కంతం వంశీ ఈ చిత్రానికి దర్శకుడు. రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై లగడపాటి శ్రీధర్ నిర్మిస్తుండగా... నాగబాబు, బన్నీవాస్‌లు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్ కాగా, సీనియర్ నటుడు అర్జున్ ఓ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. విశాల్-శేఖర్ సంగీతం అందిస్తున్నారు. వేసవిలో ఈ చిత్రం విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



## మెగా అభిమానులకు చిరు కానుక

మెగా అభిమానుల కోసం టీజర్ రూపంలో ఓ చిరు కనుక సిద్ధం చేసింది 'రంగస్థలం' టీమ్. రామ్‌చరణ్ హీరోగా మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రంగస్థలం' టీజర్ మరో 3 రోజుల్లో (జనవరి 24 న) విడుదల చేస్తున్నామని తాజాగా ప్రకటించారు యూనిట్ సభ్యులు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ మంచి స్పందన తెచ్చుకోవడంతో టీజర్ ఎప్పుడెప్పుడు చూడాలా అనే ఆసక్తి మొదలైంది ప్రేక్షకుల్లో. పూర్తి పల్లెటూరు నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాలో చెర్రీ సరసన సమంత హీరోయిన్‌గా నటిస్తోంది. చిత్రం లో ఆది పినిశెట్టి, ప్రకాష్ రాజ్, రావు రమేష్, జగపతి బాబు, అనసూయ తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. భారీ అంచనాల నడుమ మార్చి 30వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది.



## 'పద్మావత్'కు టాక్సు మినహాయించండి

### పండిట్ విశ్వ మోహన్ భట్



**భోపాల్ :** రాజస్థాన్ ప్రభుత్వం పద్మావత్ సినిమాకు పన్నులు మినహా యించాలని భారతీయ సంస్కృతిని , ప్రత్యేకించి రాష్ట్ర సంప్రదాయాన్ని కళ్లకు కడుతుందని ప్రముఖ సంగీత కారుడు పండిట్ విశ్వమోహన్ భట్ వెల్లడించారు. జైపూర్‌కు చెందిన ఈ వీణా విద్వాంసుడు మాట్లాడుతూ సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందించిన ఈ సినిమాలో 'ఘూమర్' పాట రాజస్థాన్ జానపద సంగీతాన్ని ప్రతిబింభిస్తుందన్నారు. గత కొంతకాలంగా చరిత్రను వక్రీకరించారని, సెంటిమెంట్లకు విఘాతం కలిగించారని రాజపుత్రులకు చెందిన కర్ణిసేన ఈ సినిమా విడుదలను అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సినిమా సెట్లను రెండుసార్లు ధ్వంసం చేశారు. సుప్రీంకోర్టు భారత్ అంతటా సినిమా ప్రదర్శనకు అనుమతి నిచ్చింది. ఈనెల 25న ఈ సినిమా విడుదలకు సిద్దంగా ఉంది. ఈ క్రమంలో రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి ఈ సినమాకు పన్ను మినహాయించాలని ఆయన కోరారు. జాన పద గీతం రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలుపుతుందని, సినిమా చూడక పోయినప్పటికీ ఈసినిమాపై సదభిప్రాయం ఉందన్నారు. సంజయ్‌లీలా బన్సాలీ చాలా కాలం నుంచి తెలుసని ఆయన సినిమాలన్నీ ప్రతిభావంతంగా ఉంటాయని పద్మభూషణ్ అవార్డు గ్రహీత వెల్లడించారు. బన్సాలీ మేథావి, గొప్ప దర్శకుడని భట్ శ్లాఘించారు. ఈ సినిమాతో రాజస్థాన్ దేశ,విదేశాల్లో ప్రాచుర్యం పొందుతుందని, రాజస్థానీ సాంప్రదాయ దుస్తులతో యువతి నృత్యం మనసు దోస్తుందని ఆయన జోస్యం చెప్పారు. పద్మావత్ విడుదల వ్యతిరేకులంతా మొదట ఈ సినిమా చూసి అపోహలు తొలగించుకోవాలని భట్ కోరారు.

## కానిస్టేబుల్ కుటుంబం ఆత్మహత్య

**జైపూర్ :** రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఒక పోలీసు కానిస్టేబుల్ కుటుం బంతో ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. కానిస్టేబుల్ జెనా రామ్ (38), ఆయన సతీమణి సంతోష్ (35), కుమార్తె సుమిత్ర (22), కుమారుడు జ్ఞాపత్ (20) ఆదివారం తెల్లవారుజామున బాగ్రాసర్ గ్రామంలో తమ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందారని పోలీసులు తెలిపారు. సీనియర్ పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని, కానిస్టేబుల్ కుటుంబం ఆత్మహత్యపై దర్యాప్తు జరుపు తున్నారు. "కుటుంబం ఆత్మహత్యకు సంబంధించి ఒక నోట్‌ను అక్కడ ఉంచింది.

## పన్ను స్లాబ్‌లు, రేట్లు తగ్గింపు ?




**న్యూఢిల్లీ:** ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో ఆదాయపు పన్ను స్లాబ్‌లు, రేట్లను తగ్గించనుందని, డివిడెండ్లపై ప్రస్తుతం ఉన్న ఆదాయపు పన్ను రేట్లను యథావిధిగా కొనసాగించే అవకాశా లున్నాయని ప్రముఖ ట్యాక్స్ కన్సల్టెంట్ ఈవై ఇండియా సంస్థ చేసిన ముందస్తు బడ్జెట్ సర్వేలో వెల్లడించింది. అంతేకాకుండా ఉద్యోగులపై పన్ను భారాన్ని తగ్గించేందుకు వీలుగా ఇప్పటివరకు విధిస్తూ వస్తున్న రకరకాల పన్నుల స్థానంలో ఒక స్టాండర్డ్ డిడక్షన్ పన్ను విధానాన్ని అవలంబిస్తే బాగుంటుందని 59 శాతం మంది ఉద్యోగులు భావిస్తున్నట్లు సంస్థ నివేదికలో పేర్కొంది. జనవరిలో నిర్వహించిన ఈ సర్వేలో కేవలం ప్రజల అభిప్రాయాలు మాత్రమే కాకుండా వివిధ సంస్థలకు చెందిన సీఎఫ్‌వోలు, సీనియర్ ఆర్థికవేత్తలు అభిప్రాయాలు కూడా తీసుకున్నట్లు వెల్లడించింది.

## ప్రత్యేకత సంతరించుకోనున్న డబ్ల్యూఈఎఫ్

### నేడు దావోస్‌లో సదస్సు ప్రారంభం

**న్యూఢిల్లీ :** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో సోమవారం నుంచి ప్రారంభంకానున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) ప్రత్యేకత సంతరించుకోనున్నది. దేశ, విదేశాల్లోని రాజకీయ, పౌర, విద్య, కళారంగాలకు చెందిన 3,000 మంది పాల్గొనే ఈ సదస్సులో తొలిసారి యోగాకు చాన్స్ దక్కింది. సదస్సు సందర్భంగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు సెషన్లపాటు ప్రతినిధు లంతా యోగా చేయనున్నారు. ఈ విషయాన్ని యోగా గురు రాందేవ్ బాబా ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.

సదస్సులో అత్యధికంగా భారతదేశం తరఫున 130 మంది ప్రతినిధులు పాల్గొన నున్నారు. ఇక 20 ఏళ్ల తర్వాత ఓ భారత ప్రధాని డబ్ల్యూఈఎఫ్‌లో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే దావోస్ చేరుకున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మంగళవారం సదస్సులో ప్రసంగించనున్నారు. డబ్ల్యూఈఎఫ్ చైర్మన్ క్లాజ్ ష్వాబ్ సదస్సు ప్రారంభమైనట్లుగా సోమవారం ప్రకటన చేయనున్నారు. ఆ తర్వాత బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుక్‌ఖాన్‌ను సన్మానించ నున్నారు. ప్రతి ఏడాది ఇచ్చే క్రిస్టల్ అవార్డుల్లో భాగంగా షారుక్‌కు ఈ అరుదైన గౌరవం దక్కనుంది. సదస్సుకు తొలిసారి తెలంగాణ తరఫున మంత్రి కేటీఆర్ హాజరు కానున్నారు. జపాన్ పర్యటన పూర్తి చేసుకొని అక్కడి నుంచే ఆయన దావోస్ వెళ్లిపోయారు.

# టీబీ నియంత్రణకు చర్యలు

### ముఖ్యమంత్రులకు ప్రధాని మోడీ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** క్షయ వ్యాధి సవాలును పరిష్కరించడం అత్యవసరమని, అలాగే సవరించిన జాతీయ క్షయ వ్యాధి నిరోధక కార్యక్రమం(ఆర్ఎన్‌టీసీపీ) పురోగతిని ప్రతి త్రైమాసికానికి సమీక్షించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఒక లేఖ రాశారు. క్రియాశీలంగా కేసు గుర్తింపు, చికిత్సకు సంబంధించిన సక్సెస్ రేటు(ప్రైవేటు రంగం నుంచి సహా) కేసు నోటిఫికేషన్ వంటి కీలక పనితీరు సూచీలను నిశితంగా పరిశీలించాలని ఆయన కోరారు. అన్ని అంటువ్యాధులతోపాటు క్షయ వ్యాధి పెద్ద సంఖ్యలో ప్రాణాలు తీస్తుందని పేర్కొంటూ, ప్రతి సంవత్సరం సుమారు 29 లక్షల కొత్త క్షయ వ్యాధి కేసులు నమోదవుతున్నాయన్నారు.

ఏటా టీబీ కారణంగా మరణిస్తున్న సుమారు 4.20 లక్షల మంది ప్రజలలో అత్యధికులు పేదలేనని తెలిపారు. ఫలితంగా లక్షలాది మంది చిన్నారులు అనాథలవుతున్నారు. దేశంలో క్షయ వ్యాధి ఫలితంగా ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లితోందని ఆ లేఖలో ప్రధాని మోడీ పేర్కొన్నారు.

'ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు, చికిత్స అందుబాటులో ఉండగా ఇటు వంటి మానవ విషాదాలను మేము జరగనీయబోం' అని తెలిపారు. 2015 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించాలన్న దానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దీని కోసం నిలకడైన అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి ఐదేళ్ల ముందు 'నూతన శక్తి'తో ఆర్ఎన్‌టీసీపీ అమలు చేసిందన్నారు. టీబీ ద్వారా పొంచి ఉన్న సవాళ్ల పరిష్కారానికి సహాయపడేందుకు రోజువారీ నియమావళి, సార్వత్రిక ఔషధ సున్నితత్వ పరీక్ష, హానికారక గ్రూపులలో చురుకుగా కేసును గుర్తించడం, టీబీ, హెచ్‌ఐవీ మధ్య తేడాలను తెలుసుకోవడం వంటి అనేక కొత్త చర్యలను ఆర్ఎన్‌టీసీపీ చేపట్టిందని ఆయన వివరించారు. 'ఒక మిషన్ మోడ్‌లో ఈ సవాలును పరిష్కరించే బాధ్యత మన పై ఉంది. కనీసం ప్రతి త్రైమాసికానికి కార్యక్రమ పురోగతిని సమీక్షించాలని అభ్యర్థిస్తున్నా' అని తెలిపారు. కాగా, క్షయ వ్యాధి కుదుటపడే వరకు ఆ రోగులకు ప్రయాణ ఖర్చులు, పౌష్టికాహారం కొనుక్కొనే నిమిత్తం క్షయ రోగుల ఆదాయ స్థాయికి సంబంధం లేకుండా వారికి నెలకు రూ.500 ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వ ప్రణాళికగా ఉంది. ఈ ప్రతిపాదనను ఆర్థిక వ్యయ కమిటీ ఆమోదించిందని, మిషన్ స్టీరింగ్ గ్రూప్‌నకు పంపామని ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు అంతకుముందు తెలిపారు.

దేశవ్యాప్తంగా వ్యాధిపై పోరు సల్పేందుకు మంత్రిత్వ శాఖ ఇటీవల రోజువారీ ఔషధ నియమావళిని రూపొందించింది. నూతన చికిత్స విధానం కింద రోగులకు వారానికి మూడుసార్లుకు బదులుగా రోజూ ఒకే ఒక బిళ్లలో మూడు లేదా నాలుగు ఔషధాల మిశ్రమంగా అందిస్తారు. రోగుల శరీర బరువు ఆధారంగా ఔషధాల మోతాదు ఉంటుంది. ఇంతకు ముందు, పెద్దలందరికీ ఒకే విధంగా ఉండేది. క్షయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు కూడా ఇకపై చేదు మాత్రలు తీసుకునే అవసరం లేకుండా సులభంగా కరిగిపోయే, రుచి కలిగిన ఔషధాలను అందు బాటులోకి తీసుకు రానున్నారు. 1997 నుంచి ఆర్ఎన్‌టీసీపీ కింద రోగులకు వారంలో మూడుసార్లుగా ఔషధాలు అందజేయబడుతున్నాయి. అయితే రోజువారీ ఔషధ నియమావళి రోగులలో క్షయ వ్యాధి నివారణకు మరింత ప్రభావంతంగా పని చేస్తుందని భావిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) 2010లో టీబీ నిర్వహణ మార్గదర్శకాలను సవరించింది. ఆర్ఎన్‌టీసీపీ కింద రోజువారీ ఔషధ నియమావళిని సిఫార్సు చేసింది.

## సరిహద్దులో భద్రత కట్టుదిట్టం

**జమ్మూ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాకిస్థాన్ మద్దతు కలిగిన తీవ్రవాదులు జమ్మూ-కాశ్మీర్‌లో చొరబాటుకు ప్రయత్నాలు జరగవచ్చునని ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. దీనితో జమ్మూ-కాశ్మీర్‌లో అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వెంబడి భద్రతను కట్టుదిట్టం చేసినట్టు పోలీసులు తెలిపారు. పాకిస్థాన్‌లోని ఒక గ్రామంలో సరిహద్దు ఔట్‌పోస్టు (బీఓపీ) సమీపంలో సరిహద్దు వెంబడి ముగ్గురు, నలుగు టెర్రరిస్టుల బృందం ఉండడం కనిపించిందని, దానితో పోలీసు, భద్రతాదళాలను ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అలర్ట్ చేసినట్టు తెలిసింది. దేశంలో ఇబ్బందికరపరిస్థితులను సృష్టించి, భద్రతా దళాల క్యాంప్‌లు లక్ష్యంగా ఈ టెర్రరిస్టు గ్రూప్‌లు చొరబడే విధంగా పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ తీవ్రవాద సంస్థ ప్రయత్నిస్తోందని ఏజెన్సీ తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం, పాకిస్థాన్ దాడులకు పాల్పడడం వెనుక ప్రధాన ఉద్దేశం ఇదేనని, సరిహద్దు వెంబడి తీవ్రవాదులు తేలికగా చొరబడేందుకు సహాయపడేందుకే ఈ విధంగా చేస్తోందని జమ్మూ జోన్ ఐజీ ఎన్‌డీ సింగ్ జామ్‌వాల్ తెలిపారు. ఇంటెలిజెన్స్ ఏజెన్సీ నుంచి ఈ విధమైన హెచ్చరికలు వచ్చిన వెంటనే సరిహద్దు వెంబడి భద్రతను, నిరంతరాయంగా నిర్వహించే నిఘాను కట్టుదిట్టం చేసినట్టు తెలిపారు.

## రాష్ బీహారి బోస్‌కు నివాళి

**కోల్‌కతా :** రివల్యూషనరీ నాయకుడు రాష్ బీహారి బోస్73వ వర్థంతి సందర్భంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదివారం ఆయనకు ఘన నివాళి అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన వీరోచితంగా పోరాడారని మమత ప్రశంసించారు. ఢిల్లీ కుట్ర కేసు (బ్రిటీషు వైస్రాయ్ లార్డు హర్డింగే హత్యాయత్నం) లో బోస్ కీలకపాత్ర వహించారు. బనారస్ కుట్ర కేసు, లాహోర్‌లోని గదర్ కుట్ర కేసులో ఆయనను ఇరికించారు. "గొప్ప విప్లవకారుడు అయిన రాష్ బీహారి బోస్‌ను ఆయన వర్ధంతి సందర్భంగా గుర్తుచేసుకోవడం మన విధి" అని ట్విట్టర్‌లో మమత పేర్కొన్నారు. 1886 మే 25వ తేదీన పశ్చిమ బెంగాల్‌లోని బుర్ద్వాన్‌లో జన్మించిన బోస్ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారని ట్విట్టర్‌లో ఆమె నివాళి అర్పించారు.

## త్రిపుర లెఫ్ట్‌ఫ్రంట్ చైర్మన్ దాస్ మృతి

**కోల్‌కతా/అగర్తల :** సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, త్రిపురలోని పాలక వామపక్ష సంఘటన చైర్మన్ ఖగెన్ దాస్ (79) తీవ్ర హృద్రోగంతో ఆదివారం తెల్లవారుజామున కోల్‌కతాలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. త్రిపుర రాష్ట్ర మాజీ మంత్రి, పార్లమెంటేరియన్ అయిన బోస్ పార్టీ కేంద్ర కమిటీ సమావేశాలలో పాల్గొనేందుకు కోల్‌కతాలో ఉన్నారు. ఇక్కడి త్రిపుర భవన్‌లో తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో ఆయన ప్రాణాలు కోల్పోయారని పార్టీ నాయకులు తెలిపారు. బోస్ మృతికి సంతాప సూచంగా ఈరోజు, రేపు పార్టీ పతాకాలను అవనతం చేస్తారని సీపీఐ(ఎం) ప్రకటించింది. త్రిపురలో పార్టీకి సంబంధించిన అన్ని కార్యక్రమాలను రెండు రోజులపాటు నిలిపివేస్తున్నామని పార్టీ ప్రకటించింది. త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్, పార్టీ ఇతర నాయకులు కోల్‌కతాలో దాస్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. 1978, 1983 అసెంబ్లీ ఎన్నికలలో దాస్ మజ్లిష్‌పురా నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికయ్యారు. 1998-2002 మధ్య త్రిపుర నుంచి ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2002లో పశ్చిమ త్రిపుర నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2014 వరకు ఆ నియోజకవర్గం నుంచి ఎన్నికవుతూ వస్తున్నారు.

## లైసెన్స్ మనదే.. ఏం మాట్లాడొద్దు

### ఢిల్లీ ఫ్యాక్టరీ ప్రమాదంపై బీజేపీ మేయర్

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ మేయర్ అడ్డంగా దొరికి పోయారు. శనివారం సాయంత్రం చోటుచేసుకున్న ఫ్యాక్టరీ ప్రమాదంపై సహచరులతో రహస్యంగా మాట్లాడుతూ అసలు విషయాన్ని కక్కేశారు. వివరాల్లోకెళితే.. ఉత్తర ఢిల్లీలోని బవానాలో శనివారం ఓ బాణసంచా ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదం 17 మంది ప్రాణాలను బలి తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై నార్త్ ఢిల్లీ మేయర్, బీజేపీ నేత ప్రీతి అగర్వాల్ ఫ్యాక్టరీ చూడటానికి వచ్చి మీడియాతో మాట్లాడారు. అధికారికంగా మాట్లాడటానికి ముందు పక్కనే ఉన్న సహచరులతో రహస్యంగా ఆమె మాట్లాడారు. 'ఈ ఫ్యాక్టరీ లైసెన్స్ మన దగ్గరే ఉంది.. దీనిపై మనం ఏమీ మాట్లాడొద్దు' అని ఆమె చెప్పడం మైకులో స్పష్టంగా వినిపించింది. ఆమె మాట్లాడిన విషయాలకు సంబంధించిన ఒక వీడియోను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద కేజ్రీవాల్ రీట్వీట్ చేశారు. అయితే ఈ విషయంలో బీజేపీ మాత్రం తమ మేయర్‌ను వెనుకేసుకొచ్చింది.

అసలు ఆ వీడియోలో ఈ ఫ్యాక్టరీ అన్న పదం మాత్రమే స్పష్టంగా వినిపించిందని, అలాంటి వీడియోను పట్టుకొని బీజేపీని నిందించడం సరికాదని ఢిల్లీ బీజేపీ చీఫ్ మనోజ్ తివారీ అన్నారు. అయితే ఆ ఫ్యాక్టరీకి లైసెన్స్ ఎలా వచ్చిందో చూస్తే బీజేపీ అసలు రూపం బయటపడుతుందని ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన సత్యేంద్ర జైన్ అన్నారు. దీనిపై తాము విచారణకు ఆదేశించామని ఢిల్లీ పట్టణాభివృద్ధి మంత్రి జైన్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఫ్యాక్టరీ యజమాని మనోజ్ జైన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ప్లాస్టిక్ బాల్ తయారీ కోసమంటూ లైసెన్స్ తీసుకొని పటాకుల ప్యాకేజింగ్ కోసం వాడుతున్నట్లు తెలిసింది.



## ఎన్ఆర్ఐ పెళ్లికూతుర్లపై పరిశోధన



**న్యూఢిల్లీ:** దేశంలోని ఎన్నారై వధువులపై పరిశోధన నిర్వహించేందుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే భారత సామాజిక శాస్త్రాల పరిశోధక మండలి (ఐసీఎస్ఎస్ఆర్) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 'విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న యువకులు సొంత దేశానికి వచ్చి ఇక్కడి అమ్మాయిలను పెళ్లిళ్లు చేసుకుంటున్న సంస్కృతి పెరిగిపోయింది. కానీ వాటిలో అన్ని బంధాలు విజయవంతం అవ్వడం లేదు. చాలా సందర్భాల్లో పెళ్లికొడుకులు అమ్మాయిలను ఇక్కడే వదిలేసి వెళ్తున్నారు. లేదంటే అసంపూర్తి వివరాలు మాత్రమే చెబుతున్నారు' అని ఐసీఎస్ఎస్ఆర్ చైర్మన్ బీబీ కుమార్ తెలిపారు.

'ఇప్పటి వరకు దేశంలో ఎన్ని ఎన్నారై పెళ్లిళ్లు జరిగాయో పరిశోధన జరగలేదు. కొన్నేళ్లు గడిచిన తర్వాత ఆ బంధాల పరిస్థితి ఎలా ఉందో తెలియదు. అసంపూర్తి సమాచారంతో ఎన్నారై సంబంధాల పేరుతో మోసపోయిన అమ్మాయిలకు చివరికి ఎలాంటి న్యాయం జరిగింది? మనం కఠిన నిబంధనలు రూపొందిం చాలా? ఇలాంటివన్నీ అధ్యయనం చేయాల్సి ఉంటుంది' అని కుమార్ చెప్పారు. ఈ ప్రాజెక్టకు పరిశోధక మండలి ఇంకా ఆమోదం తెలపలేదు కానీ విషయాన్ని మాత్రం తీవ్రంగానే పరిశీలిస్తోంది. ప్రాథమిక సమా చారం లభించగానే, సాధ్యాసాధ్యాలపై ఒక అంచనాకు రాగానే ప్రాజెక్టకు ఆమోదం లభిస్తుంది. పనులు ప్రారంభం అవుతాయి అని తెలిపారు. 'ఎన్నారై పెళ్లి కొడుకులపై తల్లిదండ్రులు ఎందుకు ఆకర్షితులు అవుతున్నారు? విదేశాల్లో విలాసవంతంగా జీవించడం మినహాయిస్తే ఇంకా ఎలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు? వివరాలను ఎలా తనిఖీ చేస్తున్నారు? ఇలాంటి అంశాలన్నీ పరిశోధనలో తేలుతాయి' అని కుమార్ వెల్లడించారు.

## 2019 ఎన్నికల్లో రాహుల్ నాయకత్వంలో విజయం

### అహ్మద్‌పటేల్



**న్యూఢిల్లీ :** గుజరాత్ ఎన్నికల ఫలితాలు కార్యకర్తలకు స్ఫూర్తి నింపాయని, 2019లో జరిగే ఎన్నికల్లో రాహుల్ అధి నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ విజయం సాధిస్తామని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అహ్మద్ పటేల్ వెల్లడించారు. మోడీ స్వరాష్ట్రం గుజరాత్‌లో ఆయన హవా తగ్గించడమే కాంగ్రెస్‌కు నైతిక విజయమన్నారు. పటేల్ గతేడాది గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 182 అసెంబ్లీ స్థానాలున్న గుజరాత్‌లో జేపీ 150 సీట్లు సాధిస్తుందని అమిత్‌షా ప్రగల్భాలు పలికినా 100 సీట్లు కూడా తెచ్చుకోలేకపోయిందని పటేల్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. కాంగ్రెస్ క్రమక్రమంగా ఎదుగుతోందని, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నూతన కేడర్ రూపుదిద్దుకుం దన్నారు. ఆయనకు యువతను ఎలా వినియో గించుకోవాలో బాగా తెలుసన్నారు. సారూప్య భావాలుగల పార్టీలతో పొత్తుకు సిద్ధంగా ఉన్నా మని, దీనిపై సీనియర్ నాయకులు, అధ్యక్షుడు నిర్ణయం తీసుకుంటారన్నారు. సోనియా పార్టీపదవిని చేపట్టే సమయానికి పార్టీ పరిస్థితి దారుణంగా ఉందని అయినా ఆమె ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాహుల్ కూడా త్వరలో మరిన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడేలా చర్యలు తీసుకుంటు న్నారన్నారు. ట్రిపుల్ తలాక్‌పై మాట్లాడుతూ ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిందని, అయితే దీనిని సెలక్టు కమిటీకి పంపాలని కాంగ్రెస్ డిమాండు చేస్తుందన్నారు. పార్లమెంటును సజావుగా జరపడం లేదన్న విషయంపై మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన విషయాలను మాత్రమే పార్లమెంటులో కాంగ్రెస్ లేవనెత్తుతుందని పటేల్ సమర్థించుకున్నారు.

## వినియోగదార్ల వ్యతిరేక మోడీ సర్కారు : చిదంబరం

**న్యూఢిల్లీ:** పెట్రోలు, డీజిలు ధరల పెరుగుదల కారణంగా కోట్లాది మంది వినియోగదారులు అష్టకష్టాలు పడుతున్నారని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం చెప్పారు. వినియోగదారులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి మోడీ సర్కారు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వినియోగదారు వ్యతిరేకతతో మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఆదివారం తన ట్విటర్ వేదికగా చిదంబరం పలు అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. జీఎస్టీ పరిధిలోకి పెట్రోలు,డీజిలులను తేవాలని ఆయన చెప్పారు.తద్వారా వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు. పెట్రోలు, డీజిలు మీద విధించే పన్నుల రూపంలో భారీ మొత్తంలో సమకూరుతున్న ఆదాయాన్ని ప్రభుత్వం వృథావ్యయం చేస్తోందని ఆయన ఆక్షేపించారు. గడచిన వారం రోజుల్లో ఢిల్లీలో పెట్రోలు ధ లీటరుకు 14-15పైసలు వంతున, డీజిలు 19-20పైసలు వంతున పెరిగింది.



## ఎంపీలో ఆ గ్రామానికి విద్యుత్ కరవు

**చింద్వారా(ఎంపీ) :** సుదీర్ఘకాలం పాటు బీజేపీ పాలనలో గల మధ్యప్రదేశ్‌లోని పుతేరా దహే గ్రామం ఇప్పటికీ విద్యుత్ వెలుగులకు నోచుకోలేదు. ఈ గ్రామం కూడా చిద్వారా జిల్లా కేంద్రానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నది. దేశమంతటకీ విద్యుత్ వెలుగులు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీకి తమ పార్టీ ఏలుబడిలోని ఆ గ్రామం కనిపించకపోవడం విచారకరం. విద్యుత్ కోసం ఆ గ్రామస్తులు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారు. ఆ ప్రాంతంలో 15 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఆ గ్రామానికి విద్యుత్ ఒక్కటే కాదు...రోడ్ల సదుపాయం లేదు. తాగునీటి సరఫరా లేదు. సమాజానికి దూరంగా ఆ గ్రామం నిలిచిపోయింది. కనీస సదుపాయాలేవీ ఆ గ్రామానికి లేవు. విద్యుత్, సరైన రోడ్లు లేని కారణంగా తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పాఠశాలకు వెళ్లాలంటే రోజూ 8 కిలోమీటర్లు నడవాల్సి వస్తున్నదని, చదువు కోవడానికి తాము చమురు దీపాలు ఉపయోగించుకుంటున్నామని స్థానిక విద్యార్థులు ఆవేదనతో చెప్పారు. తమ సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు గ్రామస్తులు విన్నవించుకుంటున్నారు. తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందిగా ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేశామని స్థానికులు చెప్పారు. అయినా తమను పట్టించుకున్న పాపానపోలేదని ఆవేదన చెందారు. ఆశ్చర్యమేమంటే...సౌభాగ్య యోజన కింద 2018 నాటికి దేశమంతా నూటికి నూరు శాతం విద్యుత్ అందిస్తామని కేంద్రం పదేపదే చెబుతోంది. మరి తమ ఏలుబడిలోని గ్రామానికి కనీసం బల్బు కూడా లేకపోవడాన్ని ఎలా చెప్పుకుంటుందో వేచిచూడాలి.

## ప్రధాన నగరాల స్కూళ్లలో సీఐఎస్ఎఫ్ భద్రతా కసరత్తు ప్రారంభం



**న్యూఢిల్లీ :** గుర్‌గావ్ వంటి విద్యార్థి హత్య ఘటనలు మరే ఇతర విద్యా సంస్థలలో చోటుచేసుకోకుండా ముంబై, కోల్‌కతా, హైదరాబాద్‌ల్లోని కొన్ని ప్రధాన విద్యా సంస్థల్లో భద్రతాపరమైన తనిఖీని కేంద్ర సాయుధ దళం (సీఐఎస్ఎఫ్) ప్రారంభించింది. పాఠశాలలకు భద్రతా పరమైన సలహాలు అందించాలని ప్రతిపాదించిన రెండు నెలల తర్వాత ఈ మేరకు భారీ కసరత్తు చేపట్టింది. దేశంలోని ప్రధాన పౌర విమానాశ్రయాలకు రక్షణగా ఉంటున్న కేంద్ర సాయుధ దళం ప్రత్యేక భద్రతా సలహా విభాగాన్ని కలిగి ఉంది. ఇందుకు సంబంధించిన సేవలకు గాను కొన్ని పాఠశాలల నుంచి ప్రభుత్వ రుసుముగా రూ.15 లక్షలు వసూలు చేసింది. పాఠశా లకు సగటున సుమారు రూ.4 లక్షల వరకు సలహా రుసుముగా ఉంది. కోల్‌కతాలోని సెయింట్ గ్జేవియర్, హైదరాబాద్‌లోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్స్, ముంబైలోని పోదార్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్‌లకు భద్రతాపరమైన పరిష్కారాలను అందించేందుకు ప్రత్యేక నిపుణుల బృందం పని ప్రారంభించినట్లుగా సీఐఎస్ఎఫ్ బ్లూప్రింట్ తెలియజేస్తోంది. ఇందుకు కోసం ప్రత్యేక అధికారుల బోర్డును నియమించారు. వీరు పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది భద్రత కోసం గట్టి భద్రతా ప్రణాళికను నిర్వహిస్తారు. 'దేశంలోని మరో ఐదు పాఠశాలలు వారి తుది ఆమోదాలను పంపించాయి. ఆయా పాఠశాలల్లో కూడా తమ నిపుణుల బృందం త్వరలో పని ప్రారంభిస్తుంది' అని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ విషయమై సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్(డీజీ) ఒ.పి.సింగ్ మాట్లాడుతూ గత ఏడాది నవంబరులో తొలిసారిగా ఈ ప్రతిపాదన వచ్చిందన్నారు. దీనిపై మంచి, సానుకూల స్పందన లభించినట్లు చెప్పారు. 'సమాజంలో మన బాధ్యతలో భాగంగా ఈ చొరవ తీసుకున్నట్లుగా నేను ముందే చెప్పాను. మా వృత్తిపరమైన సేవలను మరింత విస్తరించడం మాకు ఎప్పుడూ సంతోషకరమే' అని సింగ్ అన్నారు. దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 36 పాఠశాలలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ దళం ప్రాధాన్యత ప్రకారం వర్గీకరించబడిందన్నారు. విద్యార్థులకు భద్రత, సురక్షిత వాతావరణం సృష్టించేందుకు సహాయపడతామంటూ దేశంలోని అనేక పాఠశాలలకు సీఐఎస్ఎఫ్ గత ఏడాది లేఖలు రాసింది. 2017, సెప్టెంబరులో గుర్‌గావ్‌లోని రేయాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 2వ తరగతి విద్యార్థి పాఠశాల మరుగుదొడ్డిలో హత్యకు గురైన నేపథ్యంలో సీఐఎస్ఎఫ్ పాఠశాలల భద్రతకు జాతీయ స్థాయిలో కసరత్తు ప్రారంభించారు. 'పాఠశాలల్లో చిన్నారులు తమ జీవితాలను కోల్పోవడం బాధాకరం. ప్రతి చిన్నారికి సురక్షిత, ఆరోగ్యకర వాతావరణం కల్పించేందుకు మీరు అంగీకరిస్తారు' అని పాఠశాలలకు రాసిన లేఖలో సీఐఎస్ఎఫ్ పేర్కొంది. పాఠశాలల్లో ఎక్కడ భద్రతా సిబ్బందిని మోహరించాలి, తమ సిబ్బందికి భద్రతపరమైన శిక్షణ ఎలా ఇవ్వాలి, అత్యవసర స్పందన పరికరాల ఏర్పాటు, ఎక్కడ సీసీటీవీ కెమేరాలు ఏర్పాటు చేయాలనే విషయాలపై పాఠశాలలకు సీఐఎస్ఎఫ్ భద్రతా తనిఖీ నిపుణులు సలహా ఇస్తారు. హైదరాబాద్‌లోని జాతీయ పోలీసు అకాడమీ, ఆర్‌బీఐ, ఐఐఎంలు, ఐఐటీలతో సహా 150కి పైగా సంస్థలతో సీఐఎస్ఎఫ్ తన సేవలను పంచుకుంటోంది.



## 27న అనంతపురంలో గిరిజనుల శంఖారావం

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : వాల్మీకి బోయలను ఆదివాసి (ఎస్టీ) జాబితాలో చేర్చాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం దుర్మార్గమైన చర్య అని, తక్షణం ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27వ తేదీన అనంతపురంలో గిరిజనుల శంఖారావం నిర్వహిస్తున్నామని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని ఒక హోటల్‌లో ఆదివారం శంఖారావం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న బోయలను బీసీ జాబితా నుండి ఎస్టీ జాబితాలో చేర్చుతామని చెప్పడం దారుణమన్నారు. 500 జనాభా కలిగిన గిరిజన తండాలను గ్రామాలుగాను, గూడేలను ప్రత్యేక పంచాయతీలుగాను చేసి స్వయం ప్రతిపత్తి కల్పిస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు శూన్యం అన్నారు. పెరిగిన గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి అనేక సమస్యలను పరిష్కరించకుండా బోయలను ఎస్టీల జాబితాలో చేర్చడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వలన తమకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ నెల 27వ తేదీన అనంతపురంలో గిరిజనుల శంఖారావం నిర్వహిస్తున్నామని, గిరిజనులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.మల్లికార్జున నాయక్, బి.సుధాకర్ నాయక్, ఎ.రమణ, ఆర్.రామానాయక్, కె.రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.









## 1న కలెక్టర్లకు న్యాయవాదుల వినతిపత్రాలు

విశాలాంధ్ర - గుంటూరు సిటీ : రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 1వ తేదీన అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పల్లపు కృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరు అరండల్‌పేటలోని విశ్వబ్రాహ్మణ సమాజంలో అసోసియేషన్ 13 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలు, అభివృద్ధి, సంక్షేమంపై ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. అనంతరం పల్లపు కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని న్యాయవాదులందరికి డెత్ బెనిఫిట్‌ను రూ.10 లక్షల వరకు పెంచాలని, అర్హత కలిగిన న్యాయవాదులందరికి ఇళ్ళ స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ నెలకు రూ.5 వేలు చొప్పున మూడు సంవత్సరాలు మంజూరు చేయాలన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ పరంగా నియమించే 'లా' ఆఫీసర్ల నియామకాలలో, హైకోర్టులో నియమించే స్టాండింగ్ కౌన్సిల్‌లో రిజర్వేషన్ విధానాన్ని పాటించాలన్నారు. రాజధాని అమరావతిలో హైకోర్టు పరిధిలో బీసీ న్యాయవాదుల వసతి భవనానికి స్థలం కేటాయించాలని, న్యాయవాదుల పిల్లలకు ప్రైవేటు స్కూళ్ల ఫీజులలో 50 శాతం రాయితీ కల్పించాలన్నారు. న్యాయవాదుల సమస్యలపై ఫిబ్రవరి నెలాఖరున మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తామని, మార్చి నెలలో 13 జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ఒక రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పోకల వెంకటేశ్వర్లు, టి.వేణుగోపాల్, ఏ.వేణుగోపాల్ కృష్ణ, గౌరవ సలహాదారులు నక్కా శీనయ్య, కార్యదర్శులు శివప్రసాద్, సయ్యద్ బాబు, రాజేంద్రప్రసాద్, రాయలసీమ ఇన్‌ఛార్జీ త్రిమూర్తి, గుంటూరు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, కార్యదర్శి కె.వీరభాస్కర్ పాల్గొన్నారు.



# వీఎంఆర్డీఏ అయ్యేనా?

- ఉడా వ్యవస్థ మార్పు ప్రకటనలకేనా...
- ఓ వైపు లేని ఉద్యోగాల సృష్టి
- రిటైర్ అయ్యేవారితో సైతం నియామకాలు
- ఉద్యోగుల్లో గందరగోళం



విశాలాంధ్ర - విశాఖ సిటీ : విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వుడా) పరిధి విస్తరించడం, బాధ్యతలు పెరగడం, సేవలు ఎక్కువ కావడంతో ప్రస్తుత ఉద్యోగులతో పాటు కొత్త ఉద్యోగాలు సృష్టించి బయటి వ్యక్తులను నియామకం చేసుకుంటున్నారు. ఆయా రంగాల్లో నైపుణ్యం ఉన్నందున నియమిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియతో వుడా ఉద్యోగుల్లో గందరగోళం నెలకొంది. వుడాను విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ)గా మార్పుచేస్తామంటూ పదేపదే ప్రకటించడం, ఆ సంస్థకు వైస్‌చైర్మన్‌తోపాటు తానే చైర్మన్‌గా వ్యవహరిస్తానంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించి ఏళ్లు గడిచిపోతున్నాయి. వుడాలోని కొందరు ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు వెలుగుచూడటం, వుడా కార్యాలయంతో రియల్ ఎస్టేట్ రంగానికి ఎక్కువ లావాదేవీలు ఉండడంతో ఆయా వర్గాల ప్రతినిధులు ముఖ్యమంత్రి ప్రకటనపై సంతోషం వ్యక్తం చేశారు. కానీ తదనంతర పరిణామాలను గమనిస్తుంటే ఇప్పట్లో వీఎంఆర్డీఏ ఏర్పాటు జరిగేలా లేదనేది స్పష్టమవుతోంది.

**కొత్త నియామకాలు**

విశాఖ నగరాభివృద్ధి సంస్థ లే అవుట్లు, ప్లాట్ల వేలం మాత్రం కాకుండా నగరంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఇతర బాధ్యతలు చూడాల్సిరావడంతో సంస్థ సేవలు కీలకంగా మారాయి. దీంతో ఆయారంగాల్లో నిపుణులు, అనుభవజ్ఞుల సేవలు అవసరమయ్యాయి. ఎల్ఆర్ఎస్, వుడా ల్యాండ్ బ్యాంక్, కొత్త ప్రాజెక్టులు, రెవెన్యూ వ్యవహారాలు, ఇంజనీరింగ్ విభాగాల్లోకి ఇతర అధికారులను డిప్యూటేషన్‌పై నియామకాలు చేస్తున్నారు. సీయూపీగా కూడా అధికారిని నియమించారు. మొత్తం వ్యవస్థనే మార్చేస్తాం, వీఎంఆర్డీఏగా రూపొందిస్తామనే ప్రకటనలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తరహా కొత్త నియామకాలు ఎందుకనే సందేహాలు వుడా ఉద్యోగుల్లో చర్చనీయాంశమయ్యాయి.

**వీఎంఆర్డీఏ చైర్మన్‌గా సీఎం విముఖత**

వుడాను విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీగా మార్పుచేసి తానే చైర్మన్‌గా కొనసాగుతానని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ బాధ్యతల స్వీకరణకు విముఖత వ్యక్తం చేసినట్లు వుడా వర్గాల మాట. భూములు, లేఅవుట్లు, ప్లాట్లు లాంటి వ్యవహారాలు ఎక్కువ ఉండే సంస్థ కావడంతో సీఎం బాధ్యతలు తీసుకునేందుకు పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది.

భూముల వ్యవహా రంలో చిక్కులు, అవినీతి ఆరోపణలు, న్యాయస్థానాల్లో కేసులు లాంటివి ఉండటంతో వెనకడుగు వేసి ఉండవచ్చనే వాదన వినిపిస్తోంది. మరొకరికి చైర్మన్ అవకాశం కల్పించవచ్చనేది మరికొందరి వాదన. ఈ పరిణామాలు, నియామకాల నేపథ్యంలో వీఎంఆర్డీఏగా మారుస్తారా లేదా వుడాను యథావిధిగా ఉంచుతారో ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాల్సి ఉందని పలువురు కోరుతున్నారు.

## టెట్‌కు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - గుంటూరు (కార్పొరేషన్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో పని చేస్తున్న సీఈడీఎం (మైనార్టీ విద్యా అభివృద్ధి కేంద్రం) ద్వారా ఏపీ టెట్-2018కు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులకు 15 నుంచి 20 రోజుల పాటు ఉచిత శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ప్రభుత్వ విప్ ఎం.ఎ.షరీఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు కింద తెలిపిన జిల్లాల్లో శిక్షణా తరగతులు జరుగుతున్నాయన్నారు. విశాఖపట్నంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలోని గాయత్రి అకాడమీలో ఒకటి, స్టీల్‌ప్లాంట్ దగ్గర ఇస్లాంపేటలో రెండవది సుధాకర్- 9392505662). గుంటూరు జిల్లా పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కాలేజీలో ఒక కేంద్రం ( పద్మావతి - 9885461353), కర్నూలు జిల్లా ఉస్మానియా కాలేజీలో ఒక కేంద్రం ( మహబూబ్ - 9494555961), కడప జిల్లా ప్రొదుటూరులోని మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో ఒక కేంద్రం అల్తాఫ్ - 9290 085535), అనంతపురం జిల్లా కదిరిలో వలీ సాహెబ్ రోడ్డులోని సీఈడీ ఎం స్టడీ సెంటర్‌లో ఒక కేంద్రం (అబ్దుల్ మాలిక్ - అవెన్యూ రోడ్డులో మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో ఒక కేంద్రం (93933 15343), ప్రకాశం జిల్లా కంభంలో గవర్న మెంట్ హైస్కూల్‌లో ఒక కేంద్రం (అబ్దుల్ సత్తార్ - 9966134739), 20 కి.మీ. దాటి దూర ప్రాంతం నుంచి వచ్చిన అభ్యర్థులకు స్టైఫండ్ కింద రూ.1500 మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వారు చెల్లిస్తారన్నారు. పూర్తి వివరాలకు సీఈడీఎం, భవానీపురం, విజయవాడ వారిని సంప్రదించాలన్నారు. ఫోన్‌నెం. 0866-2970567, మొబైల్ నెం. 9705405278 (ఏఓ)ను సంప్రదించాలి.

# రైల్వేజోన్‌పై వీడని ఆశలు

- రూ.400 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదన
- విశాఖ ఎంపీ హరిబాబు పనితీరుపై జనాగ్రహం

విశాలాంధ్ర - విశాఖ : కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధమవుతున్న తరుణంలో విశాఖ రైల్వేజోన్ అంశం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ప్రతి బడ్జెట్‌లోనూ జోన్‌పై స్పష్టమైన ప్రక టన వస్తుందని ఉత్తరాంధ్రవాసులు ఆశగా ఎదురు చూస్తున్నప్పటికీ అది కలగానే మిగిలిపోతున్నది. బడ్జెట్‌లో విశాఖకు అరకొర కేటాయింపులతోనే పాలకులు సరిపెడుతున్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతి నిధుల నిర్లక్ష్యం వల్లే ప్రతిసారి జోన్ ప్రతిపాదన పక్కకు వెళ్తుందనే విమర్శలు ఉన్నాయి. ఈసారి రైల్వేబడ్జెట్‌కు విశాఖ రైల్వే డివిజన్ నుంచి రూ.400 కోట్లతో ప్రతిపాదనలు వెళ్లినట్టు సమాచారం. మెకానికల్, సివిల్ సిగ్నల్ వ్యవస్థ ఆధునీకీకరణ, ఇతర పనులకు సంబంధించి ప్రతిపాదనను రైల్వే శాఖకు పంపినట్టు తెలుస్తోంది. గతంలో పంపిన ప్రతిపాదనలూ కాగితాలకే పరిమితం కావడంతో కొత్త ప్రతిపాదనలపై చర్చ సాగుతోంది. రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యులతో ఇటీవల విజయ వాడలో రైల్వే జనరల్ మేనేజర్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలోనూ రైల్వేజోన్ అంశం ప్రస్తావన వచ్చింది. బడ్జెట్ తయారవుతున్న తరుణంలో ఈ సమావేశాలు ఎందుకంటూ ఎంపీలంతా ఆగ్రహం వ్యక్తం చేయడంపైనా చర్చ కొనసాగుతోంది. విశాఖ పార్లమెంటు సభ్యుడు, బీజేపీ నేత కంభంపాటి హరిబాబు పనితీరుపై ప్రజలతో పాటు ప్రజాప్రతి నిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గవర్నర్‌ను మార్చాలంటూ ఇటీవల ఆయన కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. పోలవరం ప్రాజెక్టు ప్రధాన కార్యాలయం రాజ మహేంద్ర వరంలో ఏర్పా టు చేయాలని కేంద్రా నికి మరో లేఖ పంపారు. రైల్వేజోన్‌తోపాటు ప్రజాప్రయోజనాలను పక్కనపెట్టి ఆయన ఇతర సమస్యలపై లేఖలు రాయడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణం లో ఉనికిని చాటుకునేందుకు ఇలా వ్యవ హరిస్తు న్నారని ఆరోపిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనుల కేటాయింపు, డీసీఐ ప్రైవేటీకరణ పై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడంపైనా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## జాతీయ పూల్‌తో సర్వీసు వైద్యులకు తీవ్ర నష్టం

- 25న నల్ల బ్యాడ్జీలతో విధులు, 31న ఓపీలు బాయ్‌కాట్
- దక్షిణ భారత ప్రభుత్వ వైద్యుల సంఘం వెల్లడి

విశాలాంధ్ర - విజయవాడ (లబ్బీపేట) : ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తూ ప్రజలకు ఎంతో సేవచేస్తున్న వైద్యులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా సీట్లలో 50 శాతం కేటాయించాలని దక్షిణభారత ప్రభుత్వ వైద్యుల సంఘం కన్వీనర్ డాక్టర్ డి.జయధీర్ డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటకలు నీట్ పరీక్ష ద్వారా పీజీ, డిప్లొమో సీట్ల భర్తీకి నేషనల్ పూల్‌లోకి వెళ్ళేందుకు నిర్ణయించడంతో సర్వీసు వైద్యులకు జరుగుతున్న నష్టంపై చర్చించేందుకు విజయవాడలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ, తమిళనాడులకు చెందిన ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను డాక్టర్ డి.జయధీర్ మీడియా ప్రతినిధులకు వివరించారు. ప్రస్తుతం పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా సీట్లలో 30 శాతం సర్వీసు వైద్యులకు కేటాయిస్తున్నారని, రాష్ట్రాలు నేషనల్ పూల్‌లోకి వెళ్ళడం ద్వారా అవి 15 శాతం తగ్గిపోనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సర్వీసు వైద్యులకు సంబంధించి ఫలితాలు సెపరేట్‌గా విడుదల చేయాలని, నెగిటివ్ మార్కులను రద్దు చేయాలని వారు డిమాండు చేశారు. ఈ విషయంలో స్పందించకపోతే దశల వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ ప్రభుత్వాలు సర్వీసు వైద్యులకు నష్టం కలిగించేలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25న నల్ల బ్యాడ్జిలు ధరించి విధులు నిర్వహిసామని, 31న అవుట్ పేషంట్ సేవలను బాయ్‌కాట్ చేయాలని నిర్ణయించినట్లు జయధీర్ వెల్లడించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధి డాక్టర్ పి.ప్రవీణ్, తమిళనాడు ప్రతినిధి డాక్టర్ జె.కతిర్‌వేల్, కర్నాటక ప్రతినిధి డాక్టర్ రంగనాథన్, కేరళ ప్రతినిధి డాక్టర్ శ్యామ్‌సుందర్‌లు పాల్గొన్నారు.



## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర- అనంతపురము (అర్బన్) : ఎన్నికల హామీ మేరకు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబును రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పస్నీటి కాశయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రజక సంఘం జిల్లా ప్రతినిధుల సమావేశం ఆదివారం తెలికె ఆంజినేయులు అధ్యక్షతన నిర్వ హించారు. ముఖ్య అతిథిగా కాశయ్య మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. కడప నుంచి హైదరాబాద్ వరకు 2006లో దాదాపు 450 కి.మీ. పాదయాత్ర కూడా చేశామ న్నారు. 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా ఇచ్చిన హామీని నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రజక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా కోగిరి కేశవ, అధ్యక్షులుగా ప్లాట్ల క్రిష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సి.విరూపాక్షి, ఉపాధ్య క్షులుగా గంగన్న, శ్రీరాములు, సుబ్రమణ్యం, ఆంజినేయులు, కార్యదర్శులుగా సురేష్, ఆనంద్, సాయికుమార్, సంయుక్త కార్యదర్శులుగా పవన్, జాని, ఎర్రి స్వామి, రామాంజినేయులు, బాలు, ప్రచార కార్యదర్శులుగా లింగమయ్య, ప్రభాకర్, అశోక్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రజకులు పాల్గొన్నారు.





## ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



విశాలాంధ్ర - ఏలూరు : పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరులోని గ్రాండ్ ఆర్య హోటల్‌లో ఇంజినీరింగ్ విద్యార్థి ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. త్రీటౌన్ ఎస్ఐ పైడిబాబు కథనం ప్రకారం గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన ఎంఎస్‌వీవీ కృష్ణ (22) ఏలూరుకు సమీపంలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువు తున్నాడు. ఆదివారం గ్రాండ్ ఆర్య హోటల్‌లో రూమ్‌ను అద్దెకు తీసుకుని నైలాన్ తాడుతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హోటల్ యాజమాన్యం సమాచారాన్ని పోలీసులకు అందించారు. కృష్ణ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నిల్వ మాంసాన్ని విక్రయిస్తే చర్యలు

విశాలాంధ్ర - కర్నూలు (సిటీ) : ఫ్రిజ్‌లలో నిలువ ఉంచిన మాంసంతో ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని, ఇలాంటి మాంసాన్ని విక్రయించేవారి పై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర మాంసం ఉత్పత్తుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చంద్రదండు ప్రకాష్ నాయుడు హెచ్చరించారు. నగరంలోని మాంసం దుకాణాలలో ఆదివారం ఆయన తనిఖీలు చేశారు. మద్దూర్‌నగర్, సీ క్యాంపు, కల్లూరు, నంద్యాల చెక్‌పోస్టు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.

## పని వత్తిడి తగ్గించాలి : ప్రసాద్



విశాలాంధ్ర-గుంటూరు జిల్లాపరిషత్: పంచాయతీ కార్యదర్శులపై పని వత్తిడి తగ్గించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్ డిమాండు చేశారు. పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సంఘం రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏ కొత్త పని సంకల్పించినా గ్రామ పంచాయతీకి బదలాయిస్తున్నారని, ఆ పని ఎన్ని రోజులు పడుతుందో, ఎంత సమస్యాత్మకమైనదో, దాంట్లో ఆర్థిక అంశాలు ఇమిడి ఉన్నాయా లేదా అని ఆలోచించకుండా పంచాయతీ మీదకు నెట్టివేస్తున్నారన్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులపై పనిభారంతో పాటు ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పంచాయతీ కార్యాలయాల్లో సిబ్బంది ఉండేవాళ్లని, వాళ్ల పదవీ విరమణ అనంతరం కొత్తవాళ్లను తీసుకోలేదని, ఉన్న వాళ్లకు పదోన్నతి కల్పించకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై పని భారం పడుతుందని అన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయడానికి రాత్రి పగలు పనిచేస్తున్నా, ఉన్నతాధికారుల వేధింపులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని, పదోన్నతులకు అర్హుల జాబితాను పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం నుండి వెంటనే పంపించాలని డిమాండు చేశారు. 5వ విడత జన్మభూమిలో అన్ని పనులూ పంచాయతీ కార్యదర్శులే నిర్వహించినప్పటికీ ఒక్క అధికారీ వారిని ప్రశంసించినది లేదని అన్నారు. అవార్డులేమో అధికారులకు, పనిభారమేమో పంచాయతీ కార్యదర్శులకని వాపోయారు. తమ సమస్యలపై ప్రభుత్వ తక్షణం స్పందించాలని, లేకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు జీటీవీ రమణ, కె.వెంకటాద్రి, వై.హేమంత్‌కుమార్‌రెడ్డి, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## సోషలిస్టు సమాజంతోనే శాంతి-సౌఖ్యం

### ఈడ్పుగంటి నాగేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ : ప్రపంచ మానవాళికి శాంతి - సౌఖ్యం, అభివృద్ధి, సోషలిస్టు సమాజంతోనే సాధ్యమని రష్యా, చైనా వంటి దేశాలు రుజువు చేశాయని సీపీఐ జాతీయ సమితి కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు అన్నారు. ప్రప్రథమ సోషలిస్టు రాజ్య వ్యవస్థాపకులు వ్లాదిమిరో ఇర్విచ్ లెనిన్ 94వ జయంతిని ఆదివారం నిర్వహించారు. నగరంలోని లెనిన్ కూడలిలోని విగ్రహం వద్ద పూల దండలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1917 రష్యా విప్లవ పోరాటం లెనిన్ నాయకత్వం నాంది అయ్యిందని, సోవియట్, చైనా భారతదేశాల్లో పది మందితో ప్రారంభమైన విప్లవం పలువురిని ఆకర్షించిం దన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది కమ్యునిస్టులు ఉన్నారని వివరించారు. రాజరికం, సామ్రాజ్యవాద దేశాల్లో దోపిడీ, అణచివేత సాగుతోందని, బ్రిటన్, అమెరికా వంటి దేశాలు తమ పెత్తనాన్ని కొనసాగిస్తున్నాయని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి. కాశీనాథ్ మాట్లాడుతూ బీజేపీ పాలకులు మతోన్మాద వైఖరిని, హిందూత్వ ఆర్‌ఎస్‌ఎస్‌భావాలను ప్రజలపై రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారిని, రచయితలను, హేతువాదులను హత్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల కాలంలో దళితులపై దాడులు పెరిగాయని ఈ క్రమంలో మెరుగైన సమాజం కోసం ప్రగతి శీల శక్తులు ఐక్యం కావాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కే రామారావు మాట్లాడుతూ చంద్రబాబు పాలన నిరంకుశంగా మారిందని, ప్రపంచ బ్యాంకుతో ఒప్పందాలు చేసుకుని ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌డీఐ పేరుతో ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తోందన్నారు. ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు అక్కినేని చంద్రరావు, సీపీఎం జిల్లా నాయకులు ఎం విష్ణువర్ధన్, సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, నాయకులు పల్లా సుబ్బారావు, శాంతి సంఘం నాయకుల డాక్టర్ వి రాంప్రసాద్, ఇప్టఫ్ నాయకులు జమిందార్, సీపీఐ నాయకులు నక్కా వీరబద్రరావు, పి దుర్గాంబ, ఓర్సు భారతి, శాంతిసంఘం నాయకులు మోతుకూరి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి గాయకులు ఆర్ పిచ్చియ్య అభ్యుదయ గీతాలు ఆలపించారు. సీపీఎం నాయకులు వీవీ రామరాజు, జి నారాయణ, వెల్లంకి కృష్ణమోహన్ వామపక్ష శ్రేణులు పాల్గొన్నారు.

## శాస్త్ర విజ్ఞాన సమాజాన్ని అవమానిస్తున్న బీజేపీ మంత్రి

### ప్రముఖుల విమర్శ

న్యూఢిల్లీ: విఖ్యాత శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన పరిణామ సిద్ధాంతాన్ని తప్పుపడుతూ కేంద్ర విద్యా మంత్రి సత్యపాల్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై భారత్ ప్రముఖ శాస్త్రవేత్తలు, శాస్త్రవిజ్ఞానాభిలాషులు తీవ్రంగా విమర్శించారు. సత్యపాల్ వ్యాఖ్యలు మొత్తం శాస్త్ర విజ్ఞాన సమాజాన్నే అవమానించేలా ఉన్నాయని ప్రముఖ శాస్త్రవేత్తలు ధ్వజమెత్తారు. శాస్త్రం(సైన్స్) పట్లా, శాస్త్రీయ (సైంటిఫిక్) దృక్పథం పట్లా సత్యపాల్‌క రవంత కూడా అవగాహన లేదని, కనీస గౌరవాన్నీ పాటించక పోవడం విచారకరమని భారత జాతీయ సైన్స్ అకాడమీ (ఇన్సా) మాజీ అధ్యక్షుడు రాఘవేంద్ర గదాగ్కర్ అన్నారు. శాస్త్ర, శాస్త్రీయ దృక్పథాన్ని విచ్ఛిన్నం చేయాలన్న దుష్టతలపు మంత్రి మాటల్లో దాగుందన్నారు. శాస్త్ర విజ్ఞాన ప్రపంచానికి పెనుముప్పుగా పరిణవించిన ఈ దుష్టతలపు పట్ల సదా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. బయోకాన్ అధిపతి కిరణ్ మజుందార్ మాట్లాడుతూ మంత్రిత్వశాఖకూ తలవంపులు తెచ్చే విధంగా విద్యామంత్రి సత్యపాల్ ప్రకటన ఉందన్నారు. సత్యపాల్ ఇలాంటి విచక్షణా రహిత ప్రకటనలు చేయడం ఇదే మొదటి సారి కాదని కేంద్ర పర్యావరణ శాఖ మాజీ మంత్రి జైరాం రమేష్ అన్నారు. తన సహచర మంత్రి చేసిన అనుచిత ప్రకటన పట్ల ప్రధాని మోడీ కించిత్తు విచారం చెందిన దాఖలాలు కనిపించడం లేదన్నారు.

# హోదాపై బాబు మళ్లీ మోసం

### సాధన సమితి నేతలు రామకృష్ణ, శ్రీనివాస్, శివాజీ విమర్శ



విశాలాంధ్రబ్యూరో - హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోదా ఇవ్వడంలో ప్రధాని నరేంద్రమోడి ఘోరంగా వైఫల్యం చెందారని, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి విమర్శించింది. హోదా సాధన కోసం సుప్రీం కోర్టుకు వెళతామని చంద్రబాబు ప్రకటించి ఆంధ్రప్రదేశ్ ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారని విమర్శించారు. హోదాపై చంద్రబాబుకు చిత్తశుద్ధి వుంటే అఖిలపక్ష బృందాన్ని డిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండు చేసింది. ప్రత్యేక హోదా, విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలు కోసం అన్ని రాజకీయ పక్షాలతో సోమవారం ఉదయం 11గంటలకు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సమితి నాయకులు వెల్లడించారు. అదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శి, ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ గత మూడేళ్ళుగా విభజన హామీల అమలు కోసం, హోదా ఇవ్వాలని డిమాండు చేస్తూ పెద్దఎత్తున ఉద్యమిస్తున్నా కేంద్ర ప్రభుత్వం లేదా ముఖ్యమంత్రి స్పందించడం లేదన్నారు. వెంకయ్య నాయుడు, చంద్రబాబునాయుడు విభజన చట్టంలో ఇచ్చిన హామీలను సాధించడంలో విఫలమయ్యారని అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నాబార్డు నిధులు తీసుకున్నారని మరి కేంద్రం నిధులు ఇవ్వకుండా ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న టీడీపీ మంత్రులు కేబినెట్ నుండి వైదొలగాలని డిమాండు చేశారు. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు రాష్ట్రానికి ప్రత్యేక గవర్నరు కావాలని కోరుతున్నారు తప్ప ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం నిధులు, విశాఖ రైల్వే జోన్ గురించి ప్రధానిపై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని నిలదీశారు. కొణతల రామకృష్ణ చేస్తున్న అందోళనలకు రామకృష్ణ సంఘీభావం ప్రకటించారు. సాధన సమితి అధ్యక్షులు చలసానిశ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీలకై పార్లమెంట్, ప్రధాన నరేంద్రమోడీ ఇంటి ముట్టడి, పాదయాత్ర, అమరణనిరాహారదీక్ష వంటి అందోళన కార్యక్రమాలు చేసినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివరించేందుకు ఈ నెలాఖరు నుండి అన్ని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లామన్నారు. ఆంధ్రప్రదేశ్ మీదుగా బుల్లెటు రైలు ప్రయాణించాల్సి వుండగా అది గుజరాత్‌కు తీసుకెళ్ళి 70వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు రూ.50కోట్లు ఇస్తే సరిపోతుందా అని విమర్శించారు. కులాన్ని, మతాన్ని రెచ్చగొట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సాధన సమితి నాయకులు, నటుడు శివాజి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు కర్ణాటక, ఒడిసాలో వున్న తెలుగు ప్రజలు బీజేపీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పాలకుల చేతకానితనం వల్లనే అన్యాయం జరుగుతున్నదన్నారు. సాధన సమితి నాయకులు ప్రొ.విశ్వనాథ్, శ్రీనివాస్ మాట్లాడుతూ హోదా సాధించే వరకు తమ పోరాటం అగదని అన్నారు. ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షులు అమిత్‌షా ఏపి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.



## రాజకీయ, న్యాయవ్యవస్థలపై సడలిన నమ్మకం

కె.శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర-కదిరి (అనంతపురం): ప్రజలకు రాజకీయ, న్యాయవ్యవస్థలపై నమ్మకం పోయిందని, ఇపుడు ప్రజలు మీడియాను నమ్ముతున్నారని, ప్రజలకు-సమాజానికి మంచి చేసేవిధంగా మీడియాపాత్ర ఉండాలని ఐజేయూ మాజీ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కదిరిలో ఏపీయూడబ్ల్యూజే వజ్రోత్సవ మహాసభ జరిగింది. వజ్రోత్సవ మహాసభకు ఐఏయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజినేయులు, కార్యదర్శి నరేంద్రరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, ఐవీ సుబ్బారావు, ఎలక్ట్రానిక్ మీడియా అసోషియేషన్ అధ్యక్షులు చందూ జనార్ధన్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ సోమసుందర్ హాజరయ్యారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ, న్యాయవ్యవస్థలు ప్రభుత్వాలకు కొమ్ముకాస్తున్నాయని, పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగేవిధంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు.

జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రత్యేకచట్టం తీసుకురావాలని డిమాండు చేశారు. జర్నలిస్టులు నిజమైన వార్తలను వెలుగులోకి తీసుకురావాలన్నారు. జర్నలిస్టులకు త్వరలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీయూడబ్లూజేలో పనిచేసిన రఘునాథ్‌రావ్, కాశిపతి, విద్వాన్‌విశ్వం, పుల్లయ్య, రామక్రిష్ణ తదితరులను గుర్తుచేసుకున్నారు. జర్నలిజంలో ఇరవై సంవత్సరాలు పూర్తిచేసుకున్న జర్నలిస్టులను శ్రీనివాస్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మచ్చా రామలింగారెడ్డి, లక్ష్మినారాయణ, జర్నలిస్టులు, ఏపీయూడబ్ల్యూజే సభ్యులు పాల్గొన్నారు.

# ఓటు అడిగే అర్హత చంద్రబాబుకు లేదు

- రుణమాఫీ ఓ బూటకం
- నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?
- వైఎస్ జగన్



విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : రాబోయే ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే అర్హత ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. పాదయాత్ర శ్రీకాళహస్తికి చేరుకున్న సందర్భంగా పట్టణం లోని పెండ్లి మండపం వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించారు. వేలాది మంది కార్య కర్తలు, అభిమానులు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి జగన్ మాట్లా డుతూ ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి అధికా రంలోకి వచ్చారన్నారు. రాష్ట్రంలోని నిరుద్యో గులకు రూ.2 వేలు భృతి కల్పిస్తామని మాటిచ్చి మోసం చేశారన్నారు. జిల్లాలోని 2 చక్కెర కర్మా గారాలను మూసివేయించి రైతన్నలకు గిట్టు బాటు ధర లేకుండా చేశారని దుయ్యబట్టారు. ఆయన సొంత సంస్థ హెరిటేజ్‌కు లాభం చేకూర్చే ఉద్దేశంతో పాడిరైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేశారన్నారు. లీటరు నీళ్ల రూ.25 ఉంటే లీటరు పాలు 22 రూపాయలు చేశారని ఈ స్థితికి కారణం చంద్రబాబే అన్నారు. పశుసంరక్షణ పూర్తిగా గాలికి వదిలే శారని విమర్శించారు. రైతులు పంటలు పండిస్తే పంటలకు కనీస గిట్టుబాటు ధర కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. రాత్రి పూట కరెంటు ఇచ్చి రైతన్నలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.

**రుణ మాఫీలో విఫలం :** రైతన్నలకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంద న్నారు. రైతురుణాలు చెల్లించాలని బ్యాంకులు నోటీసులు పంపిస్తున్నాయని, చౌకదుకాణాల్లో కిరోసిన్, చక్కెర ఇచ్చేవారని, ప్రస్తుతం కేవలం బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నార న్నారు. వేలిముద్రలు సరిపోకపోతే అవి కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. శ్రీకాళహస్తి మండలంలో ఎన్టీపీసీఎల్ విద్యుత్ పరిశ్రమను స్థాపిస్తే దాన్ని పూర్తిగా నీరుకార్చేశారని విమర్శిం చారు. రోడ్డు వేయకపోవడంతో కర్మాగారం తయారు చేసే పరికరాలు బయటకు వెళ్లలేక పోతున్నాయని, ఈ పరిశ్రమను నీరుగార్చడంలో చంద్రబాబు ప్రథమ వ్యక్తి అన్నారు. ఆర్టీసీ ఛార్జీలను ఇప్పటి వరకు 3 సార్లు పెంచారని అయినా సంస్థ అప్పుల్లో అతలాకుతలం అవు తోందన్నారు. జిల్లాలో గ్రానైట్ కర్మాగారాల్లో వందలాది మంది పనిచేస్తుండేవారని, అయితే కరెంటు ఛార్జీలు పెంచడం, గ్రానైట్‌పై సుంకం అధికం చేయడంతో కార్మికులు రోడ్డున పద్దారన్నారు.

దేశంలో ఎంతో మంది ఔత్సాహికులు ఉన్నా రాజధాని నిర్మించేందుకు రాష్ట్రాన్ని సింగపూర్‌కు తాకట్టుపెట్టేయడం దారుణమన్నారు. ఎస్.ఎస్.కెనాల్, గాలేరు-నగరి, హంద్రీనీవా, పోలవరం తదితర ప్రాజెక్టులు మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడే ప్రారంభమయ్యాయని, వీటిని పూర్తి చేయకుండా దివంగత నేతపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచేసి సామాన్య ప్రజలను కోలుకోలేని విధంగా చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో ఏ ఒక్కరికి మేలు జరగలేదని దుయ్యబట్టారు. ఈ సభలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి మధుసూదన్‌రెడ్డి ప్రసంగించారు. దీనికి ముందు కోలాటాలు, జానపద నృత్యాలు దారిపొడవునా అలరించాయి.



## లెనిన్ స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఐక్య ఉద్యమాలు

### వామపక్షాలే దేశానికి ప్రత్యామ్నాయం : రావుల వెంకయ్య

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: విప్లవ స్ఫూర్తి దాత, సోషలిస్టు మార్గదర్శకులు లెనిన్ స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఐక్య ఉద్యమాల ద్వారా వామపక్ష ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో నగర సమితి సమావేశం జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు వంగమూడి కొండలరావు అధ్యక్షతన జరిగింది. అంతకుముందు లెనిన్ 94వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రావుల మాట్లాడుతూ రష్యాలో సోషలిస్టు నిర్మాణం కోసం లెనిన్ అనేక పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. రష్యా విప్లవం వలనే ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో విప్లవాలు వచ్చాయని, నేపాల్‌లో ఇటీవల కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో దేశంలో కూడా కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమయిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు జరగనున్న జిల్లా మహాసభల సందర్భంగా 16వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మున్సిపల్ స్టేడియం నుంచి ప్రజా ప్రదర్శన ప్రారంభమవు తుందని, మధ్యాహ్నం మూడు గంటలకు సుబ్రహ్మణ్య మైదానంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మీసాల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల కారణంగా దేశంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఐ నగర కార్యదర్శి నల్లా రామారావు మాట్లాడుతూ ఫిబ్రవరి 1న రాజమండ్రి నగర సమితి మహాసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తోకల ప్రసాద్, కిర్ల కృష్ణ, నల్లా భ్రమరాంబ, యడ్ల అప్పారావు, రాయి నాగేశ్వరరావు, షేక్ పెంటు సాహెబ్, వీసరపు రాంబాబు, కరిబెండి శ్రీనివాస్, పొడిపిరెడ్డి ఎర్రినాయుడు, ట్రాన్స్‌పోర్ట్ సెక్షన్ అప్పలనాయుడు, అపరాల సెక్షన్ ఆదినారాయణ, కాశాని శంకరరావు, శెట్టి లత్సాలు, శెట్టి నాగమణి, ముప్పన వీరభద్రరావు, పామర్తి సూర్యప్రకాశరావు, జె.ఎ.రామారావు, బీసరపు నాగబాబు, వానపల్లి సూర్యనారాయణ, పల్లికొండ ఈశ్వరరావు, మొగల్ జీనత్ బేగం, యేసు, నల్ల కుమారి, ఎ.వి.వి.సత్యనారాయణ, సప్పా రమణ, సుంకర శ్రీను పాల్గొన్నారు.

### న్యాయవ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు

## ప్రగతిశీలశక్తులు, మేధావులు కృషి చేయాలి

### ఓపీడీఆర్ సదస్సులో వక్తలు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: న్యాయవ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు ప్రగతిశీలశక్తులు, మేధావులు కృషి చేయాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) విజ్ఞప్తి చేసింది. సంస్థ కార్యాలయంలో ఆదివారం 'న్యాయవ్యవస్థ - ప్రస్తుత పరిణామాలు' అంశంపై కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఇటీవల అత్యున్నత న్యాయస్థానానికి చెందిన నలుగురు న్యాయమూర్తులు బహిరంగంగా ప్రధాన న్యాయమూర్తి వ్యవహారశైలిపై విమర్శలు చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు. ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేక ధర్మాసనాలను ఏర్పాటు చేయడంలో, వాటికి కేసులను కేటాయించడంలో, రోస్టర్ విధానాన్ని అమలు చేయడంలో సంప్రదాయాలను పాటించడం లేదని న్యాయమూర్తులు ఆరోపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఘటన కోర్టు ధిక్కారణ నేరం కిందకు వస్తుందని, న్యాయవ్యవస్థ పని తీరుపై బహిరంగ చర్చ జరగడానికి తలుపులు తెరచినట్లయిందన్నారు. దీంతో న్యాయవ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడంలేదని స్పష్టమవుతోందన్నారు. న్యాయవ్యవస్థలో రాజకీయ జోక్యం రోజురోజుకూ పెరిగిపోతోందనడానికి ఈఘటనే రుజువన్నారు. చుండూరు దళితుల కేసు, జహానాబాద్, బతానీతోలా మొదలైన చోట్ల, రణవీర్‌సేన దళితులను ఊచకోత కోసిన కేసుల్లో ఆయా రాష్ట్రాల హైకోర్టులు, కింది కోర్టులు ఇచ్చిన తీర్పులను కొట్టివేసి నిందితులను నిర్దోషులుగా వదిలివేసిన విషయాలను మననం చేసుకున్నారు. దేశంలో దళితులు, మహిళలు, మైనార్టీలు, గిరిజనులపై దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. హక్కుల కోసం నిరసన తెలిపే ప్రజలపై ప్రభుత్వాలు నిరంకుశంగా అణచివేత ప్రయోగిస్తుంటే న్యాయవ్యవస్థ ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు కె ఏసు, ప్రధాన కార్యదర్శి వి హనుమంతరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జె పాపారావు, ఉపాధ్యక్షుడు పి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో నీటి కొరత నివారణ ఎలా?



స్పెషల్ కరస్పాండెంట్ - విశాలాంధ్ర: భారతదేశంలో కరవు విలయతాండవం చేస్తోంది. గత 150సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత తీవ్రత కలవరపెడుతోంది. దేశ వ్యాపితంగా లక్షలాది మంది కరవుకాటు బాధితులుగా ఉన్నారు. అపారంగా జల వనరులున్నా నీటి ఎద్దడి లేని ప్రాంతం ఏదంటే జవాబు దొరకని పరిస్థితి ఉంది. జీవనదీ జలాలు సంరక్షణకు నోచుకోవడం లేదు. ఏటా లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతోంది. ఈ నీటిని సంరక్షించే విధానం రూపొందించడంలో పాలకులు ఘోరంగా విఫలమైనారు. పరిస్థితి ఇలానే కొనసాగితే 2030నాటికి మానవ అవసరాలకు కావాల్సిన నీటిలో సగం మాత్రమే లభ్యమయే పరిస్థితి ఎదురుకానుందని ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు మిహిర్‌షా హెచ్చరించారు. రెండవది, అటవీ సంరక్షణ విషయంలోనూ పాలకుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఏఏటికాయేడు అడ్డగోలు నరికివేతలతో అడవుల విస్తీర్ణం బాగా తగ్గిపోతోంది. ఫలితంగా పర్యావరణ సమతుల్యతకు తూట్లు పడటం,దాని నుంచి భూతాపం అదుపు తప్పడం.. వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నం కావడం వెరసి నీటి ఎద్దడి సమస్య కళ్లెదుట కరాళ నృత్యం చేస్తోంది. వేలాది మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అసంఖ్యాక పశు సంపద మృత్యువాతకు గురవుతోంది. ఈ ఉపద్రవాన్ని నివారించడంలోనూ, ఉపశమన సహాయక చర్యలు అమలు చేయడంలోనూ కేంద్రంలోని బీజేపీ పాలకులూ రాష్ట్రంలోని తెలుగుదేశం పాలకులూ ఘోరంగా విఫలమవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా లభ్యమవుతున్న జలంలో కేవలం రెండు శాతం జలమే స్వచ్ఛమైంది. ఇందులోనూ అధిక భాగం రసాయనాలు, పారిశ్రామిక వ్యర్ధాలు, వృథా, ఎరువుల మిశ్రమాల కలయికతో కలుషితమైంది. నదులు, జలాశయాల్లోని నీటి వాడకంతోనే సరిపుచ్చుకోకుండా భూగర్భజలాలను అమితంగా తోడేందుకు అలవాటు పడిపోయిన పరిస్థితి ఉంది.. లభ్యమవుతున్న నీరంతా మనకేననే ఒక స్వార్ధ చింతన ప్రబలడం వల్ల ప్రకృతిలోని వృక్ష, పశుపక్ష్యాదులు వంటి ఇతర జీవుల అవసరాలను విస్మరణకు గురవుతోంది. ఫలితంగా గడచిన కొన్ని దశాబ్దాల్లో భూమ్మీదున్న అటవీ జంతుజాలంలో 50శాతం మేర అంతరించిపోయింది. నదులు ఎండి పోతున్నాయి. ఇక ఇపుడు సముద్ర జలాల భద్రతా ప్రశ్నార్ధకమైన ఆందోళనకర పరిణామం ఎదురుగా ఉంది. అడవులను విచక్షణా రహితంగా నరికివేస్తున్నందున భూగర్భ జలాలు ఆందోళనకర స్థాయిలో అంతరిస్తున్నాయి. ప్రకృతి సహజ వనరులన్నిటినీ యథాశక్తి సంరక్షించాల్సింది పోయి భక్షిస్తున్నందునే నీటి ఎద్దడి తీవ్రత రాన్రానూ ఎక్కువవుతోంది. నీటి సంరక్షణకు జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవాలి. అటవీ విస్తీర్ణం పెరిగేలా మొక్కలు ఎక్కువగా నాటడం ద్వారా జల సంరక్షణకు దగ్గర దారి ఏర్పడుతుంది. లభ్యమవుతున్న నీటి వినియోగంలో జాగరూకత ఉండాలి. నీటి వినియోగంపై నియంత్రణ ఉండాలి. నగరాలు, పరిశ్రమలు లేదా వ్యవసాయానికి ఎక్కడైనా సరే నీటి వృథాను అరికట్టాలి. ఈ దిశలో మనిషి తన జీవనశైలిని చక్కదిద్దుకోవాలి. లభ్యమవుతున్న నీటిలో 80శాతాన్ని వ్యవసాయానికే వినియోగిస్తున్నాము. అదే సమయంలో నీటి లభ్యత సాధ్యాసాధ్యాలను విస్మరించి విచక్షణారహిత పారిశ్రామికీకరణను కొనసాగిస్తున్నాము అమెరికాలో పరిశ్రమలు ప్రత్యేకించి ఇంధన పరిశ్రమలకు 60శాతం నీటి వినియోగం జరుగుతుంది.. అక్కడ వ్యవసాయానికి కేవలం 30శాతం నీటి వినియోగం జరిగే పరిస్థితి ఉంది.

మరో ముఖ్య విషయం ..వరదనీటి సంరక్షణ. సంరక్షించిన వరద నీటిని శుద్ధి చేసి మానవ వినియోగానికి అందుబాటులో ఉంచడమూ. ఈ దిశలో ఢిల్లీ జల మండలి(డీజేబీ) 2009లో చేపట్టిన ప్రయోగం కొంత వరకు ఆదర్శనీయం. యమున ప్రాజెక్టుగా వ్యవహరించే ఈప్రయోగం నుంచి రోజూ 25మిలియను గ్యాలన్ల నీటిని ఢిల్లీకి అందించగలుగుతున్నారు. ఈక్రమంలో సుమారు రూ.250కోట్ల లాభాలనూ దక్కించుకోగలిగారు. భూగర్భజలాలు, వరదనీటి సంరక్షణ విషయంలో అనుసరించాల్సిన విధివిధానాల అమలుకుగాను రూ.13కోట్ల ప్రజాధనం వెచ్చిస్తున్నారు. ఈ తరహాలో ఇతర ప్రాంతాల్లోనూ స్థిరమైన ఫలితాలను సాధించేందుకు తగిన ఆచరణాత్మక చర్యలు తీసుకోవాలి. వాస్తవానికి వరద ప్రాంతాల్లో నీటి లభ్యత ఏపరిమాణంలో ఉంటుందనేందుకు స్పష్టమైన ఆధారాల్లేవు. అలానే వరదనీరు ఏమేరకు సంరక్షిస్తున్నారు. వినియోగిస్తున్న పరిమాణం, దుర్వినియోగమవుతున్న పరిమాణం ఇత్యాది వివరాలు సమగ్రంగా ఉండాలి. వ్యవసాయం, పరిశ్రమల రూపంలో వరదనీటి మైదాన ప్రాంతాల్లోనూ భూగర్భ జలాలు కలుషితమవుతున్న అనుభవాన్ని తమిళనాడులో గుర్తించారు. వాస్తవానికి ఈతరహా అనుభవాలు దాదాపు అన్ని నదీ తీర ప్రాంతాల్లోనూ జరుగుతూనే ఉంటుంది.. జల వనరుల లభ్యత విషయంలో జల వనరుల మంత్రిత్వశాఖ, జల కమిషను లేదా మరే ఇతర ప్రభుత్వ యంత్రాంగానికీ ఒక స్పష్టమైన అవగాహన ఉన్నట్లు కనిపించడం లేదు. ఈ విషయంలో ఆయా విభాగాలు తక్షణం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. ఢిల్లీలోని యమున ప్రాజెక్టు తరహాలో ప్రాజెక్టు స్థాపనకు సుమారు రూ.100కోట్ల వ్యయమవుతుంది. దీని నుంచి ఏటా సుమారు 100ఎంసీఎంల స్వచ్ఛమైన నీటిని పొందవచ్చు. మరో ముఖ్యమైన విషయం ఈకాస్త పెట్టుబడికిగాను సుమారు రూ.500కోట్ల లాభాలనూ అర్జించవచ్చు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 10శాతం మాత్రమే ఏటా దీని నిర్వహణకు అవుతుంది. కొత్త పథకాల అమలు విషయంలో ప్రభుత్వ యంత్రాంగం అలవిమాలిన నిర్లక్ష్యం చూపుతున్నంత కాలం ఆయా రంగాల్లో ప్రగతి కుంటుపడుతూనే ఉంటుంది. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగిన విధంగా ప్రకృతి వనరుల సంరక్షణ, యాజమాన్య వైవిధ్యాలు అమలు జరిగినే నీటి ఎద్దడికి కొంత మేర పరిష్కారం లభిస్తుంది.

# ఎలా గెలవాలో నేర్చుకోవాలి..!



భారత మాజీ ఆల్‌రౌండర్ మనోజ్ ప్రభాకర్

**న్యూఢిల్లీ:** ఇన్నింగ్స్ మొదటి 20 ఓవర్లలో టీమిండియా భారీగా పరుగులు కానీ, బౌలింగ్ కానీ చేస్తే దక్షిణాఫ్రికాలో గెలిచే అవకాశం ఉంటుందని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ మనోజ్ ప్రభాకర్ తెలిపాడు. ఇతడు భారత్ తరపున అనేకసార్లు ఓపెనర్‌గా, బౌలర్‌గా కూడా రాణించాడు. 'మొదటి 20 ఓవర్లలో మనం ఎలా బౌలింగ్ కానీ, బ్యాటింగ్ కానీ చేయాలో తెలియకపోలేదు అక్కడ గెలవడం కష్టం' అని తెలిపాడు. మనం ఫీల్డింగ్ సైడ్ ఉంటే బాల్ ఎలా వేయాలో తప్పనిసరిగా తెలిసి ఉండాలి. వచ్చే బాల్స్‌ను అడ్డుకోలేం. క్రీజ్‌లో ఉండాలంటే తప్పనిసరిగా డిఫెన్స్ ఆడాలి. ఎలా వెళ్లాలో కూడా తెలియాలి. ఎందుకంటే నేను కూడా ఓపెనర్‌గా దిగిన సందర్భాలున్నాయి. నేను నిలదొక్కుకోగా లేనిది, వారెందుకు నిలదొక్కుకోలేరు' అని ప్రభాకర్ తెలిపారు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో ఢిల్లీకి సహాయ కోచ్‌గా ప్రభాకర్ పనిచేస్తున్నాడు. 'మనకు బాల్ ఎలా వేయాలో తెలియదు. రంజీట్రోఫీల్లో కూడా బాల్‌ను ఎలా కొట్టాలో తెలుసు. ఈ సీజన్ మొత్తాన్ని చూశా. షార్ట్‌బాల్‌ను ఎలా ఆడాలో ఎవరికీ తెలియదు' అని తెలిపారు. రెండో టెస్టులో భువీని బెంచ్‌కే పరిమితం చేయడంపై ప్రభాకర్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'అలాంటి పిచ్‌పై భువీ సరిగా బౌలింగ్ చేయలేడని వారు అనుకోవడం నాకు అర్థం కాలేదు. గాలిలోనే బాల్‌ను స్వింగ్ చేయడం చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. వారిలో భువీ ఒకడు. మిగతా బౌలర్లు వికెట్ దగ్గర మాత్రమే స్వింగ్ చేయగలరు. అతడైతే గాలిలో కూడా బాల్‌ను స్వింగ్ చేయగలడు. అలాంటి తరహా బౌలర్ ఉన్నప్పుడు, అతడిని ఎందుకు ఉపయోగించుకోరు. ఇలాంటి విషయాలను అర్థం చేసుకోవాలి' అని తెలిపాడు. 24 నుంచి ప్రారంభ మయ్యే జొహెన్నెస్‌బర్గ్ మ్యాచ్ గెలిచేందుకు మార్గమేంటని ప్రశ్నించగా, 'టెస్టు మ్యాచ్ గెలవాలంటే ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్, ఓపెనింగ్ బౌలర్లు రాణించాలి. కోచ్ రవిశాస్త్రి బాల్‌ను ఏ విధంగా వదిలేయాలో చెప్పడం లేదు' అని పేర్కొన్నాడు. 'వన్డేలు, టీ20ల ఆధారంగా టెస్టు టీంను ఎంపిక చేయడమనేది సిగ్గుచేటు. రిషబ్ పంత్‌ను టెస్టుల్లో ఆడనిస్తారా? లేదుకదా?. అయితే ఈ మ్యాచ్‌లో మాత్రం తప్పనిసరిగా రహానెను ఆడించాలి' అని వివరించాడు. పాండ్యను కపిల్‌తో పోల్చడంపై మాట్లాడుతూ 'పాండ్యను తనతో పోల్చవద్దని కపిల్ చెప్పడం సరైనదే. ప్రాథమిక అవసరాలు అనేవి నేర్చుకోవాలి. అవి కపిల్ వద్ద చాలా దృఢంగా ఉన్నాయి. చివరగా, ప్రభాకర్ మాట్లాడుతూ టీమిండియా ప్రదర్శన ఇలానే ఉండే రాబోయే ఇంగ్లండ్, ఆస్ట్రేలియాల్లో కూడా ప్రదర్శన ఇలానే ఉంటే పరాజయాలు తప్పవని తెలిపాడు.



## దివ్యాంగుల క్రికెట్ విజేతలపై ప్రశంసల జల్లు

**న్యూఢిల్లీ:** డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి వరుసగా రెండోసారి అంధుల ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత జట్టుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోడీ, క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, వీవీఎస్ లక్ష్మణ్ అభినందనలు తెలియజేశారు. ఆటగాళ్లపై ప్రశంసల జల్లు కురిపించారు. 'మీ ఆటతో, గొప్ప దృక్పథంతో దేశం గర్వించేలా, ప్రతి భారతీయుడూ స్ఫూర్తి పొందేలా చేశారు. మీరు నిజమైన చాంపియన్లు' అని మోడీ అన్నారు. 'అంధుల ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు అభినందనలు. జట్టు తమ నైపుణ్యాలను, పట్టుదలను, ఆత్మవిశాస్వాన్ని ప్రదర్శించింది. మీరు సాధించిన విజయానికి జాతి గర్విస్తోంది' అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ట్వీట్ చేశారు. 'పెద్దలన్నట్టుగా సంకల్ప బలం ఉంటే విజయం దానంతటదే సిద్ధిస్తుంది. భారత జట్టుకు ప్రణామం. అంధుల ప్రపంచకప్ గెలిచినందుకు మొత్తం జట్టు సభ్యులందరికీ అభినందనలు' అని సచిన్ ట్వీట్ చేశారు. వీవీఎస్ లక్ష్మణ్ సైతం ట్విటర్‌లో అభినందనలు తెలియజేశారు.

# నాదల్ జోరు



**మెల్‌బోర్న్:** స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో అదరగొడుతున్నాడు. అర్జెంటీనా ఆటగాడు డిగో ష్వార్జ్‌మన్‌తో జరిగిన హోరాహోరీ సుదీర్ఘ పోరులో విజయం సాధించాడు. పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్లో 6-3, 6-7(4/7), 6-3, 6-3తో గెలుపొంది క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. నాలుగు గంటల పాటు జరిగిన ఈ పోరు అత్యంత ఉత్కంఠగా సాగింది. 2016 యూఎస్ ఓపెన్ తర్వాత డిగోపై నాదల్‌కు ఇదే కఠిన పోరు. నాదల్ ఆస్ట్రేలియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్ చేరుకోవడం ఇది పదోసారి. స్విస్ దిగ్గజం ఫెదరర్ తర్వాత ఈ రికార్డు సాధించించి స్పెయిన్ బుల్ మాత్రమే. క్వార్టర్స్‌లో రఫా ఆరో సీడ్ క్రొయేషియా ఆటగాడు మారిన్ సిలిక్‌తో తలపడనున్నాడు. అతడిపై నాదల్‌కు 5-1తో మంచి రికార్డే ఉంది. రఫా క్వార్టర్స్ చేరుకోవడం ద్వారా తన నంబర్‌వన్ ర్యాంకు ఢోకా లేకుండా చేసుకున్నాడు.

## హర్మన్‌ప్రీత్‌కు జాబ్ కష్టాలు



**న్యూఢిల్లీ:** గత ఏడాది ఐసీసీ మహిళల ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లడంలో హర్మన్‌ప్రీత్ కౌర్ కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు డీఎస్పీ ఉద్యోగ హోదాను కల్పించింది. కానీ, ఇప్పటికీ హర్మన్ కొత్త ఉద్యోగంలో చేరలేకపోయింది. కారణం పాత జాబు నుంచి ఆమెకు రిలీవింగ్ లెటర్ రాకపోవడం. వివరాల్లోకి వెళితే.. మూడు సంవత్సరాల క్రితం హర్మన్‌ప్రీత్ కౌర్ పశ్చిమ రైల్వేలో ఉద్యోగిగా చేరింది. ఆ సందర్భంగా ఐదేళ్ల బాండ్‌పై సంతకం చేసింది. మూడేళ్లు మాత్రమే పూర్తవ్వడంతో హర్మన్‌కు రైల్వే అధికారులు రిలీవింగ్ లెటర్ ఇవ్వట్లేదు. లెటర్ కావాలంటే రూ.27 లక్షలు కట్టాలని రైల్వే అధికారులు కోరుతున్నట్లు హర్మన్ తండ్రి హర్మందర్ సింగ్ తెలిపారు. తమ వద్ద అంత డబ్బు లేదని, కట్టలేమని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీనిపై తాజాగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ స్పందించారు. హర్మన్‌ప్రీత్ కౌర్‌కు వెంటనే రిలీవింగ్ లెటర్ ఇవ్వాలని ఇప్పటికే రెండుసార్లు పశ్చిమ రైల్వేకు లేఖ రాశానని, త్వరలోనే ఆమె డీఎస్పీ ఉద్యోగంలో చేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇవన్నీ ఆరోపణలని, తాము రిలీవింగ్ లెటర్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రైల్వే అధికారులు చెబుతున్నారు.

## శ్రీలంక సిరీస్‌తో ఒరిగిందేమీ లేదు : హర్భజన్



**కోల్‌కతా:** దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు స్వదేశంలో జరిగిన శ్రీలంక సిరీస్‌తో భారత్‌కు ఒరిగిందేమీ లేదని వెటరన్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అన్నాడు. సఫారీ జట్టుతో జరుగుతున్న సిరీస్‌లో ఇప్పటికే కోహ్లిసేన 0-2తో వెనకబడింది. ఈ నేపథ్యంలో భారత్ సన్నాహంపై విపరీతంగా చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. 'శ్రీలంకతో సిరీస్ వల్ల టీమిండియాకు తగిన ప్రయోజనం కలగలేదని నా భావన. దాంతో ఒరిగిందేమీ లేదు. అంతకన్నా ముందుగా కొందరు ఆటగాళ్లు దక్షిణాఫ్రికాకు వెళ్లినా బాగుండేది. అలా కుదరని పక్షంలో సఫారీ పర్యటనకు సన్నాహకంగా ధర్మశాలలో ఎక్కువగా సాధన చేయాల్సి ఉండేది. ఆ మైదానం చాలా ఎత్తులో ఉంటుంది. వాతావరణం చల్లగా ఉంటుంది. సీమ్, బౌన్స్, స్వింగ్‌కు అనుకూలిస్తుంది' అని భజ్జీ అన్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి రెండు టెస్టులకు తుది జట్టులో అజింక్య రహానెను ఎంపిక చేయకపోవడం విమర్శలకు దారితీసింది. ప్రస్తుత పరిస్థితుల్లో తుది జట్టులో స్థానంపై ఎవరికీ గ్యారెంటీ లేదని హర్భజన్ అన్నాడు. 'నేను కొన్ని గణాంకాలు పరిశీలించాను. విరాట్ సారథ్యంలో 30 టెస్టుల్లో రహానె సగటు 40 కన్నా తక్కువగా ఉంది. దాంతో పాటు గతేడాది అతడు చాలినన్ని పరుగులు చేయలేదు. అందరూ అనుకుంటున్నట్టు రహానెను తీసుకున్నా భారత్ 0-2తో ఓటమిపాలైతే ఏం చేసేవారు. అతడి స్థానంలో రోహిత్‌ను తీసుకోమని చెప్పేవారు. సారథి సాదక బాధకాలను, అతడి దృక్పథాన్నీ మనం అర్థం చేసుకోవాలి. భువి విషయంలో మాత్రం 50-50శాతం అవకాశాలు ఉండేవి. ఇషాంత్‌తో పోలిస్తే ఈ కాలంలో భువి పెద్ద మ్యాచ్ విన్నర్. భువి అత్యుత్తమంగా ఆడిన ప్రతిసారీ జట్టుకు లాభం కలిగింది. టీమిండియా పుంజుకుని 1-2తో ఆధిక్యాన్ని తగ్గించగలదని అనుకుంటున్నా' అని భజ్జీ తెలిపాడు.

## కస్తూర్బా బాలికల క్రీడా పోటీలు ప్రారంభం



**విశాలాంధ్ర-విశాఖపట్నం:** విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి కస్తూర్బా బాలికల క్రీడా పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 13 జిల్లాల నుంచి 14వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. జాతీయ బాలల దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ఉత్సవాల్లో వివిధ జిల్లాలకు చెందిన కస్తూర్బా పాఠశాలల విద్యార్థినులు పాల్గొననున్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, వాల్ బ్యాడ్మెంటెన్, షెటిల్ బ్యాడ్‌మెంటెన్, తైక్వాండో, పరుగుపందాలు, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. సర్వశిక్షా అభియాన్, ఆంధ్రప్రదేశ్ క్రీడల విశాఖ కేజీబీవీ సంయుక్తంగా చేపట్టిన ఈ క్రీడోత్సవాల్లో పోటీల్లో పాల్గొన్న వారికి నగదు బహుమతులు కూడా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో విజేతలైన వారిని జాతీయస్థాయిలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కీడాకారులకు పదివేలు విలువైన స్పోర్ట్స్ కిట్లు, దుస్తులు అందజేయనున్నారు.

## భారత్‌పై బెల్జియం విజయం



**తౌరంగ (న్యూజిలాండ్):** బెల్జియం చేతిలో భారత్ మరోసారి పరాజయం పాలైంది. నాలుగు దేశాల ఆహ్వానిత టోర్నీలో భాగంగా జరిగిన ఉత్కంఠగా జరిగిన తొలి దశ తుదిపోరులో టీమిండియా 1-2తో ఓటమి చవిచూసింది. బెల్జియం ఆటగాళ్లు టామ్ బూన్ (4ని॥), సెబాస్టియన్ డాకిర్ (36 ని॥) గోల్స్ చేశారు. భారత్ తరపున మన్‌దీప్ సింగ్ (19 ని॥) ఒక్కడే గోల్ చేశాడు. తుది పోరులో రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆట ప్రారంభమైన మూడో నిమిషంలోనే బెల్జియంకు పెనాల్టీ కార్నర్ లభించింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్న ప్రత్యర్థి జట్టు గోల్ చేసింది. ఆ తర్వాత రెండు జట్లు బంతిని అధీనంలో ఉంచుకునేందుకు పోటీపడ్డాయి. రెండో క్వార్టర్‌లో టీమిండియా ప్రత్యర్థి గోల్‌పోస్ట్ ముందు వలయాలు ఏర్పరిచి పదేపదే దాడులు చేసింది. ఈ క్రమంలోనే రూపిందర్‌పాల్ ఇచ్చిన పాస్‌ను మన్‌ప్రీత్ సింగ్ చక్కగా స్లైస్ చేసి 1-1తో స్కోర్ సమం చేశాడు. ఆ తర్వాత బెల్జియం భారత్‌పై ఒత్తిడి పెంచింది. బంతి దొరకనివ్వకుండా అడ్డుకుంది. ఆట 36వ నిమిషంలో మరో గోల్ చేసి ఆధిక్యాన్ని 2-1కు పెంచుకుంది. చివరి క్వార్టర్‌లో భారత్ వేగంగా దాడులు చేసినా ప్రత్యర్థి గోల్‌కీపర్ అద్భుతంగా వాటిని తిప్పికొట్టాడు. దీంతో ఓటమి తప్పలేదు. రెండో దశలో భాగంగా జనవరి 26న ఆతిథ్య జట్టు న్యూజిలాండ్‌తో భారత్ తొలి మ్యాచ్‌లో తలపడనుంది.

## జొహన్నెస్‌బర్గ్ కూడా బౌన్సీనే..!

**జొహాన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌ను ఇప్పటికే కోల్పోయిన భారత్‌కు ఆఖరిటెస్టులోనూ కష్టాలు తప్పేలా లేవు. అక్కడ కూడా వారికి మరింత బౌన్సీపిచ్ ఎదురుకానుంది. 2015 లో భారత టూర్‌లో ఎదురైన పరాభవానికి ప్రతీకారంగా కోహ్లిసేనను వైట్‌వాష్ చేయాలనే ఆలోచనతో దక్షిణాఫ్రికా ఉంది. దీనికి తగ్గట్టుగా వాండరర్స్ పిచ్‌ను సిద్ధం చేస్తున్నారు. పిచ్ గురించి ఇప్పుడే మాట్లాడేందుకు క్యురేటర్‌కు అనుమతి లేకపోయినా మైదానాన్ని గమనిస్తే పూర్తి పచ్చికతో కనిపిస్తోంది.

# జనసేన వైపు... నేతల చూపు

- నేటి నుంచి 'పవన్' గాలులు
- ఏపీ రాజకీయాలకు కొత్తరూపు
- చిరంజీవి రిటైర్..?

**విశాలాంధ్ర-అమరావతి:** జనసేన అధిపతి పవన్ కల్యాణ్ రాజకీయ పర్యటనలు ప్రారంభంకానున్నాయి. తన ఇష్టదైవం కొండగట్టు వీరాంజనేయస్వామిని దర్శించుకొని సోమవారం ఆయన పర్యటన షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. జనసేన పార్టీ ప్లీనరీ సమావేశాలు కూడా త్వరలోనే జరగనున్నాయి. త్వరలో జరగనున్న పర్యటనలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసేన సేవా కార్యవర్గాలను నియమించనున్నారు. ఇప్పటివరకు అప్పుడప్పుడు కొన్ని ప్రాంతాలకు వెళ్లడం, కొన్ని సమస్యలపై సభల్లో, పత్రికల్లో మాటాడటం చేసే పవన్ ఇక నుంచి పూర్తి రాజకీయ కార్యక్రమాల్లో నిమగ్నం కానున్నారు. జనసేన పార్టీ నేతలు తెలంగాణ కన్నా ఏపీ రాజకీయాలపైనే ఎక్కువ దృష్టి పెట్టనున్నట్లు తెలిసింది. పవన్ పార్టీ నిర్మాణానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అన్ని చోట్ల కార్యవర్గాలు ఏర్పాటు కానున్నాయి. పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగుతుండటంతో ఏపీ రాజకీయాల్లో కొత్త రాజకీయ సమీకరణాలు చోటు చేసుకుంటాయని రాజకీయ సీనియర్లు అంచనాలు వేస్తున్నారు. 2014 ఎన్నికల్లో పవన్ టీడీపీ, బీజేపీలకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ తర్వాత కేంద్రంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడంతో విమర్శలకు దిగారు. దీంతో బీజేపీతో ఆయనకు దాదాపు సంబంధాలు తెగిపోయాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఆయన సత్సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారు. రాష్ట్రంలోని కొన్ని సమస్యలపై మాట్లాడుతూ తాను ప్రభుత్వానికి వ్యతిరేకం కాదంటూ చెప్పుకొచ్చారు. రెండు నెలల క్రితం ఏపీ సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రి చంద్ర బాబుతో భేటీ అయ్యారు. ఇప్పటివరకు పవన్ వ్యవహ రించిన తీరు ఎలా ఉన్నా ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చి రాష్ట్రంలో పర్యటన ప్రారంభించిన తర్వాత చంద్రబాబుతో, ప్రభుత్వంతో ఆయన వ్యవహారతీరు ఎలా ఉంటుందన్న దానిపై రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేసి తాను అన్ని సమస్యలు తెలుసుకుంటానని ఆయన చెబుతున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నప్పుడు ఆ సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీ నేతగా స్పందించాల్సి ఉంటుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పవన్ పోరాటం చేస్తారా ? అన్న అంశంపై అందరిలో సందేహాలు నెలకొన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పేరుతో పాదయాత్ర చేస్తూ చంద్రబాబు ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అదే తరహాలో పవన్ టీడీపీపై విమర్శల బాణం ఎక్కుపెట్టకుండా ప్రజాభిమానం చూరగొనడం అంత సులభం కాదని రాజకీయ సీనియర్ల వ్యాఖ్య. తనకు కులం ఆపాదించవద్దని పవన్ చెబుతున్నా, ముద్రగడ పద్మనాభంతో కొద్దిరోజుల క్రితం జనసేన ప్రతినిధులు సమావేశం జరిపారు. త్వరలో పవన్‌తో ముద్రగడ సమావేశం అవుతారని జనసేన పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇదిలా ఉండగా రానున్న ఎన్నికల్లో ఏపీ రాజకీయాల్లో పవన్ కల్యాణ్ జనసేన కీలకపాత్ర పోషిస్తుందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఇటీవల వ్యాఖ్యానించారు. దీనికి తగ్గట్టుగానే అటు టీడీపీ, ఇటు వైసీపీలో చోటు దక్కని వారంతా పవన్ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. దీనికి తోడు రాజ్యసభ సభ్యుడు, సినీ నటుడు చిరంజీవి త్వరలో రాజకీయాల నుంచి రిటైర్ అవుతారని ప్రచారం ప్రారంభమైంది. ఆయన రాజ్యసభ పదవీ కాలం ఏప్రిల్ 2న ముగియనుంది. పవన్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తుండటంతో తాను వేరే పార్టీలో ఉండి సోదరుడికి వ్యతిరేకంగా వ్యవహ రించడం సరికాదని, అందువల్ల రాజకీయాల నుంచి విరమించుకుని సినిమాలకే పరిమితమవడం మేలన్న అభిప్రాయంలో ఆయన ఉన్నట్లు సమాచారం. పవన్ కల్యాణ్ తెలంగాణలో 14 రోజులు పర్యటించనున్నారని, ఆ తర్వాత పూర్తిగా ఏపీలోనే రాజకీయ కార్యకలాపాలు కొనసాగిస్తారని తెలిసింది. ఏది ఏమైనప్పటికీ పవన్ పర్యటనలతో ఏపీ రాజకీయాలు కొత్తరూపు సంతరించుకోనున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

'టెట్' షెడ్యూలు

# యథాతథం

- ఫిబ్రవరి 5 నుంచి 15వరకూ పరీక్షలు
- నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు
- మంత్రి గంటా ప్రకటనపై అభ్యర్థుల నిరుత్సాహం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) యథాతథంగా కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ముందస్తు షెడ్యూలు ప్రకారం టెట్ పరీక్షలను ఫిబ్రవరి 5 నుంచి 15 వరకూ నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇటీవల భాషా పండి తుల కోసం టెట్ పేపర్-3ని అదనంగా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. డీఎడ్-2016-18, బీఎడ్, చివరి ఏడాది పరీక్షలు రాస్తున్న భాషా పండితులకు టెట్ పరీక్ష రాసుకునేందుకు అవకాశం కల్పించారు. గత టెట్ నిబంధనల ఆధారంగా పేపర్-2లో లాంగ్వేజీ పండిట్లకు గతంలో సోషల్ స్టడీస్/మ్యాథ్స్/సైన్స్‌కు 60 మార్కులకు రాయాలి. భాషాంశాల అభ్యర్థుల విన్నతుల మేరకు ప్రత్యేకంగా ప్రత్యేకంగా పేపర్-3ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పేపర్‌లో భాషాంశాలకు-60 మార్కులను కేటాయించారు. దీంతో సోషల్ స్టడీస్/ మ్యాథ్స్/సైన్స్ నుంచి వారికి మినహాయింపునిచ్చారు. 60 మార్కుల భాషాంశాల సిలబస్‌ను డీఎస్సీ స్థాయిలో పొందుపరిచారు. రెండు వారాల్లో విస్తృతంగా ఉన్న సిలబస్‌ను అధ్యయనం చేయడం వారికి కష్టతరంగా మారింది. దీంతో టెట్‌ను మరో నెల రోజులపాటు వాయిదా వేయా లంటూ ప్రభుత్వానికి పలువురు విన్నవించారు. 150 మార్కుల టెట్‌కు ఫిబ్రవరి 5 నుంచి 15వరకూ ఆన్ లైన్లో పరీక్షలు నిర్వహిస్తారు. అటు టెట్‌కు ఆన్‌లైన్లో దరఖాస్తు ప్రక్రియ ఈనెల 22వ తేదీ సోమవారంతో ముగియనుంది. దాదాపు నాలుగున్నర లక్షల దరఖాస్తులు పోటెత్తాయి. ఇందులో అత్యధికంగా టెట్ పేపర్-2(సోషల్ స్టడీస్) అభ్యర్థులు ఉన్నారు. టెట్‌ను ఫిబ్రవరి 5వ తేదీ నుంచి యథాతథంగా నిర్వహిస్తామని మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటిం చడంతో అభ్యర్థులు నిరాశకు గురయ్యారు. మరో నెల పొడిగించాలని వారు అభ్యర్థిస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.